

కొండపిలో ఎక్స్‌కవేటర్‌తో చెత్త తొలగింపు పనులను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి



ఒంగోలులోని కొత్తమామిడిపాలెం వెళ్లే రోడ్డులో వ్యర్థాలతో సుందరంగా రూపొందించిన పార్కు

వ్యర్థాలతో అద్భుతాలు

- ఒంగోలులో ట్రిపుల్‌ఆర్ (రెడ్యూస్.. రీయూజ్.. రీసైకిల్) పార్కు
- అబ్బురపరుస్తున్న బొమ్మలు.. ఆకట్టుకుంటున్న డిజైన్లు
- కార్పొరేషన్ అధికారుల వినూత్న ఆలోచనకు కార్యరూపం

7

ప్లాస్టిక్‌పై సమరం

- స్వచ్ఛాంధ్రలో అదే ప్రధానాంశంగా నిర్వహణ
- జిల్లావ్యాప్తంగా ర్యాలీలు
- వస్త్ర సంచుల పంపిణీ, ప్రతిజ్ఞలు
- కొండపిలో పాల్గొన్న మంత్రి డాక్టర్ స్వామి
- ఇతర ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారుల భాగస్వామ్యం

ఒంగోలు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మనిషి ఆరోగ్యానికి తీవ్ర హానిచేసే ప్లాస్టిక్ వాడకంపై ప్రభుత్వం సమరం ప్రారంభించింది. ప్రతినెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర పేరుతో కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈసారి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై దృష్టిపెట్టింది. ప్లాస్టిక్ వాడకం వలన జరిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రత్యామ్నాయంగా వస్త్ర, జూట్ సంచులు వాడాలని కోరుతూ వాటిని పంపిణీ చేసే కార్యక్రమాలను చేపట్టారు. జిల్లావ్యాప్తంగా శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అవగాహన ర్యాలీలు, సభలు, సమావేశాలు, ప్రజలతో ప్రతిజ్ఞలతోపాటు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల మొక్కలు కూడా నాటారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి కొండపిలో అవగాహన ర్యాలీలో పాల్గొనడంతోపాటు అక్కడి పంచాయతీలో చెత్త తరలింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వయంగా ఎక్స్‌కవేటర్‌ను నడిపి చెత్తను తొలగించారు. ఒంగోలులో స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కలెక్టర్ తమీమ్ అన్సారియాలు నగరంలోని కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులకు

మిగతా 6వ పేజీలో



చీమకుర్తిలో జూట్ సంచులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్



ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలపై ముద్రించిన కరపత్రాలను మార్కాపురంలో వ్యాపారులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి



కనిగిరిలో మహిళా వ్యాపారికి ప్లాస్టిక్ వినియోగించవద్దని సూచిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర



ఒంగోలులోని కూరగాయల మార్కెట్‌లో వస్త్ర సంచులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, కలెక్టర్ అన్సారియా, మేయర్ సుజాత

మహిళల భద్రతకు పెద్దపీట

- శక్తి టీంలను ప్రారంభించిన ఎస్పీ దామోదర్
- జిల్లాలో ఆరు ఏర్పాటు

7



శక్తి టీంకు సూచనలిస్తున్న ఎస్పీ దామోదర్



రేషన్ బియ్యాన్ని తరలిస్తూ ఇటీవల త్రోవగుంట సమీపంలో పట్టుబడిన లారీ (ఫైల్)

రూటు మార్చిన రేషన్ మాఫియా

- అడ్డదారుల్లో బియ్యం తరలింపు
- లారీల్లో కాకుండా చిన్నచిన్న వాహనాల వినియోగం
- గోతాలు కూడా మార్చకుండా నేరుగా బ్లాక్ మార్కెట్‌కు
- ఎన్‌జీపాడు మండలంలో 624 బస్తాలను పట్టుకున్న అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యం అక్రమ రవాణాలో వ్యాపారులు రూటు మార్చారు. గతంలో ఒక చోట నిల్వ చేసి, ఆ తర్వాత గోతాలు మార్చి లారీల్లో మిల్లులకు తరలించేవారు. ఆ సమయంలో అధికారులకు సమాచారం అంది దాడులు చేసి పట్టుకునే వారు. ఈ నేపథ్యంలో వ్యాపారులు పంథా మార్చారు. దుకాణాల వద్ద కొనుగోలు చేసిన బియ్యాన్ని చిన్నచిన్న వాహనాల్లో నేరుగా మిల్లులకు చేరుస్తున్నారు. అక్కడి నుంచి లారీల్లో కృష్ణపట్నం పోర్టుకు తరలిస్తున్నారు.

తగ్గిన కేసుల నమోదు

ప్రతినెలా ఇదే తంతు జరుగుతుండటంతో కేసుల నమోదు కూడా తగ్గిపోయింది. ఎక్కడైనా వాహనాల్లో తరలిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులు దాడులు చేసి పట్టుకుంటున్నారు. నాలుగు రోజుల క్రితం చీరాల ప్రాంతం నుంచి నెల్లూరు వైపు లారీలో బియ్యం తరలిస్తుండగా అజ్ఞాతవ్యక్తి

మిగతా 6వ పేజీలో

జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి, ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ టెన్త్ పరీక్షల నిర్వహణలో విచిత్ర పరిస్థితి నెలకొంది. గతంలో ఎన్నడూ లేనంత గందరగోళం ఏర్పడింది. పదో తరగతి పబ్లిక్, ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలు ఒకేసారి ఒకే సమయంలో ఒకే కేంద్రంలో నిర్వహించాల్సి రావడం ఇందుకు కారణమైంది. పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఒక చీఫ్‌ను, ఒక డిపార్ట్‌మెంట్ అధికారి (డీవో)ని... ఓపెన్ స్కూలు పరీక్షల నిర్వహణకు వేరుగా మరో చీఫ్, డీవోను నియమించారు. ఒకే కేంద్రంలో రెండు విభాగాల విద్యార్థులు పరీక్షలకు హాజరుకావడం, వారికి వేర్వేరుగా అధికారులను నియమించడం చర్చనీయాంశమైంది.

గందరగోళ పరీక్ష

ఒక్కో కేంద్రానికి ఇద్దరేసి చీఫ్‌లు, డీవోలు

- పబ్లిక్, ఓపెన్ కలిపి నిర్వహణ
- 23 చోట్ల ఇదీ పరిస్థితి
- పరీక్షల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు



ఒంగోలు విద్య, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఓపెన్ స్కూలు పరీక్షల్లో బహిరంగంగా జరిగే కాపీయింగ్‌ను ఈ ఏడాది అరికట్టాలని భావించింది. ఈనేపథ్యంలో గతంలో వేర్వేరుగా జరిగే పబ్లిక్, ఓపెన్ స్కూలు పరీక్షలను ఎస్‌ఎస్‌సీ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించాలని నిర్ణయించారు. అందుకోసం జిల్లా కేంద్రం, రెవెన్యూ డివిజన్ కేంద్రం, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో రెగ్యులర్, ఓపెన్ విద్యార్థులకు కలిపి సెంటర్‌లను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రం మొత్తానికి ఒక చీఫ్, ఒక డిపార్ట్‌మెంట్ అధికారిని.. ఓపెన్ స్కూలు ప్రశ్నపత్రాల భద్రత కోసం ఒక అదనపు డీవోను నియమించారు. విద్యార్థులకు హాల్ టికెట్లు కూడా సిద్ధమయ్యాయి. తీరా పరీక్షలకు పది రోజుల ముందు సీన్ మొత్తం మారిపోయింది. ఓపెన్ స్కూల్ సొసైటీ రాష్ట్ర కార్యాలయంలో ఎవరో చక్రం తిప్పడంతో మొదట ఏర్పాట్లను తూచ్ అని ఓపెన్ పరీక్షల నిర్వహణకు ప్రత్యేకంగా ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక చీఫ్, ఒక డీవోను నియమించారు.

23 కేంద్రాలకు ఇద్దరు చీఫ్‌లు

జిల్లాలో ఓపెన్ స్కూల్ 10వ తరతి పరీక్షలకు హాజరయ్యే 1,564 మంది విద్యార్థుల కోసం 23 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక కేంద్రానికి సగటున 68 మందిని కేటాయించారు. రెగ్యులర్, ఓపెన్ విద్యార్థులకు వేర్వేరుగా ఇద్దరు చీఫ్‌లు, ఇద్దరు డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇద్దరు ఇన్విజిలేటర్లను కూడా వేర్వేరుగా నియమించారు. దీంతో పరీక్షల్లో కాపీయింగ్‌కు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం తొలుత చేపట్టిన చర్యలు అటకెక్కాయి. ప్రస్తుతం గతంలో వలే యథావిధిగా పరీక్షలు జరగనున్నాయి. రెగ్యులర్ తరహాలోనే ఓపెన్ స్కూల్ విద్యార్థులకు కూడా పరీక్షలు రోజు మార్చి రోజు ఉంటాయి. ఈనెల 17న హిందీ, 19న ఇంగ్లీష్, 21న తెలుగు, ఉర్దూ, కన్నడ, ఒరియా, తమిళం, 24న గణితం, భారతీయ సంస్కృతం, పౌరసత్వం, 26న శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, గృహవిజ్ఞాన శాస్త్రం, 28న సాంఘిక శాస్త్రం, ఆర్థికశాస్త్రం సబ్జెక్టుల పరీక్షలు జరుగుతాయి.



గృహ లబ్ధిదారులకు ఊరట

రూ.191.50 కోట్ల అదనపు సాయం

- ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు
- పీవీజీటీ చెంచులకు రూ.లక్ష
- 15 నుంచి 23 వరకూ అవగాహన కార్యక్రమాలు

ఒంగోలు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : వివిధ ప్రభుత్వ పథకాల కింద గృహాలు మంజూరై యూనిట్ విలువ సరిపోక, స్వయంగా అదనపు నిధులు వెచ్చించే అవకాశం లేని లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. అలాంటి వారు తమ గృహ నిర్మాణాలు చేసుకునేందుకు అదనంగా సబ్సిడీ ఇవ్వనుంది. దీనిపై లబ్ధిదారులకు విస్తృత అవగాహన కల్పించి త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. ఆ మేరకు జిల్లాలోని 24,645 మంది గృహ నిర్మాణ లబ్ధిదారులకు రూ.191.50 కోట్ల మేర అదనపు సబ్సిడీ అందనుంది. ఇంటి నిర్మాణ సమయంలో నాలుగు దశల్లో అదనపు సబ్సిడీని విడుదల చేయనున్నారు. ఇప్పటివరకు పీఎం ఆవాస్ యోజన అర్బన్, రూరల్ పథకం కింద బీసీ, ఎస్సీ, ఎస్టీలకు యూనిట్ విలువ రూ.1.80 లక్షలు, పీవీజీటీ

మిగతా 6వ పేజీలో

అడ్డగోలు తవ్వకాలపై కన్నెర్ర



కొండ ప్రాంతంలో చేస్తున్న తవ్వకాలు (ఇన్‌సెట్‌లో) మట్టి తరలిస్తున్న లారీలను అడ్డుకుంటున్న పల్లామల్లి గ్రామస్థులు

పల్లామల్లిలో అనుమతులు లేకుండా పోరంబోకు, పట్టాభూముల్లో గ్రావెల్ క్వారీయింగ్

- అడ్డుకున్న గ్రామస్థులు
- తహసీల్దార్, మైన్స్ డీడీకి ఫిర్యాదు
- కొండలను పిండి చేస్తున్నారని ఆవేదన
- వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్

చీమకుర్తి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రయోజనం ముసుగులో అడ్డగోలుగా తవ్వకాలు జరిపి ఎర్రమట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న సంస్థపై పల్లామల్లి గ్రామస్థులు మండిపడ్డారు. అనుమతులు పొందిన మేరకు కాకుండా కొండ పోరంబోకు, ఆఖరుకు పక్కనే ఉన్న పట్టా భూముల్లో సైతం తవ్వకాలను సాగించటంపై కన్నెర్ర చేశారు. పార్టీలకతీతంగా ఏకమై తవ్వకాలు చేస్తున్న ప్రదేశానికి వెళ్లి పనులను అడ్డుకున్నారు. అక్కడకు వచ్చిన రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ద్వారా తహసీల్దార్, మైన్స్ డీడీల దృష్టికి అడ్డగోలు తవ్వకాల అంశాన్ని తీసుకెళ్లి తగిన చర్యలను తీసుకోవాలని కోరారు. గ్రామస్థుల కథనం

మిగతా 6వ పేజీలో



ఒంగోలులోని ఓ కళాశాల హాస్టల్ నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థినులు

చదువుకు విరామం.. ఇంటికి పయనం..

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు నిర్వహించిన కెమిస్ట్రీ, కామర్స్‌కు 17,340 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష ముగిసిన అనంతరం ఆయా కేంద్రాల నుంచి బయటకు వచ్చిన వారు కేరింతలు కొట్టారు. ఇంతకాలం పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు చదువుకు విరామం ఇచ్చారు. హాస్టళ్లను ఖాళీచేసి తల్లిదండ్రులతో కలిసి స్వగ్రామాలకు బయల్దేరి వెళ్లారు. దీంతో ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్ కిటకిటలాడింది.

7

అమరావతిలో.. శ్రీవారి కల్యాణోత్సవం


శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు


చంద్రబాబు దంపతులకు హారతి ఇస్తున్న వేద పండితుడు


పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు





రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.

-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి


వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు



కల్యాణ మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యేలు పుల్లారావు, ఆనందబాబు, రామాంజనేయులు తదితరులు


శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు


గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు


చంద్రబాబుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు


సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు


మంగళసూత్రాలు చూపుతున్న వేద పండితులు


కల్యాణం తిలకిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని, మంత్రి ఆనం, బీఆర్ నాయుడు


కల్యాణం తిలకిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రి నారాయణ


కల్యాణాన్ని తిలకిస్తున్న పీఠాధిపతులు


సమాధిపై ఆవు విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న నరసింహారావు పంతులు

దేవుని ఆవు సమాధిపై విగ్రహం ఏర్పాటు

- గోమాతపై అభిమానాన్ని చాటుకున్న దారంవారిపాలెం గ్రామస్థులు

తాళ్లూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): దారంవారిపాలెం గ్రామంలో రాముల వారి దేవాలయానికి వదిలిన దేవుని ఆవు వయోభారంతో గత నవంబరులో మృతిచెందడంతో పూడ్చిపెట్టారు. గ్రామస్థులు కలిసికట్టుగా వాగు ఒడ్డున పూడ్చినచోట సమాధి నిర్మించారు. సమాధిపై శనివారం ఆవు విగ్రహాన్ని ప్రతిష్ఠించి గోమాతపై తమకున్న ప్రేమాభిమానాలు చాటుకున్నారు.

గ్రామంలో రాములవారి దేవాలయ ప్రతిష్ఠ సమయంలో గోమాతను దేవుని ఆవుగా వదిలారు. ఆగోమాత నిత్యం గ్రామంలో తిరుగుతుండేది. ప్రతి ఇంటి వారు ఆవుకు ఆహార పదార్థాలు అందించేవారు. దీంతో ప్రతిఒక్కరూ గోమాతపై ప్రేమాభిమానం పెంచుకున్నారు. గత నవంబరులో ఆవు మృతిచెందినప్పుడు ప్రత్యేక వాహనంపై గ్రామంలో ఊరేగింపు నిర్వహించి గ్రామ శివారున దోర్నపువాగు ఒడ్డున ఖాళీ స్థలంలో ఖననం చేశారు. దేవునిఆవు జ్ఞాపకాలను మరిచిపోలేని గ్రామస్థులు కలిసికట్టుగా సమాధి నిర్మించాలని తలంచారు. మూడు నెలల క్రితం మృతి చెందిన దేవుని ఆవుకు సమాధి నిర్మించారు. సమాధిపై ఆవు విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు తయారుచేయించిన విగ్రహాన్ని శనివారం గ్రామంలో ఊరేగించారు. గ్రామస్థులు, అధిక సంఖ్యలో మహిళలు సమాధి వద్దకు వచ్చి పూజలు చేసి విగ్రహాన్ని సమాధిపై ఏర్పాటుచేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పూజారి నరసింహారావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి.

గొర్రెల మందపైకి దూసుకెళ్లిన లారీ

కాపరి సహా ఐదు గొర్రెలు మృతి

పుల్లలచెరువు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో గొర్రెల మందపై లారీ దూసుకెళ్లడంతో కాపరితో పాటు ఐదు గొర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన శనివారం వేకువ జామున చోటుచేసుకొంది. పోలీసుల వివరాల ప్రకారం పుల్లలచెరువు మండలం నరజాముల తండాకు చెందిన పోపావత్ రాములునాయక్ మరోవ్యక్తితో కలిసి వేకువజామున నరజాముల తాండ నుంచి త్రిపురాంతకానికి జాతీయ రహదారి 565పై వెళుతున్నాడు. ఉదయం 5.15 నిమిషాలకు మల్లాపాలెం రోడ్డుకు సమీపంలోని కోళ్లఫారం వద్ద లారీ వచ్చి వెనుక నుంచి వీరిని బలంగా ఢీ కొట్టింది. దీంతో పోపావత్ రాములు నాయక్(48) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో ఐదు గొర్రెలు కూడా మృతిచెందాయి. రాములు నాయక్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. దీంతో తండాలో విషాద ఛాయలు అలముకున్నాయి. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ ఎల్.సంపత్‌కుమార్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.


మృతిచెందిన గొర్రెలు, పక్కన మృతి చెందిన కాపరి రాములు నాయక్

ముగిసిన ఓపెన్ ఇంటర్‌పరీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ ఇంటర్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. శనివారం బయాలజీ, కామర్స్ పరీక్షలు జరిగాయి. 1,759 మందికి 1,282 మంది పరీక్షకు హాజరు కాగా 477 మంది గైర్హాజరయ్యారు. బయాలాజీ పరీక్షకు 693 మందికి 488 మంది, కామర్స్ పరీక్షకు 1,066 మందికి 794మంది పరీక్షకు హాజరయ్యారు. డీఈవో కిరణ్‌కుమార్ రెండు పరీక్షా కేంద్రాలు, స్క్వాడ్ అధికారులు 21 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

పండ్ల వ్యాపారిపై హత్యాయత్నం కేసు

ఒంగోలు క్రైం, మార్చి15(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ సీఐ పాండు రంగారావుపై దాడికి యత్నం చేసిన పండ్ల వ్యాపారిపై ఒంగోలు తాలుకా పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. గడచిన శుక్రవారం ఒంగోలులోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో విధినిర్వహణలో ఉన్న ట్రాఫిక్ సీఐపై పండ్లవ్యాపారి కత్తితో దాడికి యత్నం చేశాడు. దీంతో పండ్లవ్యాపారిపై ట్రాఫిక్ ఆర్ ఎస్ఐ మాల్యాద్రి తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో కేసు నమోదు చేసిన తాలుకా పోలీసులు పండ్లవ్యాపారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

రూటు మార్చిన రేషన్ మాఫియా

(5వ పేజీ తరువాయి)

ఇచ్చిన సమాచారంతో మద్దిపాడు మండలంలో ఒక లారీని పట్టుకున్నారు. ఆ లారీలో 624 బస్తాల బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ బియ్యం నేరుగా రేషన్ షాపుల నుంచి తరలిస్తున్నట్లుగా గుర్తించారు. గోతాలు మార్పిడి చేయకుండానే నేరుగా ఆ బియ్యాన్ని తరలిస్తున్నారు. చిన్నచిన్న వాహనాల్లో బియ్యం తరలించడం ద్వారా ఎక్కడైనా పట్టుకున్నా కేసుల బారి నుంచి తప్పించుకునేందుకు కూడా అవకాశం ఉండటంతో వ్యాపారులు కూడా తమ దారిని మార్చుకొని ముందుకు సాగుతున్నారు.

తరలింపునకు మధ్యవర్తులు

ఈ నెలలో జిల్లాలో నాగులుప్పలపాడు మండలంలో పట్టుకున్న బియ్యం మినహా ఎక్కడా ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. బియ్యం తరలించేందుకు దళారులను ఏర్పాటు చేసుకొని గుట్టుచప్పుడు కాకుండా రాత్రికి రాత్రే ఇతర ప్రాంతాలకు తరలించి అక్కడి నుంచి పోర్టుకు తరలిస్తున్నారు. మధ్యవర్తులు కూడా బియ్యం తరలించేందుకు ఆదాయవనరుగా ఉండటంతో చిన్న వాహనాల్లో బియ్యం తరలిస్తున్నారు.

అడ్డగోలు తవ్వకాలపై కన్నెర్ర

(5వ పేజీ తరువాయి)

ప్రకారం.. పల్లామల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 33బై1, 33బై2లలో కొండపోరంబోకు భూములు, రెండు చిన్నపాటి కొండలున్నాయి. వీటి పక్కనే పట్టాభూములు సైతం ఉన్నాయి. కొండల నుంచి వర్షపు నీరు గోలవాగు ద్వారా గ్రామంలో ఉన్న పెద్దచెరువుకు చేరుతుంది. ఈ చెరువు గ్రామప్రజలకు ప్రధాన నీటివనరు. అంతేగాక గ్రామానికి చెందిన గొర్రెలు, మేకలు, పశువుల పెంపకందారులు కొండపోరంబోకు భూముల్లోనే మూగజీవాలను అనాదిగా మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా ఇటీవల నిర్మిస్తున్న బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనులకు కాంట్రాక్ట్ సంస్థకు ఎర్రమట్టి అవసరమైంది. ఇక్కడ నాణ్యమైన ఎర్రమట్టి లభిస్తుందని భావించిన సంస్థ అనుమతుల కోసం రెవెన్యూ, మైనింగ్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. దీనికి సంబంధించిన అధికారులు 33/2 సర్వే నంబర్‌లో ఉన్న భూముల్లో కేవలం నాలుగు హెక్టార్లలో మాత్రమే తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. అయితే ఆ ప్రాంతంలో నెలరోజులకుపైగా తవ్వకాలు సాగిస్తున్నారు. అందరికీ ఉపయోగపడే రోడ్డు పనులకు కావడంతో గ్రామస్థులు కూడా ఊరకుండిపోయారు. కానీ తవ్వకాలు అడ్డగోలుగా, నిబంధనలకు విరుద్ధంగా సాగిస్తుండటంపై తమకు నష్టం వాటిల్లుతుందని భావించిన గ్రామస్థులు శనివారం కొండ ప్రాంతానికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. అనుమతులు లేని సర్వేనంబర్‌లో ఉన్న కొండను పిండి చేయటానికి పూనుకోవటం, పక్కనే ఉన్న పట్టాభూముల్లో సైతం తవ్వకాలు మొదలుపెట్టడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీని వలన చెరువుకు నీరురాని పరిస్థితి ఏర్పడుతుందని అధికారుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో గ్రామస్థులు శాంతించారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు

గ్రామస్థుల అభ్యంతరాలను నా దృష్టికి తీసుకువచ్చారు. అనుమతి మంజూరు చేసిన భూముల్లో కాకుండా ఇతర ప్రాంతాలలో తవ్వకాలు సాగిస్తున్నారని ఫిర్యాదు చేశారు. సోమవారం సర్వే నిర్వహించి నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తాం. **- బ్రహ్మయ్య, తహసీలార్, చీమకుర్తి**

అనుమతికి మించి తవ్వితే చర్యలు

ప్రజాప్రయోజనార్థం అభివృద్ధి పనుల్లో భాగంగా నిర్మిస్తున్న రహదారి నిర్మాణానికి అవసరమైన ఎర్రమట్టిని తవ్వి, తీసుకు వెళ్లటానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనుమతిని ఇచ్చాం. అడ్డగోలుగా తవ్వకాలు చేస్తే చర్యలు తీసుకుంటాం. గ్రామస్థులు ఆందోళన పడాల్సిన పనిలేదు. **-రాజశేఖర్, మైన్స్ డీడీ**

3 నుంచి టెన్త్ మూల్యాంకనం

ఒంగోలు విద్య మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 3నుంచి ప్రారంభం కానుంది. పది పరీక్షలు ఈనెల 31వ తేదీతో పూర్తవుతాయి. మూల్యాంకనం ఏప్రిల్ 3నుంచి 9వ తేదీ వరకు జరుగుతుంది. ఒంగోలులోని డీఆర్‌ఆర్‌ఎం మునిసిపల్ హైస్కూలులో మూల్యాంకనం కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ఎగ్జామినర్ల నియామక ప్రక్రియ ఒకటి రెండు రోజుల్లో ప్రారంభం కానుంది.

గృహ లబ్ధిదారులకు ఊరట

(5వ పేజీ తరువాయి)

చెంచులకు రూ.2.39 లక్షలుగా ఉంది. అలా మంజూరైన ఇళ్లలో వివిధ కారణాలతో 24,645 ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయాయి. అందులో పీఎం అవాస్ యోజన అర్బన్, రూరల్ కింద మంజూరైన 20,057 ఉండగా పీఎం జన్మన్ పథకం కింద మంజూరైన 3,870, అలాగే 718 చెంచులకు సంబంధించినవి ఉన్నాయి. వాటిపై దృష్టిసారించిన ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న యూనిట్ విలువకు అదనంగా మరి కొంత సబ్సిడీని ఇవ్వాలని నిర్ణయించింది.

పెరిగిన అదనపు సాయం

ఆయా పథకాల కింద మంజూరైన లబ్ధిదారుల్లో బీసీ, ఎస్సీలకు ప్రస్తుతం ఇస్తున్న రూ.1.80లక్షల మొత్తానికి అదనంగా మరో రూ.50వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.1.80లక్షలకు అదనంగా రూ.75వేలు, చెంచులకు ఇస్తున్న రూ.2.39 లక్షలకు అదనంగా రూ.లక్ష ఇవ్వనున్నారు. ఆ ప్రకారం బీసీ, ఎస్సీలకు యూనిట్ విలువ రూ.2.30లక్షలు, ఎస్టీలకు రూ.2.55 లక్షలు, చెంచులకు రూ.3.39 లక్షలు కానుంది. అలా పెంచిన మొత్తాలతో జిల్లాలోని 24,645 మందికి అదనంగా సుమారు రూ.191.50 కోట్లు మేర లబ్ధి కలగనుంది. వారిలో 10,909 మంది ఎస్సీలకు రూ.51.51కోట్లు అదనంగా అందనుండగా 11,750 మంది బీసీలకు రూ.58,75 కోట్లు, 1,874 మంది లబ్ధిదారులకు రూ.14.05 కోట్లు, 718 మంది చెంచులకు రూ.7.18 కోట్లు అదనపు సబ్సిడీ రానుంది.

23వరకు ప్రత్యేక కార్యక్రమం

లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇళ్ల నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసుకోవాలని కలెక్టర్ అన్సారియా కోరారు. సబ్సిడీ మొత్తాన్ని ఇంటి నిర్మాణ సమయంలో నాలుగు దశల్లో అందిస్తామని తెలిపారు. లబ్ధిదారులకు మరింత అవగాహన కల్పించేందుకు ఈనెల 15 నుంచి 23 వరకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు చెప్పారు. ఆ సమయంలో సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమినిటీ సెక్రటరీలు లబ్ధిదారులను కలిసి అదనపు సబ్సిడీపై అవగాహన కల్పిస్తారన్నారు. సబ్సిడీ విషయంలో సమస్య ఏదైనా ఎదురైతే పై అధికారులను కలవాలని లబ్ధిదారులకు సూచించారు.

నియోజకవర్గాల వారీ అదనపు సబ్సిడీ వివరాలు

నియోజకవర్గం	లబ్ధిదారుల సంఖ్య	అదనపు సబ్సిడీ(రూ.కోట్లలో)
కొండపి	2,035	10.67
దర్శి	3,229	16.78
గిద్దలూరు	2,591	13.76
కనిగిరి	2,646	13.68
మార్కాపురం	5,027	25.78
ఒంగోలు	3,811	19.89
సంతనూతలపాడు	2,109	11.13
యర్రగొండపాలెం	3,197	19.86
మొత్తం	24,646	రూ.191.50 కోట్లు

ప్లాస్టిక్‌పై సమరం

(5వ పేజీ తరువాయి)

ప్లాస్టిక్ సంచుల నిషేధంపై అవగాహన కల్పించడంతోపాటు వస్త్ర సంచులు పంపిణీ చేశారు. అంతకు ముందు పాత బైపాస్ రోడ్డులోని ట్రెజరీ కార్యాలయంలో మొక్కలు నాటి మామిడిపాలెం ఎస్ఎస్ ట్యాంకు వద్ద ట్రిపుల్ ఆర్ పార్కును ప్రారంభించారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ చీమకుర్తిలో, దర్శిలో జరిగిన కార్యక్రమంలో అక్కడి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొన్నారు కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కనిగిరి పట్టణంలో, మార్కాపురంలో అక్కడి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, గిద్దలూరులో అక్కడి ఎమ్మెల్యే ఎం.అశోక్ రెడ్డిలు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు దోర్నాలలో పాల్గొన్నారు. అక్కడ వీధులు ఊడ్చి ప్లాస్టిక్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లావ్యాప్తంగా వివిధ స్థాయిల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగులు పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించగా ప్రభుత్వ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో కూడా స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహించారు.

అవన్నీ పనికి రాని వస్తువులు.. ఇళ్లల్లో, షాపుల్లో వాడిపారేసినవి.. అన్నీ చెత్తకుప్పల్లో పోసినవి.. కానీ వాటన్నింటిని రకరకాలుగా వినియోగించి ఓ అందమైన..అపురూపమైన పార్కుగా తీర్చిదిద్దారు. సృష్టిలో పనికిరాని వస్తువు ఉండదు అనేందుకు ఉదాహరణగా నిలిపారు. తాగిపారేసిన ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లతో లాన్‌లో కూర్చొనేందుకు పెద్ద గొడుగును రూపొందించారు. పనికిరావని తీసేసిన వాహనాల టైర్లను కాంక్రీట్ వాల్‌గా మార్చారు. డస్ట్‌బిన్‌లు, ఐరన్‌డబ్బాలతో కుర్చీలు, రోబోలు, గుర్రంను తయారుచేశారు. పాత బోర్‌వెల్ పైపులను వినియోగించి పార్కు ప్రవేశద్వారాన్ని నిర్మింపజేశారు. ఇలా చెత్తలో పారవేసిన వాటితో అద్భుతంగా మార్చారు ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు. పార్కును చూసిన ప్రతి ఒక్కరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇందంతా ప్లాస్టిక్‌ను నిషేధించేందుకు చేస్తున్న ప్రయత్నంలో భాగంగా వినూత్నంగా చేపట్టడంపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

- 'రెడ్యూస్.. రీయూజ్.. రీసైకిల్..' (ట్రిపుల్‌ఆర్)' నినాదంతో ఏర్పాటు
- వ్యర్థాలతో అర్థవంతంగా రూపకల్పన
- అబ్బురపరుస్తున్న బొమ్మలు
- విశేషంగా ఆకట్టుకుంటున్న డిజైన్లు
- కార్పొరేషన్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం
- ఎంఈ, డీఈలకు ఎమ్మెల్యే జనార్దన్, కలెక్టర్ అన్సారియా అభినందనలు



ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లతో ఏర్పాటు చేసిన గొడుగు

ఒంగోలు నగరంలో వ్యర్థాలతో అద్భుతాలు



పనికిరాని పాత ఇనుప వస్తువులతో రోబో

ప్లాస్టిక్ నిషేధంపై కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు స్థానిక కొత్త మామిడిపాలెంలో గత కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని ప్లాస్టిక్ డబ్బాలు, పనికిరాని వస్తువులతో అందమైన పార్కుగా తీర్చిదిద్దారు. సుమారు 625 స్కేర్ మీటర్ల విస్తీర్ణంలో 'రెడ్యూస్.. రీయూజ్.. రీసైకిల్..' (ట్రిపుల్‌ఆర్)అనే నినాదంతో చేపట్టి నిర్మించిన ట్రిపుల్‌ఆర్ పార్క్ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇన్నాళ్లు నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని అందమైన పార్కుగా మార్చడంతో ఆ ప్రాంతం ఇప్పుడు చూపరులను ఆకర్షిస్తోంది. సాధారణంగా పార్కుల్లో వాడే కాంక్రీట్ వాల్‌కు బదులుగా పాడైపోయిన ట్రాక్టర్ టైర్లను, వాడి పడేసిన ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, లాన్‌లో కూర్చోవడానికి నీడ కోసం గొడుగుగా తయారు చేసి అందంగా ముస్తాబు చేశారు. అంతేగాకుండా నిరుపయోగంగా ఉన్న డస్ట్‌బిన్‌లు, ఐరన్ డబ్బాలతో కుర్చీలను, గుర్రం బొమ్మను, రోబో బొమ్మలను తయారు చేయడం చూపరులను అబ్బురపరుస్తోంది. ప్రవేశ ద్వారం వద్ద పాత బోర్‌వెల్ పైపులను వాడి ఆహ్లాదకరమైన పార్కుగా మార్చడంలో అధికారులు చేసిన వినూత్న ప్రయత్నాన్ని ప్రజలు మెచ్చుకుంటున్నారు. పార్కులో సుమారు 3,500 వాటర్ బాటిల్స్, 67 టైర్లు, 17 జీఐ పైపులు, 100 కేజీల పాత ఇనుప సామాను ఉపయోగించి ట్రిపుల్‌ఆర్ పార్కుగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వరరావు, ఎంఈ చంద్రయ్య, డీఈ పద్మజలు నిరుపయోగ ప్లాస్టిక్, ఇతర సామగ్రితో ప్రత్యేకంగా పార్కుగా రూపొందించడాన్ని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కలెక్టర్ తమీమ్ అన్సారియా వారిని ప్రత్యేకంగా అభినందించారు.

- ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)





అరిగిపోయి తీసేసిన టైర్లతో లాన్‌లో అందంగా..



ఇనుప డబ్బాలతో తయారు చేసిన కుర్చీలు



19న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

● కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సిడాప్ ఆధ్వర్యంలో ఈనెల 19న ఒంగోలులోని శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాలలో జరిగే సంకల్ప్- మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శనివారం జాబ్ మేళా పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి నుంచి పీజీ వరకు చదివి 18 నుంచి 30 ఏళ్లలోపు నిరుద్యోగ యువతీ, యువకులు ఈ జాబ్‌మేళాకు హాజరుకావచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12నుంచి రూ.35వేల వేతనం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజయాదవ్, ఎం.శ్రీను, షేక్ ఈసుబాషా, ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాసాచారి, కె.సాయిప్రణతి తదితరులు పాల్గొన్నారు.



పోటీలలో బండలాగుతున్న ఎడ్లు

అలరించిన ఎడ్ల బలప్రదర్శన పోటీలు

గిద్దలూరు టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరవ గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు అలరిస్తున్నాయి. ఈ పోటీల్లో భాగంగా శనివారం 2 పండ్ల సైజు విభాగంలో ఎడ్లజతలకు పోటీలు నిర్వహించారు. రాచర్ల మండలం ఆకవీడు గ్రామానికి చెందిన విజయలక్ష్మీనాయుడు ఎడ్లజత మొదటి బహుమతి రూ.25వేలును గెలుచుకొంది. ముండ్లపాడుకు చెందిన కంచర్ల తనీష్‌కుమార్‌గౌడ్ ఎడ్ల జత ద్వితీయ బహుమతి రూ.20వేలు, కడప జిల్లా కాశినాయన మండలం అనువారిపల్లెకు చెందిన వెంకటచైతన్యకుమార్, శీలం జగన్‌మోహన్‌రెడ్డి ఎడ్లజత తృతీయ బహుమతి రూ.15వేలు, రాచర్ల మండలం బుచ్చిగారి విజయలక్ష్మి నాయుడు ఎడ్లజత నాలుగో బహుమతి రూ.10వేలు, బురుజుపల్లెకు చెందిన యరమల బాలవెంకటరెడ్డి ఎడ్లజత ఐదవ బహుమతి రూ. 7వేలు, నంద్యాల జిల్లా సింగవరంకు చెందిన జమాల్‌బాష ఎడ్ల జత ఆరవ బహుమతి రూ.5 వేలు గెలుచుకున్నాయి. ఏడు, ఎనిమిది స్థానాల్లో నంద్యాల జిల్లా బ్రాహ్మణపల్లెకు చెందిన జయమ్మ ఎడ్లజత, నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన పురుషోత్తం ఎడ్లజతలు నిలిచాయి. పోటీలో మొత్తం 26 ఎడ్లజతలు పాల్గొన్నాయి.



పరీక్షలు ముగియడంతో కేరింతలు కొడుతున్న విద్యార్థినులు

ముగిసిన సీనియర్ ఇంటర్ పరీక్షలు

ఒంగోలు విద్య. మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు జరిగాయి. పరీక్షలకు 18,102 మందికి 17,340 మంది హాజరు కాగా 762 మంది గైర్హాజరయ్యారు. ఆర్‌ఐవో ఆరు, డీఈసీ, డీఐఈవోలు ఏడు, స్క్వాడ్ అధికారులు 31 పరీక్షా కేంద్రాలను తనిఖీచేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆర్‌ఐవో సైమన్ విక్టర్ తెలిపారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు కేంద్రాల వద్ద కేరింతలు కొట్టారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులతో స్వగ్రామాలకు బయలు దేరడంతో ఆర్టీసీ బస్టాండు కిటకిటలాడింది.

సానుకూల దృక్పథంతో పరీక్షలు రాయాలి

టెన్త్ విద్యార్థినులలో స్ఫూర్తిని నింపిన కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 17వతేదీ నుంచి ప్రారంభంకానున్న పదవ తరగతి విద్యార్థినులు ధైర్యంగా పరీక్షలు రాసే విధంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా స్ఫూర్తిని ఇచ్చారు. శనివారం ఒంగోలులోని పీవీఆర్‌బాలికోన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థినులు పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్య అవశ్యకతను విద్యార్థినులకు వివరిస్తూ పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా ఆయా కేంద్రాల్లో అవసరమైన అన్ని సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా, సానుకూల దృక్పథంతో పరీక్షలు రాయాలని విద్యార్థినులకు కలెక్టర్ సూచించారు. విద్యార్థులు భవిష్యత్‌లక్ష్యాలను అడిగి తెలుసుకొని అందుకు అనుగుణంగా ఆ లక్ష్యాలను చేరుకొనేందుకు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు పాస్‌పోర్ట్ లాంటివని తెలిపారు. పరీక్షలు బాగా రాయాలని కలెక్టర్ విద్యార్థినులకు ఆల్ ది బెస్ట్ చెప్పి వారిలో స్ఫూర్తిని నింపారు. ప్రతి విద్యారిని కనీసం డిగ్రీ పూర్తి చేయాలని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కామన్ ఎగ్జామినేషన్స్ బోర్డు కార్యదర్శి శ్రీనివాసరావు, ఒంగోలు మండల విద్యాధికారి టి. కిషోర్ బాబు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఏ.సుధారాణి,ఉపాధ్యాయులు ఉన్నారు.



పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు, టీచర్లతో కలెక్టర్ అన్సారియా, డీఈవో కిరణ్‌కుమార్

మహిళల భద్రతకు పెద్ద పీట

- శక్తి టీంలను ప్రారంభించిన ఎస్పీ
- జిల్లాలో ఆరు ఏర్పాటు

ఒంగోలు క్రైం,మార్చి15 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతే ధ్యేయంగా పోలీసు శాఖ జిల్లాలో శక్తి టీంలు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. శనివారం స్థానిక ఎస్పీ కార్యాలయం వద్ద శక్తి టీంలకు పచ్చ జెండా ఊపి లాంఛనంగా ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల భద్రత కోసం ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన శక్తి యాప్‌ను ప్రజలలోకి తీసుకెళ్లేందుకు శక్తి టీంలు ఏర్పాటు చేశామన్నారు. అంతే కాకుండా నిరంతరం మహిళల భద్రత కోసం ఈ టీంలు పనిచేస్తాయని తెలిపారు. జిల్లాలో ఆరు టీంలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వీటిలో ఒంగోలులో మూడు, దర్శికనిగిరి, మార్కాపురం సబ్‌డివిజన్‌లలో ఒక్కో టీం పనిచేస్తాయని అన్నారు. అసాంఘిక శక్తులతో పాటుగా ,ఈవ్‌టీజింగ్ లాంటి వాటిపై శక్తి టీంలు పనిచేసి వారి ఆట కట్టిస్తాయని తెలిపారు. ముఖ్యంగా మహిళలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలు , కళాశాలలు, బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంతాలలో శక్తి టీంల నిఘా ఉంటుందని అన్నారు.ఎక్కడైనా మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు గురి చేసినా శక్తి టీం బాధితులకు అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కే.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు ,సీఐలు రాఘవేంద్రరావు, సుధాకర్, నాగరాజు, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శక్తి టీంలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్పీ దామోదర్

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు
రీజనల్ ఆఫీస్, ఒంగోలు

బంగారు నగల వేలం ప్రకటన

ఈ క్రింది పేర్కొనబడిన ఖాతాదారులు మా బ్యాంకు నందు బంగారు నగలు తాకట్టుపెట్టి తీసుకున్న ఋణములు ఎన్ని నోటీసులు పంపినను వారు తమ బాకీలను చెల్లించియుండలేదు. ఋణము చెల్లించవలసిన కాలము గడిచినందున సదరు బంగారు నగలు ది.27-03-2025 గురువారం మధ్యాహ్నం 3.00 గంటలకు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, మార్కెట్ సెంటర్ బ్రాంచి, భాగ్యనగర్, ఒంగోలు ఆవరణలో బహిరంగ వేలము వేసి వారి పేరునయున్న బకాయిలకు జమకట్టుకొనబడును. వేలములో పాల్గొనదలచిన వారు ది. 27-03-2025 గురువారం మధ్యాహ్నం 2.00 గంటలలోపు రూ.20,000/-లు ధరావత్తుగా చెల్లించవలయును. ఎట్టి కారణము చూపకనే వేలము రద్దుచేయుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. వేలము వేసినా, బకాయిలు రద్దుకాని ఎడల వారిపై చట్టరీత్యా తగుచర్యలు తీసుకొని మిగిలిన బకాయిలను వసూలు చేయబడును. మరియు వేలము తదితర ఖర్చులు వారి ఖాతాలకు వ్రాయబడును. ఈ దిగువ పేర్కొనబడిన ఖాతాదారులలో ఎవరైనా మరణించిన యెడల ఈ ప్రకటన వారి వారసులకు వర్తించును. బ్యాంకు నుండి వారి వారి ఖాతాదారులకు ఋణము చెల్లించవలసినదిగా కోరుతూ పంపినటువంటి నోటీసులు ఏ కారణము చేతనైన ఖాతాదారులకు చేరకపోయిన ఖాతాదారులు తీసుకొనకపోయిన, ఖాతాదారులు మరణించియున్న ఈ పత్రిక నోటీసును తుది నోటీసుగా భావించవలసినదిగా కోరుచున్నాము. మునుపటి నోటీసులు చేరని విషయములో ఎటువంటి ఉత్తరప్రత్యుత్తరాలకు బ్యాంకు బాధ్యత వహించదు.

వ.సె	ఖాతా నెంబరు	శాఖ	ఖాతాదారుని పేరు	గ్రామం	తూకం గ్రా.
1	91167537731	కామేపల్లి	బీరుదుల పెద్ద కొండయ్య తండ్రి నరసింహం	చతుకుపాడు	23.2
2	91170475937	కామేపల్లి	చింతగుంట్ల చంద్రయ్య తండ్రి రామయ్య	జగ్గరాజుపాలెం	28.7
3	91142744995	చీమకుర్తి	శ్రీమతి నాగమ్మ సూకలోటి భర్త పెదకోటయ్య	రామచంద్రాపురం	31.49

తేది : 15-03-2025, ఒంగోలు

సం/- రీజనల్ మేనేజర్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, రీజనల్ ఆఫీస్, ఒంగోలు, సెల్ : 9490158402

స్వచ్ఛ గ్రామాల కోసం సహకరించాలి

- మంత్రి బాలవీరాంజనేయస్వామి పిలుపు
- కొండపిలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ర్యాలీ, ప్రతిజ్ఞ
- ఒంగోలులో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే దామచర్ల , చీమకుర్తిలో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎన్


ఎన్టీఆర్ బొమ్మ సెంటర్‌లో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి స్వామి


మహిళలకు జూట్ సంచులను అందజేస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే దామచర్ల

కొండపి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ గ్రామాల కోసం అందరూ సహకరించాలని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పిలుపునిచ్చారు. కొండపిలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కామేపల్లి రోడ్డు నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. వారితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కొండపి గ్రామ పంచాయతీని పరిశుభ్రంగా ఉంచేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. త్వరలోనే చెత్త సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తెస్తామన్నారు. అనంతరం జాళ్లపాలెం రోడ్డులో స్వయంగా తాను ఎక్స్‌కవేటర్‌ను నడిపి చెత్త తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. రోడ్డు పక్కన చెత్త పోసేవారికి జరిమానాలు విధించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో డీపీవో వెంకటనాయుడు, హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్, ఎంపీడీవో రామాంజనేయులు, తహసీల్దార్ పి.మురళి, వెలుగు ఏపీఎం గోపీనాథ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో మహాలక్ష్మి, సీడీపీవో మాధవీలత, పంచాయతీ రాజ్ ఏఈ బి.ప్రసాదరావు, ఎంఈవో పి.రామారావు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉన్నం రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలి : కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్: ప్లాస్టిక్ నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఒంగోలులో శనివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి నేత, జ్యూట్‌తో తయారు చేసిన సంచులను వినియోగాన్ని పెంచేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఒంగోలు నగరంతోపాటు జిల్లాలోని అన్నీ మార్కెట్‌లలోనూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని చెప్పారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ పరిశుభ్రమైన ఒంగోలు ఆవిష్కరణ లక్ష్యంగా చర్యలు చేపట్టామన్నారు. కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మాంసాహార దుకాణాలకు వచ్చే ప్రజలు ప్లాస్టిక్ కవర్లలో కాకుండా వారి వెంట స్టీల్ బాక్సులు తెచ్చుకుంటే వారికి కేజీకి రూ.5 నుంచి రూ.10 తగ్గించడానికి వ్యాపారులు ముందుకు వచ్చారన్నారు. అనంతరం ప్రజలకు జూట్, నేత సంచులను పంపిణీ చేశారు. అంతకముందు జిల్లా ట్రెజరీ కార్యాలయం సమీపంలో మొక్కను నాటాటే కార్యక్రమాన్ని చేపట్టగా, అనంతరం పోలీసు శిక్షణ సెంటర్ సమీపంలో కార్పొరేషన్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న కుక్కల కుటుంబ నియంత్రణ కేంద్రాన్ని వారు పరిశీలించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, మెప్మా పీడీ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం అందరి లక్ష్యం కావాలి : ఎమ్మెల్యే బీఎన్

చీమకుర్తి ప్లాస్టిక్ రహిత సమాజమే అందరి లక్ష్యం కావాలని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్వచ్ఛాంధ్ర,-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం చీమకుర్తి పట్టణం విద్యానగర్ సచివాలయం పరిధిలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సిబ్బందితో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. మహిళలకు నేత సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ వై.రామకృష్ణయ్య, తహసీల్దార్ బ్రహ్మయ్య, కౌన్సిలర్లు గొల్లపూడి రమాదేవి, గోరంట్ల అంజలి, టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, కాట్రగడ్డ రమణయ్య, రావిపాటి రాంబాబు, యడ్లపల్లి రామబ్రహ్మం, కందిమళ్ల గంగాధరరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, సూరంపల్లి హనుమంతరావు పాల్గొన్నారు.

అన్నంగి గ్రామంలో..

మద్దిపాడు: పరిసరాల పరిశుభ్రత కోసం కోసం అందరూ కృషి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ టి.నారాయణ కోరారు. శనివారం అన్నంగి గ్రామంలో సర్పంచ్ పల్లపాటి లోకేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన స్వచ్ఛాంధ్ర,-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి మహిళలకు జూట్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, ఎంపీడీవో డీఎస్‌వీ.ప్రసాద్, ఈవోఆర్డీ కె.రఘుబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ బాలశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మండువవారిపాలెంలో..

ఒంగోలు(రూరల్): ఒంగోలు మండలం మండువవారిపాలెం లో శనివారం ఎంపీడీవో కె.రాజశేఖరరావు ఆధ్వర్యంలో ప్లాస్టిక్ బ్యాగుల వాడకం నివారించాలంటూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మండవ వెంకటసుబ్బయ్య, కె.ఉదయభాస్కర్, మారెళ్ల రాజేంద్రప్రసాద్, ఈవోఆర్డీ ఎ.బాలచెన్నయ్య పాల్గొన్నారు.

ఎం.నిడమలూరులో..

టంగుటూరు: ఎం.నిడమలూరులో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సుబ్బాయమ్మ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాకుమాని శ్రీకాంత్, కోటయ్య, శేషయ్య, ఐటీడీపీ అధ్యక్షుడు శ్రీనివాస్, హెచ్ఎం కల్యాణి పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు: మండలంలోని బి.నిడమానూరు, కె.తక్కెళ్లపాడు గ్రామాల్లో డీఎల్‌డీవో వై.మహాలక్ష్మి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. జూట్ బ్యాగ్‌లను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా సమాఖ్య ఎన్నికను రద్దు చేయాలి

పోటీ చేయకుండా డీపీఎం నరసింహారావు, లీగల్ కో ఆర్డినేటర్ రమేష్‌బాబు బెదిరించారు..

పీడీ నారాయణకు మండల సమాఖ్య అధ్యక్షుల ఫిర్యాదు

ఒంగోలు నగరం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన జిల్లా సమాఖ్య నూతన కమిటీ ఎన్నిక అక్రమంగా జరిగిందంటూ పలువురు మండల సమాఖ్య అధ్యక్షులు శనివారం ఒంగోలులో డీఆర్‌డీఏ, వెలుగు పీడీ నారాయణకు ఫిర్యాదు చేశారు. శింగరాయకొండ, పొదిలి, అర్ధవీడు, బేస్తవారపేట, పెద్దారవీడు తదితర మండలాలకు చెందిన సమాఖ్య అధ్యక్షులు, ఇతర పొదుపు సంఘాల మహిళలు మాట్లాడుతూ సమాఖ్య కమిటీ ఎన్నికను రద్దు చేసి తిరిగి సహకార శాఖ ఎన్నికల చట్టం ప్రకారం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 12వ తేదీన జరిగిన ఎన్నికల్లో తమకు అవకాశం కల్పించలేదని ఆవేదనవ్యక్తం చేశారు. వెలుగు డీపీఎం నరసింహారావు తన మాట వినకుండా పోటీకి దిగుతున్నారంటూ చేతిలో మైకును కింద విసిరి వేసి మీకు పోటీ చేసే అవకాశమే ఇవ్వనని, దిక్కున్నచోట చెప్పుకోండి అంటూ ఆగ్రహంతో ఊగిపోయి బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేగాకుండా లీగల్ కో ఆర్డినేటర్ బెజ్జం రమేష్‌బాబు, బేస్తవారపేట మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శోభారాణి పోటీకి దిగుతుండగా బెదిరించారన్నారు. డీపీఎం నరసింహారావు, లీగల్ కో ఆర్డినేటర్ రమేష్‌బాబు తమను మహిళలని కూడా చూడకుండా ఇష్టానురీతిగా మాట్లాడారని వాపోయారు. దీనిపై పీడీ నారాయణ స్పందిస్తూ తగిన విచారణ జరిపిస్తామని మహిళలకు హామీ ఇచ్చారు.

నగరంలో ‘ట్రిపుల్ ఆర్’ పార్కు ప్రారంభం

- ప్రారంభించిన కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే దామచర్ల


పార్కును ప్రారంభించి సరదాగా ఆశీనులైన ఎమ్మెల్యే దామచర్ల, మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు, కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తూ ఒంగోలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కొత్తమామిడిపాలెంలోని కంపోస్ట్ యార్డు, యాంటి బర్త్ కంట్రోల్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ట్రిపుల్‌ఆర్ (రెడ్యూస్.. రీయూజ్.. రీసైకిల్..) పార్కును కలెక్టర్ తమీమ్ అన్సారీయా, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సింగిల్ యూజ్ వాటర్‌బాటిల్స్, ఐరన్ డబ్బాలు, అలాగే టైర్లుతోపాటు వివిధ పరికరాలను ఉపయోగించి అందంగా పార్కును ముస్తాబు చేయడంతోపాటు పచ్చదనం కోసం ఏర్పాటు చేసిన గ్రీనరీ బాగుందన్నారు. పర్యావరణ పరిరక్షణ, అలాగే ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కల్పించేలా రూపొందించిన పార్కు ఆకర్షణీయంగా, ఆహ్లాదకరంగా ఉందన్నారు. కమిషనర్ వెంకటేశ్వరరావును, ఇతర సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ సూర్యనారాయణ, ఎంఈ చంద్రయ్య, డీఈ పద్మజ, అసిస్టెంట్ కమిషనర్ డొక్కా కొండయ్య, శానిటరీ సూపర్‌వైజర్ బాబ్జి పాల్గొన్నారు.

జగన్‌ను విమర్శించే స్థాయి బాలినేనికి ఎక్కడిది ?

- వైసీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి రవిబాబు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి ఎక్కడదని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు ప్రశ్నించారు. శనివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలినేని తన అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు జనసేన పార్టీలో చేరారని, ఒంగోలులో బ్రాహ్మణుల స్థలాలు ఆక్రమించుకోవడం వల్లే వారి ఉసురు తగిలిందన్నారు. బాలినేని టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టిన విషయం అందరికీ తెలుసన్నారు. సమావేశంలో డాక్టర్ మాదాశి వెంకయ్య, కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, నగర అధ్యక్షుడు కఠారి శంకర్, బొట్లా సుబ్బారావు, రమణమ్మ పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

మద్దిపాడు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం వద్ద కారు ఢీకొని మహిళకు గాయాలయ్యాయి. కారంచేడు గ్రామానికి చెందిన నక్క సుబ్బులు, భర్త వేణు కూరగాయల కోసం గ్రోత్‌సెంటర్ వద్దకు వెళ్లి గాజులపాలెం వెళుతుండగా కారు ఢీకొట్టింది. దీంతో సుబ్బులు కాలుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు. మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం

టీడీపీ కొండపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో మంత్రి స్వామి


ఎక్కువ సభ్యత్వ నమోదు చేసిన వారికి ప్రశంసాపత్రాలను అందజేస్తున్న మంత్రి స్వామి, చైర్మన్ సత్య

టంగుటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : 'పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తిస్తాం. వారికి అన్ని విధాలా న్యాయం చేస్తాం. పదవుల్లోనూ ప్రాధాన్యం ఇస్తాం' అని మంత్రి డాక్టర్ స్వామి భరోసా ఇచ్చారు. కొండపి నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి సమావేశం జాతీయ రహదారిపై ఐవోసీ ఎదురుగా ఉన్న దామచర్ల సత్య కంపెనీ ఆవరణలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే ఐదేళ్లలో నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు అహరహం శ్రమిస్తున్నారన్నారు. మారిటైం బోర్డు చైర్మన్ సత్య మాట్లాడుతూ టీడీపీకి కంచుకోట కొండపి అన్నారు. మంత్రి స్వామిని ఓడించేందుకు స్వయంగా జగన్‌రెడ్డి విశ్వ ప్రయత్నాలు చేసి స్వామికే మూడోసారి పట్టం కట్టారన్నారు. అనంతరం పెద్దఎత్తున సభ్యత్వ నమోదు చేసిన నాయకులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు అడకా స్వాములు, మండలాల అధ్యక్షులు కామని విజయ్‌కుమార్, వేల్పుల సింగయ్య, పోకూరి రవీంద్రబాబు, బొడ్డపాటి యలమందనాయుడు, అనుమోలు సాంబశివరావు, చేరెడ్డి నరసారెడ్డి, ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల వినతి

సింగరాయకొండ: ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణను జిల్లాలు కాకుండా రాష్ట్రం యూనిట్‌గా తీసుకొని జనాభా దామాషా ప్రకారం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు మంత్రి స్వామిని కోరారు. ఆమేరకు శనివారం తూర్పునాయుడుపాలెంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రావినూతల కోటి, నాయకులు రేణుమాల మాధవ, కృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

కామేపల్లిలో బాలికల వసతి గృహానికి శంకుస్థాపన

జరుగుమల్లి: కామేపల్లిలో రూ.1.50కోట్లతో మంజూరైన సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహ నిర్మాణానికి శనివారం మంత్రి స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరంలో టాయిలెట్ కిట్స్, యూనిఫాం, షూస్, దుప్పట్లు అందజేస్తామన్నారు. మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యారంగంలో సంస్కరణలను తీసుకు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, పోటు శ్రీనివాసమురళి (పెదబాబు), ఏలూరి రాంబాబు, విద్యుత్‌శాఖ డీఈ నాగేశ్వరరావు, డీఈ జె.రవిబాబు పాల్గొన్నారు. అనంతరం కామేపల్లి పీహెచ్‌సీని మంత్రి స్వామి పరిశీలించారు. వైద్యశాల ఆవరణలో చెత్తాచెదారం పేరుకుపోయి ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, నరసరావుపేట బ్రాంచ్ వారి సూచనలు పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... దారం నాగిరెడ్డి గారి కుమారుడు దారం వెంగలరెడ్డి గారి ఆస్తిని తనఖా పెట్టుకొని దారం వెంకటరమణ రెడ్డి గారు ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియచేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లయిములు రానిచో మా క్లయింట్ సదరు దారం వెంకటరమణ రెడ్డి గారికి ఋణము మంజూరు చేయును. షెడ్యూలు-1 : ప్రకాశం జిల్లా, ఒంగోలు ఆర్.డి. యిలాకా, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన కొప్పోలు గ్రామ సర్వే నెం. 613/1ఏ రులో య. 1-36ట్లులో నాకు హక్కు కలిగి నీకు విక్రయించిన ప్లాను దాఖలా ప్లాటు నెం. 2రు ఖాళీ స్థలమునకు హద్దులు : తూర్పు : ప్లాటు నెం. 3రు దాఖలా స్థలము - యీ దిశ 72అ.లు, దక్షిణం : 33 అ.ల వెడల్పు గల రోడ్డు - యీ దిశ 50 అ.లు, పడమర : ప్లాటు నెం.1రు స్థలం - యీ దిశ 72అ.లు, ఉత్తరం : పాపనబోయిన రాఘవులు గారి భూమి - యీ దిశ 50 అ.లు, యీ హద్దుల మధ్యలోని 3600 చ.అ.లు లేక 50 గదులు లేక 400 చ.గ.లు లేక 336 చ.మీ.ల ఖాళీ స్థలము. DOC NO : 4912/2019, S.R.O. ఒంగోలు. షెడ్యూలు-2 : ఓడీ. ప్లాటు నెం. 1రు ఖాళీ స్థలమునకు హద్దులు : తూర్పు : ప్లాటు నెం. 2రు దాఖలా స్థలము - యీ దిశ 72అ.లు, దక్షిణం : 33 అ.ల వెడల్పు గల రోడ్డు - యీ దిశ 50 అ.లు, పడమర : 30 అ.ల వెడల్పు గల రోడ్డు - యీ దిశ 72.అ.లు, ఉత్తరం : పాపనబోయిన రాఘవులు గారి భూమి - యీ దిశ 50 అ.లు, యీ హద్దుల మధ్యలోని 3600 చ.అ.లు లేక 50 గదులు లేక 400 చ.గ.లు లేక 336 చ.మీ.ల ఖాళీ స్థలము. DOC NO : 4911/2019, S.R.O. ఒంగోలు. షెడ్యూలు-3 : ఓడీ. ప్లాటు నెం. 3రు ఖాళీ స్థలమునకు హద్దులు : తూర్పు : ప్లాటు నెం. 4రు దాఖలా స్థలము - యీ దిశ 72అ.లు, దక్షిణం : 33 అ.ల వెడల్పు గల రోడ్డు - యీ దిశ 50 అ.లు, పడమర : ప్లాటు నెం. 2రు స్థలం - యీ దిశ 72.అ.లు, ఉత్తరం : పాపనబోయిన రాఘవులు గారి భూమి - యీ దిశ 50 అ.లు, యీ హద్దుల మధ్యలోని 3600 చ.అ.లు లేక 50 గదులు లేక 400 చ.గ.లు లేక 336 చ.మీ.ల ఖాళీ స్థలము. DOC NO : 4913/2019, S.R.O. ఒంగోలు.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీకృష్ణ, న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914

పబ్లిక్ నోటీసు

ప్రకాశం జిల్లా, ఒంగోలు టౌన్, ఎన్‌జీఓ కాలనీ, శ్రీ పద్మావతి అపార్టుమెంట్, ఫ్లాట్ నెం.202(ఏ) నివాసి అయిన వెంకట సరసయ్య గారి కుమారుడు కాకోళ్ల శ్రీనివాసరావు గారు మాకిచ్చిన సంజాయిషీ మేరకు యావన్మంది ప్రజానీకానికి ఈ నోటీస్ ద్వారా తెలియజేయునది ఏమనగా

నా క్లయింట్ ఈ దిగువ షెడ్యూలు దాఖల ఆస్తిని సంతనూతలపాడు సబ్‌రిజిస్ట్రార్ వారి ఆఫీసులో రిజిష్టర్ కాబడిన విక్రయ దస్తావేజు నెం.4890/2023 ద్వారా కొనుగోలు చేసి సర్వసంపూర్ణ హక్కులతో అనుభవిస్తున్నారు. సదరు దస్తావేజునకు ఒరిజినల్ లింక్ దస్తావేజు అయిన సంతనూతలపాడు సబ్ రిజిష్ట్రార్ వారి ఆఫీసులో రిజిష్టర్ కాబడిన దాస్తావేజు నెం. 1465/2005ను పోగొట్టుకున్నారని సదరు విషయమై వారు ఒంగోలు తాలూకా పోలీస్ వారికి కంప్లైంట్ ఇచ్చియున్నారని 13-03-2025 సర్టిఫికెట్ ఇచ్చియున్నారు. ఈ క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిపై ఎవరికైనను ఏవిధమైన హక్కులుగాని అభ్యంతరములు గాని లేదా సదరు పోయిన దస్తావేజు దొరికిన యెడల లిఖిత పూర్వకముగా తగిన దస్తావేజుతో ఈ నోటీస్ ప్రచురించిన (15) దినముల లోపు ఈ క్రింది సంతకం దారులను సంప్రదించగలరు. లేనియెడల ఎవరికి ఏ విధమైన అభ్యంతరములు గాని హక్కులు లేవని సదరు దస్తావేజు దొరకలేదని భావించి మా క్లయింటు ఈ క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిపై లావాదేవీలు జరపగలరు. గడువు తర్వాత వచ్చు అభ్యంతరములు నా క్లయింటును గాని, తదుపరి జరుగు లావాదేవీలను గాని భద్రపరచ జాలనని యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూల్ : ప్రకాశం జిల్లా, ఒంగోలు ఆర్.డి. యిలాకా, సంతనూతలపాడు స.రి.యిలాకా, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేరిన పేర్నమిట్ట గ్రామ సర్వే నెం.212/3ఏ2ఏ2 రులో య 37.48 ట్లులో య 9.481/2 ట్లులో నాకు హక్కు కలిగిన ప్లాను దాఖలా ప్లాటు నెం.227 రులో తూర్పు వైపు ఖాళీస్థలమునకు హద్దులు.

తూర్పు : 25 అ.లు వెడల్పు గల రోడ్డు. **దక్షిణం :** శ్రీ రాఘవేంద్ర ఎంటర్ ప్రైజస్ వారి ప్లాట్లు **పడమర:** ఈ ప్లాటు నెం.227రలో నిల్వ స్థలం **ఉత్తరం :**ప్లాటు నెం.129 రు స్థలం.

ఈ హద్దులలోని ఖాళీ స్థలం100 చ.గ.లు లేక 84 చ.మీ.లు

ఇట్లు... **చల్లా వెంకటప్పారెడ్డి** న్యాయవాది, డోర్ నెం.46-139-63, 2వ లైన్, క్రిష్ణా నగర్, వెంకటేశ్వరస్వామి గుడి దగ్గర, సమతా నగర్, ఒంగోలు, ప్రకాశం జిల్లా. సెల్ : 9848044909

ఏజీపీగా శివరామకృష్ణ నియామకం


వెంకటశివరామకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు జిల్లా కోర్టు పరిధిలోని రెండవ సీనియర్, మూడవ జూనియర్ సివిల్ కోర్టులకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా ఒంగోలు బార్ అసోసియేషన్ న్యాయవాది బోడపాటి వెంకటశివరామకృష్ణను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒంగోలు నగర పరిధిలోని ముక్తినూతలపాడుకు చెందిన శివరామకృష్ణ న్యాయవిద్యను వైజాగ్ ఆంధ్రాయూనివర్శిటీలో పూర్తి చేశారు. 2002 మార్చి నుంచి సీనియర్ న్యాయవాదులు యడవల్లి వెంకటశేషయ్య, రామకృష్ణల వద్ద జూనియర్‌గా చేసి ఏడేళ్ళ పాటు పని చేశారు. తర్వాత సొంత కార్యాలయం ఏర్పాటు చేసుకొని న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఏజీపీగా నియమితులైన శివరామకృష్ణను పలువురు న్యాయవాదులు అభినందించారు.

తహసీల్దార్ కార్యాలయం పరిశీలన

చీమకుర్తి, మార్చి15(ఆంధ్రజ్యోతి): చీమకుర్తిలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. కార్యాలయంలో గదులన్నీ పూర్తిస్థాయిలో దెబ్బతిని వర్షాకాలంలో జలమయం అవుతూ కార్యకలాపాలకు ఆటంకంగా మారటాన్ని అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నూతన కార్యాలయం నిర్మాణానికి డీఎంఎఫ్ నిధులు రూ.3కోట్లను మంజూరుకు ఎమ్మెల్యే కృషి చేశారు. నూతన కార్యాలయ నిర్మాణానికి అనువుగా కార్యాలయాన్ని తాత్కాలికంగా పాత మున్సిపల్ కార్యాలయానికి మార్చడానికి ఏర్పడిన అడ్డంకులను తహసీల్దార్ బ్రహ్మయ్య తెలపగా పరిష్కరిస్తానని బీఎన్ హామీ ఇచ్చారు.

ఆరోగ్య సేవలను సక్రమంగా అందించాలి : డీఎంహెచ్‌వో

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యసేవలను ప్రజలకు సకాలంలో అందించేలా పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రభుత్వం సరఫరాచేసిన యూనిఫాం చీరలను ఆశా కార్యకర్తలకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆశాలు నిర్దేశించిన గ్రామాలు, వార్డుల్లోనే నివాసం ఉండాలన్నారు. ఎండల తీవ్రత పెరుగుతున్నందున ప్రజలు వడదెబ్బబారిన పడకుండా అందరికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకొని అవసరమైన సమయంలో వినియోగించాలని కోరారు. జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న క్యాన్సర్ పరీక్షలు సకాలంలో పూర్తిచేసే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి పిపద్మజ, డీపీఎంవో సౌజన్య, డీపీహెచ్ఎన్‌వో సుగుణమ్మ, సీఈవో రాజేశ్వరి పాల్గొన్నారు.

టెన్త్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలి

సింగరాయకొండ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఎస్సై బి.మహేంద్ర ఆకాంక్షించారు. స్థానిక గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు ఆయన శనివారం అట్టలు, పెన్నులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో కత్తి శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ కె.రమాదేవి, ప్రధానోపాధ్యాయులు అత్రిబోయిన రాంబాబు, అంబటి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు తక్కువ.. డివిజన్ అధ్యక్షుడికి ఎక్కువ

- చుండూరిపై డిప్యూటీ మేయర్ మాధవరావు ఫైర్

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు కార్పొరేటర్‌కు తక్కువ, డివిజన్ అధ్యక్షుడికి ఎక్కువ అని జనసేన పార్టీ నాయకుడు, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు విమర్శించారు. స్థానిక లాయర్‌పేటలోని బాలినేని నివాసంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ బియ్యం రీ సైక్లింగ్ చేసి వ్యాపారం చేయడమే కాకుండా అధికార వైసీపీని అడ్డంపెట్టుకొని తిరుమల దేవస్థానానికి వాటిని తరలించిన వ్యక్తి మాట్లాడటం దుర్మార్గంగా ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గొర్రెపాటి శ్రీనివాసరావు, ఈదర సురేష్, నాగరాజు, గంటా రామానాయుడు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

23న ఎసెస్‌మెంట్ పరీక్షలు : డీఆర్వో

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 23న జరగనున్న ఉల్లాస్ ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ ఎసెస్‌మెంట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో చినఓబులేషు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం ఆయన సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ పరీక్షలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు. డీఆర్‌డీఏ పీడీ నారాయణ, ఐసీడీఎస్ పీడీ సుజన్‌హేనా తదితరులు పాల్గొన్నారు.

యూనిట్ల ఏర్పాటుకు రుణాలు మంజూరు చేయాలి

ఒంగోలు నగరం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకులు ఇతోధికంగా రుణాలను మంజూరు చేయాలని వెలుగు పీడీ టి.నారాయణ కోరారు. శనివారం స్థానిక టీటీడీసీ భవనంలో జరిగిన బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణాల మంజూరులో ఇబ్బందులను అధిగమించేందుకు ప్రతి నెలా రెండు రోజుల పాటు వెలుగు సిబ్బంది, బ్యాంకు అధికారులు చర్చించాలని కోరారు. సమావేశంలో లవు బ్యాంకుల మేనేజర్లు సబీర్, అభినయ్, డీఎం రాఘవేంద్ర, డీపీఎంలు సనీత, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓం గాయిత్రీ విశ్వకర్మ యూనివర్సిటీ నిర్వాహకుల మోసం

- మెడికల్ విద్యార్థి నుంచి రూ.22.50లక్షలు వసూలు

మద్దిపాడు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడు సమీపంలోని ఓం గాయిత్రీ విశ్వకర్మ యూనివర్సిటీ నిర్వాహకులు మెడికల్ విద్యార్థి మహమ్మద్‌రాజ్ కత్రీ వద్ద నుంచి రూ.22.50లక్షలు నగుదు తీసుకుని మోసం ఘటన శనివారం రాత్రి వెలుగుచూసింది. ఎస్‌ఐ శివరామయ్య కథనం మేరకు.. ఓం గాయిత్రీ విశ్వకర్మ యూనివర్సిటీ నిర్వాహకులు నాగమల్లేశ్వరి లేని యూనివర్సిటీని చిత్రీకరించి 2023లో అడ్మిషన్లు తీసుకుంటే మంచి ప్లేస్‌మెంట్స్‌తో పాటు విదేశాలకు పంపిస్తామని ప్రచారం చేశారు. హైదరబాద్‌కు చెందిన మహమ్మద్‌రాజ్ కత్రీ అడ్మిషన్ కోసం రూ.25లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. రెండేళ్ల వ్యవధిలో రూ.22.50లక్షలు నగుదును ఫీజుగా చెల్లించాడు. అయితే ఎలాంటి తరగతులు చెప్పకుండా ఉండటంతో యాజమాన్యాన్ని విద్యార్థి ప్రశ్నించాడు. కానీ వారు ఎలాంటి సమాధానం ఇవ్వక పోవడంతో దీంతో బాధిత విద్యార్థి మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో నర్సింగ్ విద్యార్థినులను కూడా ఇబ్బంది పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి.

పేస్‌లో సదస్సు

ఒంగోలు విద్య, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సాధనాలపై శనివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్సని టెక్నాలజీకి చెందిన ఆటోమేషన్ టెస్ట్ ఇంజనీర్ బుట్టు గోపీకృష్ణ ఏఐ సాధనాలను వివరించారు. కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని ఏఐ ఉద్యోగాలు, పరిశ్రమలు వస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే. మూర్తి, ఎన్.శ్రీనివాసరావు, ఎన్. అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.





అవీ..ఇవీ

విద్యార్థికి చేయూత మిత్రమండలి సాయం



విద్యార్థికి నగదును అందజేస్తున్న చేయూత మిత్రమండలి

బేస్తవారపేట,మార్చి15(ఆంధ్రజ్యోతి):బేస్తవారపేట మండలంలోని కొత్త పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వతరగతి చదువుతున్న డి.వెంకటహర్షవర్ధన్‌రెడ్డి బోన్‌క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. విద్యార్థి తల్లిదండ్రులు కూలిపనులు చేసుకుంటూనే తల్లిదండ్రులు రూ.2లక్షలు వైద్యం కోసం ఖర్చు చేశారు. వైద్యానికి మరో రూ.6 లక్షలు కావాల్సి ఉంది. దీంతో బేస్తవారపేట చేయూత మిత్రమండలి రూ.5వేలు ఆర్థిక సాయం చేసింది. కార్యక్రమంలో మిత్రమండలి సభ్యులు డి.రవీంద్ర, బాబు, కేవీ.సుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ



పరీక్ష అట్టలతో విద్యార్థినులు

మార్కాపురంరూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాయవరం వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు శనివారం వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష అట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసవీక్లబ్ సభ్యులు గంగిశెట్టి కిరణ్ మాట్లాడుతూ పదవతరగతి విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి మార్కులను సాధించాలని అకాంక్షించారు. ఉత్తమ ఫలితాలు సాధిస్తే మీతో పాటు మీకు విద్యనేర్పిన గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు వస్తుందన్నారు. ఒత్తిడికి లోనుకాకుండా మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్ సభ్యులు పూర్ణచంద్రారావు, వెంకటేశ్వర్లు, శివకుమార్, సుబ్బారావు, ఏడుకొండలు, పాఠశాల ప్రిన్సిపల్ సునీత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం.. ముగ్గురు అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

గిద్దలూరు టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గంజాయి కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శనివారం పట్టణంలోని రాచర్ల వెళ్లే దారిలో వీరు గంజాయి కలిగి ఉండడాన్ని గుర్తించినఎక్సైజ్ సీఐ ఎం.జయరావు సిబ్బందితో వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న కిలో గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు.

మురుగును తొలగించరూ..!



రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు

పొదిలి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : విశ్వనాథపురంలోని జూనియర్ కళాశాల మొదటి లైన్‌లో మురుగు కాలువలు నిండిపోయి నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి నెలకొన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయా ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

- కోరం లేక సభ నిర్వహించలేదన్న ఎంపీడీవో
- చర్యలు తీసుకోవాలన్న ఎమ్మెల్యే తాటిపర్తి



మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో సభ్యులతో వచ్చిన ఎమ్మెల్యే

పెద్దదోర్నాల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండల సర్వ సభ్య సమావేశం శనివారం వాయిదా పడింది. 13 మంది ఎంపీటీసీలకు గానూ ఒక్కరు మాత్రమే రిజిస్టర్‌లో సంతకం చేశారని ఎంపీడీవో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు సర్క్యులర్ అందజేసినా ఎవరూ హాజరుకాలేదన్నారు. దీంతో కోరం లేక పోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో నాసర్‌రెడ్డి తెలిపారు. కాగా ఎర్రగొండపాలెం నియోజకవర్గ శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ ఒంటిగంట సమయంలో ఎంపీటీసీ, జడ్‌పీటీసీ సభ్యులతో మండల కార్యాలయానికి చేరుకున్నాడు. ఎంపీడీవో అవినీతిని కప్పి పుచ్చుకునేందుకే వాయిదా వేశారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

నేడు పోలీస్ శాఖ అధ్వర్యంలో జాబ్‌మేళా

ఎర్రగొండపాలెం రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖ అధ్వర్యంలో స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ ఆడిటోరియంలో ఆదివారం ఉదయం నిరుద్యోగ యువత కోసం జాబ్‌మేళాను ఏర్పాటు చేసినట్లు ఎస్సై పి.చౌడయ్య శనివారం తెలిపారు. ఎస్పీ ఏఆర్.దమోదర్ ఆదేశాల మేరకు ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఎర్రగొండపాలెం సర్కిల్ పరిధిలోని యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 10వ తరగతి నుండి పీజీ పూర్తి చేసిన యువత పాల్గొనవచ్చునని అన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ జాబ్‌మేళా ఉంటుందని అన్నారు. ఆధార్‌కార్డు, ధ్రువీకరణ పత్రాల నకలు తీసుకోని రావాలని కోరారు. ఈ జాబ్‌మేళాను యువత వినియోగించుకోవాలని కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛాంధ్ర



ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తున్న విద్యార్థులు

పెద్దదోర్నాల, మార్చి15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు కళాశాల ఆవరణలో శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సావిత్రి, అధ్యాక సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత

- ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి
- స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన
- పలుచోట్ల ర్యాలీలు



స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కోరారు. పట్టణంలోని గడియార స్తంభం వద్ద శనివారం నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, సబ్‌కలెక్టర్ త్రివినాగ్, అధికారులు, నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వలన అనేక అనర్థాలు జరుగుతున్నాయన్నారు. మనుషులతో పాటు పశువులు కూడా ప్లాస్టిక్ వలన అనారోగ్యం పాలవుతున్నాయన్నారు. ప్రతిఒక్కరూ తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటూ తోటి వారికి స్ఫూర్తిగా ఉండాలన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా సేకరణ వాహనాలలో మాత్రమే వేయాలని కోరారు. అనంతరం పట్టణంలోని ప్రధాన వీధులలో అధికారులు, నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పూలకొట్ల వ్యాపారులకు ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని నోటీసులను అందజేశారు. సబ్‌కలెక్టర్ త్రివినాగ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణఆంధ్ర కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో మున్సి పల్ కమిషనర్ నారాయణరావు, మున్సిపల్ కౌన్సిలర్ నాలి కొండయ్య యాదవ్, టీడీపీ నాయకులు మౌలాలి, వక్కలగడ్డ మల్లికార్జున, కొప్పుల శ్రీను, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పొదిలి : స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ మున్సిపాలిటీ కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాసరరావు ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వినియోగంతో వచ్చే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పలు పాఠశాల విద్యార్థులు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : ప్రతిఒక్కరూ వ్యక్తి గత శుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని వై.పాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. దోర్నాలలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎరిక్షన్‌బాబు హాజరయ్యారు. చీపురు పట్టి వీధులు శుభ్రంచేసి ప్రజల్లో అవగాహన కల్పించారు. అంతేగాక ప్లాస్టిక్ నిషేధాన్ని అందరూ పాటించాలని చేతిసంచులను వినియోగించాలని పిలుపునిచ్చారు. పారిశుధ్య కార్మికులను అభినందిస్తూ వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాసర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివకోటేశ్వరరావు, టీడీపీ నాయకులు బట్టు సుధాకర్ రెడ్డి, షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, చల్లా వెంకటేశ్వర్లు, షేక్ మంజూర్ భాష, కే.సుబ్బారెడ్డి, జనసేన నాయకులు కే.మురళి తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : ప్లాస్టిక్ రహిత గిద్దలూరు పట్టణంగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. ర్యాలీ మున్సిపల్ కార్యాలయం నుంచి పెద్దబజారు, పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు నిర్వహించారు. అక్కడ అందరూ మానవహారంగా ఏర్పడి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రతి నెల 3వ శనివారం జరిగే స్వచ్ఛాంధ్ర కార్యక్ర మంలో అధికారులు ప్రజాప్రతినిధులు ప్రతిఒక్కరూ పాల్గొని పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, కమిషనర్ ఐ.శ్రీనివాసులు, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దామని ఎంపీడీవో బండారు శ్రీనివాసులు అన్నారు. రాష్ట్రప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కాశికుంట తండాలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ , ఎంసీహెచ్ మంత్రునాయక్ అధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలకు ప్లాస్టిక్ వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ప్రజలతో పాటు సచివాలయ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలకు చేతి సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్‌నాయక్, పంచాయతీ రాజ్ డీఈ ఏఈ, పాఠశాల చైర్మన్, పాఠశాల సిబ్బంది, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం : స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రపై శనివారం అధికారులు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఎంపీడీవో రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో త్రిపురాంతకం గ్రామ సచివాలయం వద్ద కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎన్నెస్పీ డీఈఈ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ముడివేముల మేజర్ పరిసరాలలో స్వచ్ఛంధ్ర కార్యక్రమాన్ని చేపట్టి కంపచెట్లను తొలగించారు. అనంతరం అధికారులు, సిబ్బంది, నీటి సంఘం అధ్యక్షుల ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమాలలో డీసీ అధ్యక్షుడు దేవినేని చలమయ్య, ఈవోపీఆర్‌డీ రామసుబ్బయ్య, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.







దోర్నాలలో వీధులను శుభ్రం చేస్తున్న ఎరిక్షన్‌బాబు, పొదిలిలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు, ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

సారా తయారీతో జీవితాలు నాశనం

- ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ విజయ
- గిరిజన తండాలలో 'నవోదయం'పై అవగాహన



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ విజయ

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : నాటుసారా తయారీతో జీవితాలు నాశనం అవుతాయని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ అన్నారు. ఎర్రగొండపాలెం మండలంలోని కాశికుంట తండ, పీఆర్‌సీ తండా, చిన్న పీఆర్‌సీ తండా తదితర తండాలలో నవోదయం-2పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ నాటుసార తయారీతో గిరిజనుల జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. వారి జీవితాల్లో వెలుగులు తీసుకురావడం కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు మంచి విద్య, వసతులను కల్పిస్తోందన్నారు. తమ పిల్లలు విద్యలో రాణించే విధంగా తల్లిదండ్రులు చర్యలు చేపట్టాలన్నారు. మంచివిద్యతో మంచి భవిష్యత్తుతో రాణించవచ్చునని వారిని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోని మంచి భవిష్యత్తుకు నాంది పలకాలని కోరారు. ముందుగా ఆయా గ్రామాలలో నాటుసారా తయారీతో కలిగే నష్టాలపై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో ప్రోహిబిషన్ సూపరింటెండెంట్ అధికారి కాజామొద్దిన్, డీటీ జనార్ధన్, ఎర్రగొండపాలెం ప్రోహిబిషన్ సీఐ సీహెచ్ శ్రీనివాసులు, ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టంపై అవగాహన పెంచుకోవాలి

అవగాహన సమావేశంలో ఎంపీడీవో శోభన్‌బాబు



మాట్లాడుతున్న ఎంపీడీవో శోభన్‌బాబు

పొదిలి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ వినియోగదారుల చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో గుత్తా శోభన్‌బాబు అన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో వినియోగదారులకు తెలియకుండా పలుచోట్ల మోసాలకు గురవుతున్నారన్నారు. ఏదైన వస్తువు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలన్నారు. అప్పుడే ఆ వస్తువు నాణ్యత లేకపోతే యజమాని నుంచి నష్టపరిహారం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. వినియోగదారులు చైతన్యవంతులు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందనన్నారు. వస్తువు కొనుగోలు చేసి మోసపోయినట్లు గుర్తిస్తే ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. పీపీసీ అధ్యక్షుడు రామారావు మాట్లాడుతూ డివిజన్, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో వినియోగదా రుల రక్షణ సమితి ప్రజలకు అండగా నిలుస్తున్నాయన్నారు. మోసపోయామని గుర్తించినప్పుడు వినియోగదారుల సమితికి ఫిర్యాదు చేస్తే నోటీసు ఇచ్చి పరిహారం అందేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలుర, బాలికల, జడ్పీ, కేజీబీవి పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీసీపీ సభ్యులు బీఆర్‌కేశర్మ, కరిమల్లా బేగ్, మూసాజానీ, మదార్‌వలి, ఎండి జిలాని, జానీబేగ్, పెద్దన్న, అనురాధ, షకీల, కొండయ్య, బాలనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

దోర్నాలలో గిరిజనుల ప్రసూతి వార్డు ప్రారంభం



ఆస్పత్రి పరిసరాలను పరిశీలిస్తున్న ఎరిక్షన్‌బాబు

పెద్దదోర్నాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్యకేంద్రం లో నూతనంగా నిర్మించిన చెంచుగిరిజన ప్రసూతి వార్డును ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని గిరిజన గర్భిణులకు ఈ వార్డు ఎంతో ఉప యుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సంజీవ్, ఆంజనేయులు, ఆరోగ్యమిత్రలు మణికుమార్, చంద్రశేఖర్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

బాలికల వసతిగృహం సందర్శన

స్థానిక గిరిజన బాలికల వసతిగృహాన్ని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు శనివారం పరిశీలించారు. వసతిగృహంలోని గదులు, పరిసరాలు నిశితంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. వ్యక్తిగత శుభ్రతను పాటించాలని అదేసమయంలో పరిసరాలు కూడా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. పదవ తరగతి పరీక్షలు బాగా రాయాలని, అందరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులవ్వాలని సూచించారు. అనంతరం హాల్ టిక్కెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, కూటమి మండల నేతలు పాల్గొన్నారు.

కనుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు
- గోవిందనామస్మరణలతో మార్మోగిన వెలుగొండ



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కొనకనమిట్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : వెలుగొండ శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. కల్యాణం సందర్భంగా శనివారం తెల్లవారుజామున బేరిపూజ, దేవతావాహనం పూజలు చేశారు. శ్రీలక్ష్మి అలవేలుమంగ సమేత వెంకటేశ్వరస్వామివార్లను పలురకాల పూలతో రమణీయంగా ముస్తాబు చేశారు. వేదమంత్రోచ్చరణలతో ఉత్సవమూర్తులను తొలుత మంగళవాయిద్యాలతో వేదపండితులు ఎదురుకోళ్ల మండపం వద్దకు ఊరేగించారు. అనంతరం కల్యాణ క్రతువు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి సైతం భక్తులు వచ్చి స్వామి వారి కల్యాణాన్ని నిర్వ హించారు.

అనంతరం ఉత్సవ మూర్తులను సూర్యప్రభ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలను అలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం రూరల్, మార్చి15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలో వివిధ ఆరోగ్య సమస్యలతో వైద్యం చేయించుకున్న బాధితులకు ఎమ్మెల్యే నారాయణరెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. పట్టణంలోని జవహర్ నగర్ కాలనీలో ఆయన స్వగృహం వద్ద వారికి ఈ చెక్కులను శనివారం సాయంత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 18 మంది లబ్దిదారులకు రూ.27.19 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. చీదేళ్ల లక్ష్మీనారాయణకు రూ.50వేలు, డి.రామ్మూర్తికి రూ.1.50214 జి.ఆదినారాయణకు రూ.30 వేలు, జి భాస్కర్‌కు రూ.20 వేలు, కేసరి సాయి కుమార్‌కు రూ.1.36,345, డి చెన్నమ్మకు రూ.95,317 విలువైన చెక్కులను వారికి పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాలపాటి వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామదండు ప్రతిమతో భారీ ర్యాలీ



రామదండు ర్యాలీలో పాల్గొన్న భక్తులు

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : రామ దండు ప్రతిమతో ఎర్రగొండపాలెం నుండి పందివానిపల్లి గ్రామానికి ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎర్రగొండపాలెం, పందివానిపల్లి గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధానసెంటర్‌లో నిర్వహించిన ఈ భారీ ర్యాలీలో భక్తులతో పాటు భజన, నాట్య బృందం పాల్గొని నాట్య ప్రదర్శన చేశారు. 'జై శ్రీరామ్' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో దేవాలయాల అర్చకులు, కమిటీసభ్యులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల కోసం ప్రధాన రహదారి వెంట మజ్జిగ ప్యాకెట్లు, తీర్థ ప్రసాదాలు అందజేశారు..

వెలిగొండకు నీరివ్వాలి

- ప్రజాచైతన్య యాత్రలో సీపీఎం



మాట్లాడుతున్న సోమయ్య

పెద్దదోర్నాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ నుంచి కృష్ణా జలాలను 2026 ఖరీఫ్ సీజన్ నాటికి ఇవ్వాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి సోమయ్య కోరారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాచైతన్య యాత్ర శనివారం దోర్నాలకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించడంతోపాటు లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు త్వరగా పూర్తి చేసేందుకు బడ్జెట్టులో రూ.2వేల కోట్లు కేటాయించాలని, నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 18 ఏళ్లు నిండిన యువతకు కటాఫ్ తేదీని పెంచాలని కోరారు. అదేవిధంగా మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించాలని, మెడికల్ కళాశాలను వెంటనే పూర్తి చేయాలని తదితర సమస్యలపై ఈ నెల 20న మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీకేఎం రఫీ, రూతిన్, తిరుపతిరెడ్డి, ఏసోబ్, దావీద్, యల్లయ్య, సుబ్బారెడ్డి, పిచ్చయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన ప్లాటు ఆక్రమణపై ఫిర్యాదు

బేస్తవారపేట, మార్చి15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నలకలవీడు దళితకాలనీలో గతంలో ప్రభుత్వం భూతపాటి సత్యవేదమ్మ, జార్జి దంపతులకు ఇచ్చిన ఇంటిస్థలం (ప్లాట్)ను అదేగ్రామానికి చెందిన కొందరు అక్రమించారని పరిశీలించి న్యాయం చేయాలని దళిత బహుజన సొసైటీ వ్యవస్థాపక రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు షీల తహసీల్దార్ జితేంద్రకు వినతిపత్రం అందజేశారు.

ప్లాస్టిక్ రహిత పట్టణంగా కనిగిరి

- ప్రజలందరూ సహకరించాలి
- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత పట్టణంగా కనిగిరిని తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ప్లాస్టిక్ వస్తువుల వినియోగం నిషేధించాలంటూ పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంతోనే మానవాళి మనుగడ సాధ్యమన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను దుకాణాదారుల అమ్మవద్దని సూచించారు. ప్లాస్టిక్ కవర్లు, బ్యాగ్‌లను అమ్మకుండా గుడ్డసంచులు అమ్మేవిధంగా ప్రజలను ప్రోత్సహించాలని దుకాణదారులకు సూచించారు. గుడ్డసంచులు, జూట్ బ్యాగ్‌లతో కలిగే ప్రయోజనాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్లాస్టిక్ కవర్లు, బ్యాగ్‌లు, ఇతర వస్తువులు ఈనెల 31 వరకు అమ్ముకునే వీలు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఆతర్వాత అమ్మకాలు జరిపే షాపులపైన, ఆయా యజమానులపైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు.

అనంతరం పట్టణంలోని గార్లపేట రోడ్డులోని సాయిబాబా థియేటర్ వద్ద పేరుకుపోయిన చెత్త కుప్పలను మున్సిపల్ సిబ్బందితో కలసి శుభ్రం చేశారు. ప్రజలు నివసించే ప్రాంతంలోని చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు డాక్టర్ ఉగ్ర సూచించారు. ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రయివేటు స్థలాల్లో చెత్తను వేయకుండా చూడాలన్నారు. ఆస్థలాల్లో చెత్తకుప్పలు ఎక్కువైతే సంబంధిత భూయజమానిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గార్లపేట రోడ్డులోని కొండ కింద కాలనీలో రోడ్లకు ఇరువైపులా మొలచిన పిచ్చి చెట్లను తొలగించాలన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జోసఫ్ దానియేలు, మున్సిపల్ ఛైర్మన్ గఫార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్, మున్సిపల్ ఏఈ, కూటమి నాయకులు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, రోషన్‌సంధాని, తమ్మినేని వెంకటరెడ్డి, ఫిరోజ్, సానికొమ్ము విజయభాస్కర్‌రెడ్డి, తెలుగు మహిళలు కరణం అరుణ, ధనలక్ష్మి, దొరసాని, మాజీ కౌన్సిలర్ షేక్ వాజిదాబేగం, పార్వతి, తులసి తదితరులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్‌ను నిషేధించాలని చేపట్టిన ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

ప్రజా చైతన్యంతోనే స్వచ్ఛాంధ్ర సాధ్యం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రజాచైతన్యంతోనే స్వచ్ఛాంధ్ర సాధ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. నగర పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం దర్శి పట్టణంలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రగా మార్చేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు వాడకాన్ని మానుకోవాలని సూచించారు. ఈసందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, నగర పంచాయతీ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్‌ఛైర్మన్ జి.స్టీవెన్, కమిషనర్ వై.మహేశ్వరరావు, పలువురు కౌన్సిలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలి

ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నివారించి స్వచ్ఛాంధ్ర సాధనకు అందరూ సహకరించాలని ఎంపీడీవో ఎల్.కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని తుమ్మెదలపాడులో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలందరూ పరిశుభ్రతను పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఆవుల సుధాకర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి

దర్శి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. దర్శి పట్టణంలో శనివారం ప్రారంభమైన ఇంటింటికి రెవెన్యూ కార్యక్రమంలో ఆమె పాల్గొని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తమైందన్నారు. వైసీపీ పాలకుల భూదాహంతో రికార్డులు తారుమారు చేశారన్నారు. ఎంతోమంది నిజమైన హక్కుదారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం ఈకార్యక్రమం చేపట్టిందన్నారు. తమ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, నగర పంచాయతీ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కమిషనర్ వై.మహేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

దర్శి నియోజకవర్గంలోని 19మంది లబ్ధిదారులకు స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శనివారం సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో ఇబ్బందిపడుతూ దరఖాస్తు చేసుకున్న 19 మందికి రూ.21,55,937 లక్షల చెక్కులను బాధితులకు అందజేశారు.

ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల ఆరోగ్యం కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు దయార్ద్ర హృదయంతో సహాయ నిధి అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దొనకొండ, కురిచేడు, ముండ్లమూరు మండలాల పార్టీ అధ్యక్షులు శివకోటేశ్వరరావు, పి.నెమలయ్య, కూరపాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన సేవలు అందించాలి

కనిగిరి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఇటీవల ఆపరేషన్ ద్వారా శిశువు జన్మనిచ్చిన బాలింతను శనివారం పరామర్శించారు. కంగారు మదర్ కేర్ కేంద్రంలో అందుతన్న వైద్యసేవలు, సౌకర్యాలపై ఆమెను విచారించారు. వైద్యసేవలపై ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ప్రయివేట్ ఆసుపత్రిలో చూపించుకుంటే రూ.50 వేలకు పైగా ఖర్చు అవుతుందని చెప్పారని ఎమ్మెల్యేకు తెలిపారు. అంత ఖర్చు ఎలా భరించాలి అని ఆందోళన పడుతున్న సమయంలో ప్రభుత్వాసుపత్రిలో చేరినట్లు తెలిపారు. గతంలో ప్రభుత్వాసుపత్రిపై ఉన్న అపోహలన్నీ పోయాయని, ఇంత మెరుగైన వసతులు ప్రయివేటు ఆసుపత్రిలో కూడా లేవని ఆమె పేర్కొన్నారు.

డయాలసిస్ కేంద్రంలో దాతల సహకారంతో ఏర్పాటుచేసిన మిషన్‌ను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ప్రారంభించారు. అనంతరం జనరల్ వార్డును పరిశీలించారు. ఓప్రమాదంలో గాయపడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడిని పరామర్శించారు. బాలుడిని వివరాలు అడిగి ధైర్యంగా ఉండాలని చెప్పారు. బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారులు, నాయకులు పాల్గొన్నారు.


బాలింతను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

సాంకేతిక పద్ధతులతో పంటలు సాగుచేయాలి

దర్శి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పద్ధతులతో పంటలను సాగు చేయాలని గుంటూరు సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ సూచించారు. శనివారం స్థానిక కృషి విజ్ఞాన కేద్రంలో జరిగిన శాస్త్రీయ సలహా మండలి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రకాశం జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి శాస్త్రవేత్తలు తగు ఆధునిక పరిజ్ఞానాన్ని అందించాలని సూచించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు శాస్త్రవేత్తలు కృషి చేయాలని కోరారు. డాక్టర్ డి.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వాతావరణం, నేలల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని అనువైన పంటలను సాగు చేసుకునే విధంగా రైతులను చైతన్యవంతులను చేయాలన్నారు. వంగడాల ఎంపికలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.

ఈసందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను వారు పరిశీలించారు. 2024-25 సంవత్సరంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సాధించిన ప్రగతిని సమన్వయకర్త డాక్టర్ జి.రమేష్ వివరించారు. క్షేత్ర పరిశీలన కోసం సాగుచేసిన పంటలను చూపించారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ పి.సంధ్యారాణి, డాక్టర్ సీహెచ్ వరప్రసాదరావు, డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, మానస, ఎం.రవీంద్రబాబు, బి.పూర్ణచంద్, ఎం.రవివెంకన్న, దర్శి ఏడీఏ బాలాజీనాయక్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శివన్నారాయణ

ఆగని జామాయిల్ అక్రమ రవాణా

సీఎస్‌పురం(పామూరు), మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ భూముల్లో సాగులో ఉన్న జామాయిల్ అక్రమ రవాణా ఆగడం లేదు. తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి యథేచ్ఛగా జామాయిల్ కర్రను అక్రమంగా తరలిస్తూ జేబులు నింపుకొంటు న్నారు. మండలంలోని పెదరాజుపాలెం పంచాయతీ పరిదిలోని నలజనంపాడు రెవెన్యూ పరిధిలో ఉన్న అగ్రిగోల్డ్ భూముల్లో ఉన్న జామాయిల్ తోటలను అక్రమంగా నరికి లారీల ద్వారా తరలిస్తున్నా అడ్డుకునే నాథుడే కరువయ్యారు. నలజనంపాడులోని సర్వే నెంబర్లు 204/2, 204/3,205/2,205/3లో గల అగ్రిగోల్డ్ సంస్థ జామాయిల్ తోటలను సాగుచేసింది. గత మూడు రోజుల నుంచి లింగసముద్రం మండలానికి చెందిన ఓవ్యక్తి కర్రను తరలిస్తున్నాడని గ్రామస్థులు తెలిపారు. గతంలో అగ్రిగోల్డ్‌కు భూ ములు అమ్మిన వ్యక్తి తన పేరుతో ఆ భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకొని జామాయిల్ కర్రను తరలించుకొంటున్నాడని గ్రామస్థులు తెలిపారు. అగ్రిగోల్డ్ ఆస్తులన్నీ సీఐడి ఆధీనంలో ఉన్నప్పటికీ జామాయిల్ రవాణా యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జామాయిల్ అక్రమ రవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

‘పది’ పరీక్షలకు సన్నద్ధం

కనిగిరి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 24 కేంద్రాలను విద్యాశాఖ ఏర్పాటుచేసింది. కనిగిరి పట్టణంలో 8 కేంద్రాల్లో, కేవీపల్లి హైస్కూల్‌లో రెండు కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారు. నియోజకవర్గంలో 3565 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారు. కనిగిరి మండలంలోని పది కేంద్రాల్లో 1296 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నట్టు ఎంఈవో నారాయణరెడ్డి తెలిపారు.

పరీక్షా సామగ్రి అందజేసిన దాతలు

పదో తరగతి పరీక్షలు వ్రాస్తున్న ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు పరీక్షా సామగ్రిని దాత, టీడీపీ నాయకుడు కొల్లూరి శ్రీనివాసరావు సోమవారం అందజేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్టు చెప్పారు. పాఠశాల స్థాయిలో ప్రథమ బహుమతి పొందిన విద్యార్థికి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ2 వేలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సంజీవి, ఉపాధ్యాయులు నాగపద్మజారాణి, కోటిరత్నం, తదితరులు పాల్గొన్నారు. అలాగే, బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో డీఎస్పీ చేతలమీదుగా విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఛైర్మన్ గఫార్, బీసీ నాయకులు పాల్గొన్నారు.

పూర్తయిన ఏర్పాట్లు

పీసీపల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఎంఈవోలు ఆర్.శ్రీనివాసులు, జి.సంజీవి తెలిపారు. సోమవారం నుంచి జరుగుతున్న ఈ పరీక్షలకు పీసీపల్లిలో మూడు కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 94మంది, జడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రం-ఎలో 140 మంది, కేంద్రం-బిలో 140మంది మొత్తం 374మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో 144సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

ముండ్లమూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న 46 మంది విద్యార్థులకు కమ్మవారిపాలెం గ్రామానికి చెందిన దామా ఏడుకొండలు శనివారం ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. తమ కుమార్తె దామా పూర్ణిమ వెంకట నందిని గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో మండల టాపర్‌గా నిలవటంతో ఈఏడాది పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు టాన్య, ఉపాధ్యాయులు రామకృష్ణ, నాయక్, మాజీ విద్యా కమిటీ ఛైర్మన్ అంకిరెడ్డి పాల్గొన్నారు.

ముఖాముఖి

పదో తరగతి పరీక్షలకు అన్నిఏర్పాట్లు

ఎన్. సాంబశివరావు, ఎంఈవో, దొనకొండ



ప్రశ్న: మండలంలో ఎన్ని కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నారు ?

జవాబు: ఈనెల 17వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. ఇందుకుసంబంధించి దొనకొండలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏ, బీ కేంద్రాలను ఏర్పాటుచేశాం.

ప్ర: విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేశారా ?

జ: విద్యార్థులు సౌకర్యవంతంగా పరీక్షలు వ్రాసేలా బల్లలు, కుర్చీలు, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నాం. ఆరోగ్యపరమైన సమస్యల నిమిత్తం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం సిబ్బంది పర్యవేక్షణ, పోలీస్ బందోబస్తుతో పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేపట్టాం.

ప్ర: ఎంతమంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు ?

జ: మండలంలోని దొనకొండ, తెల్లబాడు, గంగదేవిపల్లి, చందవరం, కొచ్చెర్లకోట, మంగినపూడి, ఆరవళ్లిపాడు జడ్పీ పాఠశాలలు, కేజీబీవీ, సెయింట్ ఆంథోనీస్, విశ్వభారతి, వివేకానంద పాఠశాలలకు చెందిన 547 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కనిగిరి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని 1104 విద్యుత్ యూనియన్ డివిజన్ కార్యదర్శి హరికృష్ణ పేర్కొన్నారు. ఇటీవల ఈఈగా బాధ్యతలు స్వీకరించిన ఉమాకాంత్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈసందర్భంగా విద్యుత్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈఈ దృష్టికి తీసుకెళ్లారు. ఈఈ సానుకూలంగా స్పందించి సంస్థ అభివృద్ధికి పాటుపడే కార్మికులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు అనిల్‌కుమార్, మల్లయ్య, కృష్ణకుమార్, రమేష్ అనంతయ్య, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

పామూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మహిళల స్వయంసంవృద్ధిలో భాగంగా టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన బీసీ, కాపు, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షతియ, బ్రాహ్మణ మహిళలు స్థానిక సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్లను సంప్రదించి దరఖాస్తులు అందజేయాలన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

పీసీపల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నేరేడుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 2010-11విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ప్రింటర్‌ను బహూకరించినట్లు ప్రధానోపాధ్యాయురాలు అంజనీదేవి తెలిపారు. అలాగే సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేసినట్టు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పామూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పామూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొంటున్నట్టు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ, గ్రామ సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

భక్తి శ్రద్ధలతో పంచామృతాభిషేకాలు

పామూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మదన వేణుగోపాలస్వామి దేవస్థానంలో ప్రతి శనివారం నిర్వహించే పంచామృతాభిషేకాల కార్యక్రమంలో భాగంగా అయ్యప్పస్వామి దేవస్థాన ఛైర్మన్ గుత్తిరాజ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో శనివారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తిరాజ బుజ్జమ్మ, కుమారుడు అనిల్, కోడలు యశస్విని ఆధ్వర్యంలో స్వామివార్లకు నైవేద్యాన్ని ఆలయ ప్రదక్షిణచేసి సమర్పించారు. కార్యక్రమంలో ఈవో నరసింహబాబు, బండ్ల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కురిచేడు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కురిచేడు, ఆవులమంద విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ రామక్రిష్ణ తెలిపారు. విద్యుత్‌లైన్ మరమ్మతులు, చెట్ల తొలగింపు కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా ఉదయం 7 నుంచి నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈవిషయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని కోరారు.


అయోధ్యనగర్ వద్ద మోదేపల్లి మేజరు కాలువలో పేరుకుపోయిన తూటు కాడను తొలగిస్తున్న కంచుమాటి శ్రీనివాసరావు, జేఈలు

మోదేపల్లి మేజరులో తూటు కాడ తొలగింపు

ముండ్లమూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మోదేపల్లి మేజరు కాలువలో తూటుకాడను తొలగించారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం డీసీ ఛైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు, జేఈలు ప్రసాద్, సత్యనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు శ్రమదానం చేశారు. కాలువలో పేరుకుపోయిన తీగ ఆకును, రబ్బరు చెట్లను తొలగించారు. కార్యక్రమంలో నీటి సంఘాల అధ్యక్షులు ఉన్న పరిపూర్ణయ్య, కంచుమాటి నాగేశ్వరరావు, లస్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

పామూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత సమాజం కోసం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను వాడకుండా పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య సూచించారు. మండలంలోని చింతలపాలెం గ్రామంలో స్వచ్ఛ ఆంద్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో కరుణకుమారి, ఈవోపీఆర్డీ జీవీ అరవిందరెడ్డి, సర్పంచ్ ఎం.గురవయ్య, మాజీ సర్పంచ్ ఇల్లూరి రామిరెడ్డి, టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు, కేతు విజయభాస్కరరెడ్డి, ఏపీవో బి.మాల్యాద్రి, ఏఈ రమేష్, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో జనార్దన్

ముండ్లమూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఎంపీడీవో ఆర్.జనార్దన్ అన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెత్త సంపద కేంద్రాల ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామ మౌలిక వసతులకు ఖర్చు పెట్టనున్నట్టు చెప్పారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి సమస్య లేకుండా చూడాలన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని వీధుల్లో చెత్తాచెదారాన్ని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే పంచాయతీ కార్యదర్శులను బాధ్యులను చేయడం జరుగుతుందన్నారు. అనంతరం బంగారు బాల్యం కార్యక్రమంపై జరిగిన మండల కమిటీ సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రత్నరాజు, ఏపీఎం హనుమంతరావు, వైద్యాధికారి జాస్మిన్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రిక పథకానికి రూ.6 లక్షలు కేటాయింపు

దొనకొండ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): దొనకొండ మండలానికి వ్యవసాయ యాంత్రిక పథకం కోసం రూ.6లక్షలు కేటాయించినట్లు మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన నాలుగు రకాలకు చెందిన 38 యాంత్రిక పరికరాలను 50 శాతం లేదా ప్రభుత్వం నిర్ణయించిన సబ్సిడీపై అందజేస్తామన్నారు. సోమవారం నుంచి రైతుసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందులో ఎస్సీ రైతులకు ఆరు, ఎస్టీ రైతులకు రెండు పరికరాలను కేటాయించినట్లు తెలిపారు. ఈపథకానికి చిన్న, సన్నకారు రైతులు మాత్రమే అర్హులని, గత మూడు సంవత్సరాల్లో ఏదో ఒక సీజన్‌లో పంట నమోదు చేయించుకొని ఉండాలన్నారు.

ఓటర్ల రివిజన్‌కు అందరూ సహకరించాలి


మాట్లాడుతున్న దర్శి నియోజకవర్గ ఎలక్ట్రోరల్ అధికారి జాన్సన్, పాల్గొన్న తహసీల్దార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు

దర్శి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): దర్శి అసెంబ్లీలో ఓటర్ల రివిజన్ నిష్పక్షపాతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని నియోజకవర్గ ఎలక్ట్రోరల్ అధికారి ఎస్.జాన్సన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన యువతీ యువకులు ఫారం 6 నమోదు చేసి ఓటర్ల జాబితాలో పేర్లు నమోదుచేసుకోవాలన్నారు. తొలగింపులకు ఫారం 7, సవరణలకు ఫారం 8, బదిలీలకు ఫారం 8ఎం ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితా బీఎల్‌వోల వద్ద అందుబాటులో ఉందన్నారు. పరిశీలించి మార్పులు, చేర్పులు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దర్శి తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పామూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ గడ్డె ఏడుకొండలు తెలిపారు. మండలంలోని కంభాలదిన్నె గ్రామంలో గల ఆయుర్వేద వైద్యశాలలో శనివారం డాక్టర్ ఏడుకొండలు ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నివారణకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. అనంతరం వైద్యశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు మన్నం రమణయ్య, గోళ్ల బాస్కరరావు, వీరబాబు, ఓరుగంటి సుబ్బమ్మ, ఉమ్మడి పద్మ, నూర గోవిందమ్మ, ఎం.శ్రీనివాసులు, ఎస్.జయమ్మ, వై.చెన్నకేశవులు, పోక శ్రీనివాసులు ఎస్.జయమ్మ, తదితరులు పాల్గొన్నారు. అలాగే, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో మోపాడు ప్రాజెక్టు సూపర్‌ఛైర్మన్ చుంచు కొండయ్య, కార్యదర్శి రాంప్రసాద్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు మోటారుసైకిల్ దగ్ధం

ముండ్లమూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లు గ్రామానికి చెందిన ఎడమకంటి నాగార్జునరెడ్డికి చెందిన ద్విచక్ర వాహనం ప్రమాదవశాత్తు శనివారం సాయంత్రం దగ్ధమైంది. కాలిపోతున్న మోటారు సైకిల్‌ను కాపాడుకోవటానికి యత్నించగా మంటలు అంటుకొని స్వల్పగాయాలయ్యాయి. ద్విచక్రవాహనంపై పొలం వెళ్లిన నాగార్జునరెడ్డి గట్టుపక్కన నిలిపాడు. పొలంలో కరివేపాకు మొద్దులను, వ్యర్థపదార్థాలను తగులబెడుతుండగా మంటలు చెలరేగి మోటారు సైకిల్‌ను అంటుకొని పూర్తిగా కాలిపోయింది. వాహనాన్ని రక్షించుకునేక్రమంలో మంటలు అంటుకుని నాగార్జునరెడ్డి రెండు చేతులకు స్వల్ప గాయాలయ్యాయి.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

ఆదివారం 16 మార్చి 2025



• వెంకటపాలెంలో అంగరంగ వైభవంగా జరుగుతున్న వేంకటేశ్వరుడి కల్యాణ మహోత్సవం



మంగళసూత్రాన్ని చూపిస్తున్న వేద పండితులు



అమరావతి ఆధ్యాత్మిక నగరి

- అంగరంగ వైభవంగా శ్రీవారి కల్యాణం
- గోవిందనామస్మరణతో మార్మోగిన వెంకటపాలెం
- పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు దంపతులు
- కల్యాణోత్సవానికి గవర్నర్ సహా మంత్రులు, ఎమ్మెల్యేలు రాజధాని వాసులు హాజరు

గోవింద నామస్మరణలు.. అన్నమయ్య సంకీర్తనలతో భక్తుల తన్మయత్వం.. భక్తుల కోలాటాలు.. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో రాజధాని అమరావతి ఆధ్యాత్మికనగరంగా మారిపోయింది. విద్యుత్ దీపాలంకరణలతో శోభాయమానంగా వెలుగులీనుతుండగా రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు శ్రీవారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి సప్త ద్వారాలు, ఆనంద నిలయంతో వైకుంఠాన్ని తలపించేలా టీటీడీ కల్యాణ వేదిక ఏర్పాటు చేయగా రంగు రంగుల పుష్పాలు, ఫలాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితుల ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం జరగ్గా ఆహుతులు తిలకించి పరమానందభరితులయ్యారు.

తుళ్లూరు, గుంటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గోవిందా.. గోవింద.. ఏడుకొండల వాడా వేంకటరమణా గోవిందా.. అంటూ భక్తులు వెంకన్న నామాలను స్మరిస్తుండగా.. అత్యత్భుత అలంకరణలతో ఇల వైకుంఠం తిరుమలను రాజధాని అమరావతిలో ప్రతిష్ఠించారా అన్నట్లు జరిగిన ఏర్పాట్లు, అలంకరణల మధ్య వెంకటపాలెం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో శ్రీవారి కల్యాణం కన్నుల పండు వగా జరిగింది. టీటీడీ ఆధ్వర్యంలో ఆ దేవ దేవుడి కల్యాణ మహోత్సవం అమరావతి రాజ ధానిలో తొలిసారి అంగరంగ వైభవంగా జరిగిం ది. అన్నమాచార్య సంకీర్తనలు, వేద మంత్రోచ్చరణల మధ్య శ్రీనివాసుడి కల్యాణం రాజధాని ప్రజలకు కొత్త అనుభూతిని పంచిపెట్టింది. శ్రీవారి కల్యాణ వేదిక విద్యుత్ దీపాలంకరణలతో శోభాయమానంగా విరాజిల్లింది. కల్యాణోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ఆద్యంతం భక్తి భావంతో తన్మయత్వం పొందారు. తొలుత ఆల యంలో స్వామివారిని దర్శించుకున్న అనంత రం మంగళవాయిద్యాల నడుమ సతీసమేతంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, గరవ్నర్ నజీర్‌తో కలసి ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు పట్టు వస్త్రాలు తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ వేదపండితులు కల్యాణ వేడుక కైంకర్యాలను నిర్వహించారు. చివరగా కర్పూర హారతి, నక్షత్ర హారతి, మహా హారతితో కల్యాణోత్సవం అత్యంత ఘనంగా ముగిసింది. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరి నారాయణ, కొల్లు రవీంద్ర, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, టీటీడీ ఈవో శ్యామల రావు, ఏఈవో వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, తమ్మిశెట్టి జానకీదేవి, ఎంఎస్ రాజు, భానుప్రకాశ్, కలెక్టర్ నాగలక్ష్మి అమ రావతిలోని వివిధ గ్రామాల ప్రజలు తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు.



స్వామి వారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు



స్వామి వారి కల్యాణాన్ని తిలకిస్తున్న ప్రజలు



తీరంలో స్వచ్ఛత వెల్లివిరియాలి

- ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించాలి
- ఇంటర్ బోర్డు కమిషనర్, జిల్లా ప్రత్యేకాధికారి కృతికాశుక్లా
- సూర్యలంక సముద్రతీరంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర



సూర్యలంక తీరంలో ఊడ్చి శుభ్రం చేస్తున్న రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్, జిల్లాస్పెషలాఫీసర్ కృతికా శుక్లా, కలెక్టర్ వెంకటమురళి



స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, ఎమ్మెల్యే నరేంద్ర వర్మ తదితరులు

బాపట్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సుందరమైన సూర్యలంక సముద్ర తీరంలో స్వచ్ఛత వెల్లివిరియాలని ఇంటర్ బోర్డు కమిషనర్, జిల్లా ప్రత్యేకాధికారి కృతికాశుక్లా తెలిపారు. బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం జరిగింది. విద్యార్థులు, పారిశుధ్య కార్మికులు, అధికారులు తొలుత చీపుర్లు పట్టి బీచ్ క్లీనింగ్ చేశారు. అనంతరం తీరంలో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కృతికాశుక్లా మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ తడి, పొడి చెత్త, ప్రమాదకరమైన చెత్తను వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సేకరించిన చెత్తను చెత్త సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాల అమలులో ఇప్పటికీ కొన్ని ప్రాంతాలు వెనుకబడి ఉన్నాయమన్నారు. రాబోయే రోజుల్లో సింగపూర్, లండన్‌లాంటి దేశాలకు ధీటుగా రాష్ట్రంలో పారిశుధ్య కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు, ఎస్పీ తుషార్‌డూడీ, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, డీపీవో ప్రభాకర్, జిల్లా అటవీ, ఉద్యాన, విద్య, ప్రణాళికాశాఖాధికారులు భీమయ్య, జెన్నెమ్మ, ఎస్.పురుషోత్తం, శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు

- రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ కృతికా శుక్లా

బాపట్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్, జిల్లా స్పెషలాఫీసర్ కృతికా శుక్లా తెలిపారు. బాపట్లలోని బాపట్ల జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల తీరు, పరీక్షా కేంద్రంలో వనరులను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యంత్రాంగం పగడ్బందీగా చర్యలు తీసుకుందని చెప్పారు. బాపట్లలోని అన్ని పరీక్షా కేంద్రాలలో ప్రశాంతంగా పరీక్షలు జరిగాయన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా యంత్రాంగం చర్యలు తీసుకుందన్నారు. జిల్లాలో 36 పరీక్షా కేంద్రాలలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరిగాయని కలెక్టర్ జె.వెంకటమురళి వివరించారు. 7,979 మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు రాయాల్సి ఉండగా 7,710 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, కళాశాల ప్రధానాచార్యులు జి.కోటేశ్వరరావు, పరీక్షా కేంద్రం సిఎస్ టి.భవానీ తదితరులు ఉన్నారు.



ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న కృతికా శుక్లా, కలెక్టర్ జె.వెంకటమురళి

జడ్పీటీసీలు.. బాయ్‌కాట్

- 82 మందికి 13 మంది జడ్పీటీసీలే హాజరు
- కోరం లేకపోవడంతో వాయిదా వేసిన చైర్‌పర్సన్
- ఆమోదానికి నోచుకోని బడ్జెట్.. ఏప్రిల్ నుంచి తిప్పలే
- వైసీపీ జడ్పీటీసీల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- హెనీక్రిస్టీనా టీడీపీలో చేరినప్పటి నుంచి సహాయ నిరాకరణ



సమావేశం నుంచి వెళ్లిపోతున్న జడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా



సమావేశం వాయిదాతో హాల్ నుంచి వెళ్లిపోతున్న అధికారులు

గుంటూరు సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జగన్ అసెంబ్లీకి పోవడంలేదు.. తాము మాత్రం జడ్పీ సమావేశానికి ఎందుకు వెళ్లాలి.. అనుకున్నారో ఏమో జడ్పీటీసీలు శనివారం జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. ఆర్థిక సంవత్సరం ముగింపులో కీలకమైన సమావేశాన్ని వైసీపీ జడ్పీటీసీలు బహిష్కరించారు. జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు ఒకటో స్థాయి సంఘ సమావేశం ప్రారంభం కాగా జడ్పీటీసీలు ఆలస్యంగా వచ్చారు. అయితే కోరం సరిపోవడంతో సమావేశాన్ని నిర్వహించారు. మిగిలిన స్థాయి సంఘ సమావేశాలకు కోరం లేకపోవడంతో వాటిని వాయిదా వేశారు. మధ్యాహ్నం జరిగే సర్వసభ్య సమావేశానికి జడ్పీటీసీలు వస్తారులే అని అందరూ అనుకున్నారు. అయితే మధ్యాహ్నం 2.30 గంటలకు సర్వసభ్య సమావేశం ప్రారంభం కాగా అతి తక్కువ మందే హాజరయ్యారు. దీంతో తొలుత గంటసేపు వాయిదా వేశారు. అప్పటికే సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ లక్ష్మణరావు, బాపట్ల జేసీ ప్రఖర్‌జైన్, పల్నాడు జేసీ సూరజ్ ధనుంజయ్, ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన అధికారులు ప్రజాప్రతినిధుల కోసం ఎదురు చూశారు.

ఎమ్మెల్యేలు వస్తారని..

ఎమ్మెల్యేలు సమావేశానికి వచ్చే అవకాశం ఉందని చైర్‌పర్సన్ తొలుత ప్రకటించారు. దీంతో ఎమ్మెల్యేలందరూ హాజరైనా కోరం సరిపోతుందని అందరూ ఊహించగా వారు కూడా సమావేశానికి గైర్హాజరయ్యారు. వాయిదా సమయం ముగిసిన తర్వాత కూడా జడ్పీటీసీలు సమావేశానికి హాజరుకాలేదు. జడ్పీలో మొత్తం 82 సభ్యులు ఉండగా(ఎంపీలు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు కలిపి) కేవలం 13 మంది మాత్రమే హాజరయ్యారు. కోరం కావాలంటే 27 మంది సభ్యులు ఉండాలి. కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు చైర్మన్ ప్రకటించారు.

బడ్జెట్ ఆమోదానికి అడ్డంకులు

శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో 2025-2026 అంచనా బడ్జెట్‌ను ఆమోదించాలి. రూ.643.80 కోట్లతో అధికారులు బడ్జెట్‌ను రూపొందించి ఆమోదం కోసం పాలకవర్గం ముందుకు తీసుకువచ్చారు. బడ్జెట్ ఆమోదం పొందితేనే రానున్న ఆర్థిక సంవత్సరంలో నిధులు కేటాయింపు, చెల్లింపులు, ఖర్చులకు అవకాశం ఉంటుంది. అయితే జడ్పీటీసీలు సమావేశానికి రాకపోవడంతో బడ్జెట్ ఆమోదానికి నోచుకోలేదు. ఫలితంగా ఏప్రిల్ 1 నుంచి జడ్పీ చెల్లింపులు నిలిచిపోతాయని అధికారులు చెబుతున్నారు.

గతంలో ఎన్నడూ లేదు...

గతంలో ఎన్నడూ లేని రాజకీయ పోకడ జడ్పీలో కనిపిస్తుంది. ప్రభుత్వాలు మారిన తర్వాత బలాబలాలు అటూఇటూ అయినా ఏనాడు జడ్పీ సమావేశాలను బహిష్కరించిన దాఖలాలు లేవు. సమావేశాలకు జడ్పీ టీసీలు హాజరై సమస్యలపై నిలదీసేవారు. ప్రస్తుతం ఆ సంప్రదాయం మంట గలిసిందని ఇలా సమావేశాలు బాయ్‌కాట్ చేస్తే ప్రజా సమస్యల పరిష్కారం ఎలా అన్న ప్రశ్న ఎదురవుతోంది. దళిత మహిళ చైర్‌పర్సన్‌గా ఉండగా వైసీపీ ఇటువంటి రాజకీయ ఎత్తుగడలు వేయడం విమర్శలకు తావిస్తోంది. హెనీక్రిస్టీనా టీడీపీలోకి మారిన తర్వాత జరిగిన తొలి సమావేశంలో కూడా వైసీపీ ఇదే రీతిగా వ్యవహరించి విమర్శలు ఎదుర్కొన్నది. బడ్జెట్ ఆమోదంపై ఏర్పాటు చేసిన కీలక సమావేశంలోనూ అదే పంథాను ఎంచుకోవడంపై విమర్శలు వస్తున్నాయి.

జడ్పీటీసీల దారిమళ్లింపు..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో వైసీపీకే పూర్తి మెజార్టీ ఉంది. చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా కూడా ఆ పార్టీకి చెందిన వారే కాగా ఎన్నికల ముందు ఆమె భర్తతో కలిసి టీడీపీలో చేరారు. ఆ తర్వాత జరిగిన రెండు సమావేశాలకు జడ్పీటీసీలు హాజరయ్యారు. వైసీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా అంబటి రాంబాబు బాధ్యతలు స్వీకరించిన తర్వాత జడ్పీటీసీలను ఇటీవల జగన్ వద్దకు తీసుకువెళ్లినట్లు సమాచారం. జడ్పీ విషయాల్లో సహాయ నిరాకరణ పాటించాలని జడ్పీటీసీలను జగన్ ఆదేశించినట్లు తెలుస్తుంది. అయినా జడ్పీ సమావేశానికి హాజరయ్యేందుకు జడ్పీటీసీలు సిద్ధం కాగా వారిని వైసీపీ నేతలు పిలిపించి అడ్డుకున్నట్లు సభ్యులు చెబుతున్నారు. వారితో నేతలు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి అక్కడే భోజనాలు కూడా ఏర్పాటు చేసినట్లు సమాచారం.



ఒకే గదిలో ఐదు తరగతుల విద్యార్థుల కూర్చున్న దృశ్యం

ఒకే గది.. ఐదు తరగతులు

దశాబ్దకాలంగా వేమూరులో విద్యార్థుల ఇక్కట్లు

వేమూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వేమూరులో మండల పరిషత్ ప్రాథమిక జేబీ పాఠశాల భవన నిర్మాణ పనులు దశాబ్దకాలంగా పూర్తికాలేదు. ఒక గదిలోనే ఐదు తరగతులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే ట్రాక్ పక్కనే ఉన్న పాఠశాల భవనం పూర్తిగా దెబ్బతినడంతో 2015లో సమీపంలోని ఉర్దూ నార్త్ పాఠశాల భవనంలోకి జేబీ పాఠశాలను మార్చారు. ఉర్దూ పాఠశాలకు కింద ఒక గది ఆపైన ఒక గది మాత్రమే ఉన్నాయి. ఉర్దూ విద్యార్థులు కేవలం 10 మంది లోపే ఉండటంతో పై అంతస్తులో తరగతులను నిర్వహిస్తున్నారు. కింద ఉన్న గదిలో జేబీ పాఠశాల ఐదు తరగతులను నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకే గదిలో 37 మంది విద్యార్థులు కూర్చోవాల్సి ఉంది. ఏ తరగతికి ఆ తరగతి ఉపాధ్యాయులు ఒక్కొక్కరుగా వెళ్లి పాఠం చెప్పి తిరిగి బయట కూర్చొంటున్నారు. ఈ క్రమంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు రెండో దశలో జేబీ పాఠశాల భవన నిర్మాణానికి రూ.13 లక్షలు, ప్రహరీ నిర్మాణానికి రూ.7 లక్షలు విడుదల చేసింది. 2024 జూన్‌కి భవన నిర్మాణ పనులు పూర్తి చేశారు. అయితే కిటికీలు, రంగుల పనులతో పాటు ఆర్వో ప్లాంటు నిర్మాణం ముందుకు సాగలేదు. దీంతో కొత్త భవనంలోకి పాఠశాల మార్పు జరగలేదు. ఒకే గదిలో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని కొందరు తల్లిదండ్రులు వేరే పాఠశాలలో చేర్పించారు. ఇంకా అధికారులు అలసత్వం చూపితే జేబీ పాఠశాల పరిధిలో మరింతగా పిల్లలు తగ్గే అవకాశం ఉంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.23 (ఆదివారం సాయంత్రం)

సహరి : 4.58 సోమవారం ఉదయం


శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు


చంద్రబాబు దంపతులకు హారతి ఇస్తున్న వేద పండితుడు


పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు





అమరావతిలో.. శ్రీవారి కల్యాణోత్సవం

రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.


-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి


శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు


గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు


చంద్రబాబుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు


సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు


మంగళసూత్రాలు చూపుతున్న వేద పండితులు


కల్యాణం తిలకిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని, మంత్రి ఆనం, బీఆర్ నాయుడు


కల్యాణం తిలకిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రి నారాయణ


కల్యాణాన్ని తిలకిస్తున్న పీఠాధిపతులు


వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు


కల్యాణ మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యేలు పుల్లారావు, ఆనందబాబు, రామాంజనేయులు తదితరులు


ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు

వైభవంగా స్వామివార్ల కల్యాణోత్సవం

ఉప్పుటూరు(పర్చూరు), మార్చి 15(ఆంధ్రజ్యోతి) పర్చూరు మండల పరిధిలోని ఉప్పుటూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ గంగా పార్వతీ సమేత అమరేశ్వర స్వామి, శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సం సందర్భంగా నిర్వహిస్తున్న పూజాకార్యక్రమాలు శనివారంతో ముగిసాయి. గత నాలుగు రోజుల నుంచి ఆలయంలో వివిధ రకాల పూజాకార్యక్రమాలు అభిషేకాలు ఆలయ అర్చకులు కారంచేటి పిచ్చయ్య శాస్త్రీ, నూతలపాటి సుబ్రహ్మణ్యం, మూలం రాజు కుమారస్వామి నేతృత్వంలో జరుగుతున్నాయి. శనివారం పూర్ణాహుతి, ధ్వజ అవరోహణ, మూగబలి, కలశోద్వాసనతో పూజాకార్యక్రమాలు ముగిసాయి. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి దామా నాగేశ్వరరావు సారధ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

పర్చూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పర్చూరులోని భవనం అంజిరెడ్డి తులాబంధుల అర్జునయ్య జూనియర్ కళాశాలలో జరిగిన ఇంటర్ పరీక్షలు సజావుగా ముగిసాయి. శనివారం సీనియర్ ఇంటర్‌కు సంబంధించి పరీక్షలు జరిగాయి. పర్చూరు మండల పరిధిలోని నూతలపాడు, నాగులపాలెం బాలయోగి గురుకుల కళాశాల, పర్చూరు బిఏఆర్‌అండ్ టీఏ కళాశాలకు సంబంధించి మొత్తం 1066 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, అందులో 77 మంది గైర్హాజరు అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ జి.రవికుమార్, డిపార్టుమెంట్ ఆఫీసర్ బి.సునీత తెలిపారు.

మొక్కలను నాటాలి

అద్దంకి మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రతను పాటించడంతోపాటు, మొక్కలను నాటాలని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అద్దంకి పట్టణంలోని నర్రావారిపాలెం శ్మశానంలో గో గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో 10 గానుగ మొక్కలను కమిషనర్ రవీంద్ర నాటారు. సింగరకొండ రోడ్డులోని విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఈఈ నల్లూరి మస్తానరావు ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేశారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది చేత ఈఈ మస్తానరావు స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాలలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెరిగిన ఆర్‌టీసీ తిరునాళ్ల ఆదాయం

అద్దంకి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ తిరునాళ్లకు అద్దంకి డిపో నుంచి 24 బస్సులను నడపడం ద్వారా 2లక్షల86వేల 920 రూపాయల ఆదాయం వచ్చినట్లు డీఎం రామ్మోహనరావు శనివారం తెలిపారు. గత ఏడాది కన్నా రూ.80వేలు దనంగా ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.

23న సాహిత్య పురస్కార సభ

అద్దంకిటౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మల విశిష్ట సాహిత్య పురస్కార-2025 సభ ఈ నెల 23న పుట్టంరాజు కళాక్షేత్రంలో ఉదయం 10 గంటలకు జరుగుతుందని ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. శనివారం పురస్కార సభకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.

భారీగా పెరిగిన తిరునాళ్ల ఆదాయం

శింగరకొండ ఆలయ హుండీల కానుకల లెక్కింపు

అద్దంకి, మార్చి15(ఆంధ్రజ్యోతి): శింగరకొండ 70 వ వార్షిక తిరునాళ్ల సందర్భంగా ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి దేవాలయాలలో హుండీల కానుకల ద్వారా వచ్చిన ఆదాయం గత ఏడాది కంటే భారీగా పెరిగింది. ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో హుండీల కానుకల లెక్కింపును శనివారం ఈవో, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు, ఫెస్టివల్ ఆఫీసర్ రమణమ్మల పర్యవేక్షణ లో లెక్కించారు. గత ఏడాది హుండీల ద్వారా 8.26,081 రూపాయలు రాగా ఈ ఏడాది 14,25,272 రూపాయలు వచ్చాయి. గత ఏడాది కంటే సుమారు 6 లక్షల రూపాయలు అదనంగా వచ్చాయి. పూజా టికెట్ల ద్వారా గత ఏడాది రూ.8,26,435 రాగా, ఈ ఏడాది రూ.10,04,491 ఆదాయం వచ్చింది. లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో 15 రోజులలో హుండీల ద్వారా వచ్చిన కానుకలను శనివారం లెక్కించారు. హుండీల ద్వారా రూ.1,38,334, పూజా టికెట్ల ద్వారా 1,28,270 రూపాయలు మొత్తం 2,66,604 రూపాయలు వచ్చింది. గత ఏడాది హుండీల ద్వారా 89,974 రూపాయలు, పూజా టికెట్లు ద్వారా 1,05,350 రూపాయలు వచ్చాయి. గత ఏడాది కంటే 71,280 రూపాయలు అదనంగా వచ్చింది. ఫెస్టివల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, ఈవో కోటిరెడ్డి పర్యవేక్షించారు. గతంలో కంటే ఈ ఏడాది పగలు సమయంలో తిరునాళ్లకు భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో దేవాలయాల ఆదాయం కూడా భారీగా పెరిగేందుకు దోహదపడింది.


డంపింగ్ యార్డ్‌లో వానపాములను వదులుతున్న అధికారులు

సంపద కేంద్రాలుగా డంపింగ్ యార్డులు

పంగులూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయితీలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు డంపింగ్ యార్డులను సంపద కేంద్రాలుగా వినియోగించుకోవాలని ఎంపీడీవో స్వరూపారాణి, తహసీల్దార్ పీ సింగారావు అన్నారు. మండలంలోని ముప్పవరంలో శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా డంపింగ్ యార్డును సందర్శించి వర్మీకంపోస్ట్ తయారీ కోసం తొట్లలో వానపాములు వదిలారు. పరిసరాలలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో ప్లాస్టిక్ వినియోగం నిలిపి వేయాలని, దాని వలన కలిగే అనర్థాలపై దుకాణ దారులకు, నివాస ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలోని చెత్తను తడి, పొడి, హానికరమైన చెత్తను ఇంటివద్దనే వేరు చేసి క్లాప్ మిత్రలకు అప్పగించాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుమంత్, టీడీపీ నాయకులు ఏడుకొండలు, బ్రహ్మానందస్వామి, జగన్, సర్పంచ్ సాంబశివరావు, కార్యదర్శి జానీబేగం, కాప్‌మిత్రలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మే ఆఖరులోగా గృహ నిర్మాణాలను పూర్తిచేసుకోవాలి

పంగులూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది డిసెంబరు 10 తర్వాత పక్కా గృహాలు మంజూరై నిర్మాణాలు పూర్తి చేయని లబ్ధిదారులు మే 31 లోగా నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో స్వరూపారాణి అన్నారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులతో ఎంపీడీవో గృహ నిర్మాణంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అసంపూర్తిగా ఉన్న గృహాల నిర్మాణం పూర్తి చేసుకునేందుకు ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనంగా నిధులు చెల్లించేందుకు ప్రభుత్వం తగిన ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ విషయాన్ని లబ్ధిదారులకు తెలియపరిచి మే 31లోగా అసంపూర్తిగా ఉన్న గృహాల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పీఆర్, హౌసింగ్, ఏఈలు హనుమంతరావు. కిషోర్‌కుమార్, ఏపీఎంలు జ్యోతి ప్రసాద్, సంతోషం, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి, రావూరి రమేష్, ఓబుల్‌రెడ్డి, మురకొండ సుబ్బారావు, హౌసింగ్ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్రీనిధి రుణ రికవరీ నూరు శాతం పూర్తిచేయాలి

పంగులూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయక సంఘాలు ఆర్థిక బలోపేతం అయ్యేందుకు సమకూర్చిన శ్రీ నిధి రుణ రికవరీ నూరు శాతం పూర్తి చేయాలని సెర్ప్ డీజీఎం నాగ సుబ్రమణ్యం సూచించారు. వెలుగు కార్యాలయంలో శనివారం ఏపీఎం అధ్యక్షతన జరిగిన వీవోఏల సమావేశంలో డీజీఎం మాట్లాడుతూ మండలంలోని 1236 స్వయం సహాయక సంఘలకు టార్గెట్‌ను మించి శ్రీ నిధి రుణాలు సమకూర్చడం మంచి పరిణామం అని, రుణ రికవరీ నూరు శాతం చేపడితే సెర్ప నుండి అదనపు నిధులు పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ నెల 20 నాటికి ఓడీలు, ఎన్‌పీఏ లేకుండా పూర్తి రికవరీలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏజీఎం నాగబాబు, మేనేజర్ టి.శ్రీనివాసరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్రి భారతి, సీసీలు సాల్మన్, సురేష్. చంద్రశేఖర్, వీవోఏలు పాల్గొన్నారు.


వెలుగు కార్యాలయంలో వీవోఏలకు సూచనలిస్తున్న సెర్ప్ డీజీఎం నాగసుబ్రమణ్యం


గుండ్లకమ్మనదిలో సూర్యాస్తమయ సమయంలో నీటిలో కన్పిస్తున్న ప్రతిబింబం, ఎరుపెక్కిన నీరు

ఎరుపెక్కిన గుండ్లకమ్మనది

సూర్యాస్తమయం సమయంలో గుండ్లకమ్మ నదిలో నీటిలో ఏర్పడిన ప్రతిబింబం ఎరుపెక్కిన నీరు ఆకాశం కనువిందు చేశాయి. శనివారం సాయంత్రం సూర్యాస్తమయంలో గుండ్లకమ్మ నదిపై చూడటానికి నది నీటిలో సూర్యుడు విలీనం అవువున్నట్లు దర్శనమిచ్చింది. ఆ సమయంలో ఆకాశంతో పాటు గుండ్లకమ్మ నీరు కూడా ఎరుపెక్కి కన్పించాయి. వాహన చోదకులు ఆదృశ్యాలను సెల్ ఫోన్‌లలో బంధించారు.

- అద్దంకి (ఆంధ్రజ్యోతి)

విద్యార్థినులకు జాతీయస్థాయి గుర్తింపు


ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

వేటపాలెం(చీరాల), మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం నిర్వహించే ఇన్‌స్పైయిర్ అవార్డులకు మండల పరిధిలోని అక్కయ్యపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎంపికయ్యారు. విద్యార్థుల్లో వైజ్ఞానిక నైపుణ్యతను వెలికితీసే లక్ష్యంలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన ప్రాజెక్టులలో బాలికలు గవిని సుమామల్లేశ్వరి నీటి పంపిణీ విధానం, బెల్లంకొండ వైష్ణవి వైర్‌లెస్ పొల్యూషన్ మానిటరింగ్ సిస్టంను రూపొందించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రశంసాపత్రాలతో పాటు, ఒక్కొక్కరికీ రూ.10వేలు నగదు బహుమతి అందింది. దీంతో శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు భవనం బద్రిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థినిలను, వీరికి గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయులు కరోడి శ్రీనివాసరావు, అనూరాధ అభినందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు జయరావు, శ్రీనివాసరెడ్డి, అంజమ్మ, బాలసుబ్రహ్మణ్యం, ఖమరున్నీసా బేగం, రమణ పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు రైటింగ్ అట్టల పంపిణీ

పంగులూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు శనివారం పాఠశాల హెచ్‌ఎం అణిత రైటింగ్ అట్టలు, పెన్, పెన్సిల్‌తో పాటు స్కేల్స్‌ను పంపిణీ చేశారు. పదో తరగతి పరీక్షలు దృష్టిలో ఉంచుకుని పాఠశాల భౌతిక శాస్త్ర బోధకుడు రాంగోపాలరెడ్డి 81 మంది విద్యార్థులకు ఆరు వేల విలువ చేసే వస్తువులను సమకూర్చారు. ఉపాధ్యాయుడు రాంగోపాలరెడ్డి విద్యార్థుల పట్ల చాటిన వితరణను హెచ్.యం. అణిత, పాఠశాల సహ ఉపాధ్యాయులు కొనియాడారు.



మార్టూరు చెరువు కట్ట నేలపై పగుళ్లు

మార్టూరు చెరువు కట్టపై పగుళ్లు

మార్టూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మంచినీటి చెరువు కట్టపై తూర్పు వైపున అక్కడక్కడా నేల పగుళ్లు ఏర్పడ్డాయి. ముఖ్యంగా రెండుమూడు చోట్ల సుమారు 30 అడుగుల పొడవున పగుళ్లు కనిపిస్తున్నాయి. ఎండాకాలం కావడంతో ఈ పగుళ్లు మరింత పెద్దవయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం మంచినీటి చెరువులో నీళ్లు సమృద్ధిగా ఉన్నాయి. ఇటీవల సాగర్ కాలువ నుంచి తాగునీటి కోసం చెరువుకు తగు పాళ్లలో నీళ్లను పెట్టారు. అయితే చెరువుకట్టకు తూర్పువైపున పగుళ్లు ఉండటంతో చెరువును పూర్తిగా నింపలేదు. అదిగాకుండా చెరువులో తూర్పువైపున చెరువులోతు ఎక్కువగా ఉండడం వలన అక్కడ భారీగా నీటి నిల్వలు ఉన్నాయి. వాటి అంచున చెరువు కట్టపై పగుళ్లు ఏర్పడడంతో, ఏదైనా భారీగా వర్షం కురిస్తే ప్రమాదం జరిగే అ వకాశం ఉంది. ఇదిలా ఉండగా చెరువులో నీళ్లు ఎ క్కువగా ఉండడంతో ప్రస్తుతం పగుళ్లను పూడ్చటానికి అవకాశంలేదు. అయితే రోజూ చెరువు కట్టపై వాకింగ్ కోసం వచ్చే వారు కట్టపై ఏర్పడిన పగుళ్ల తో నడక కోసం ఇబ్బందులు పడుతున్నారు.వాటి పగుళ్లలో కాళ్లు మడతపడే అవ కాశం ఉందని వాకింగ్ చేసే వృద్ధులు,మహిళలు భయపడుతున్నారు.ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. కొంత పగుళ్లు వచ్చిన మాట వాస్తవమేనన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను చెరువుకట్టపైకి తీసుకువచ్చి పగుళ్లను చూపించామన్నారు. చెరువులో కొంతమేర నీరు తగ్గినపుడు పగుళ్లు రిపేరుపనులు చేపడతామన్నారు.

కుంభాభిషేకానికి పక్కా ఏర్పాట్లు



ఏర్పాట్లపై పూజారులతో చర్చిస్తున్న ఈవో, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు

అద్దంకి,మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతిముఖమండపం పునః నిర్మాణ, కుంభాభిషేకం పనులు నిర్వహణ పక్కా ప్రణాళికలతో చేయాలని ఈవో తిమ్మానాయుడు అన్నారు. మే 19వ తేదీన రాతి ముఖమండపం ప్రారంభం, కుంభాభిషేకం భారీ ఎత్తున నిర్వహించనున్న నేపథ్యంలో రెండునెలల కాలవ్యవధి మాత్రమే ఉన్నందువలన పనులు విభజించుకొని ఏర్పాట్లు చేయాలన్నారు. కుంభాభిషేకం సమయంలో చేపట్టాల్సిన పూజా కార్యక్రమాలపై చర్చించారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆధ్వర్యంలో దాతలను కమిటీల సభ్యులుగా నియమించి, పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు హరిశంకరావధాని, ప్రధానపూజారి లక్ష్మీనారాయణ,ఇతర పూజారులు పాల్గొన్నారు.

ఆ రోడ్డులో నరక ప్రయాణం

చీరాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : దండుబాట - విజయనగర్ కాలనీ ప్రధాన రహదారిలో పలుచోట్ల గుంతలు పడి ప్రయాణం నరకప్రాయంగా ఉంది. ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో ప్రజలు చీరాల, పర్చూరు, కారంచేడు ప్రాంతాలకు ప్రయాణాలు సాగిస్తుంటారు. మరమ్మతులతో రహదారి దారుణంగా మారింది. అంతేకాకుండా ఈ మార్గంలో విద్యుత్ దీపాల సౌకర్యం కూడా అంతంత మాత్రంగానే ఉంది. దీంతో రాత్రయితే రాకపోకలకు తీవ్ర అసంతృప్తి కలుగుతుంది. అధికారులు రోడ్డుకు మరమ్మతులతోపాటు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గుంతల మయంగా దండుబాట రహదారి





దేవరపల్లి ఎత్తిపోతలను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

ఆరుతడులకు నీరు అందించడమే లక్ష్యం

- ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తెచ్చేందుకు కార్యాచరణ
- ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాలతో పరిశీలన

పర్చూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఆరు తడులకు నీరు అందించి రైతులను ఆదుకునే విధంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక దృష్టి సారించారని దేవరపల్లి ఎత్తిపోతల పథకం చైర్మన్ గోనుగుంట్ల నాగేశ్వరరావు అన్నారు. శనివారం రైతులతో కలసి దేవరపల్లి గ్రామ పరిధిలోని ఓగేరు వాగుపై ఉన్న ఎత్తిపోతల పథకాన్ని ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించారు. గత వైసీపీ పాలనలో కనీసం మరమ్మతులకు కూడా నోచుకోక అనేక లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పర్చూరు నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తీసుకు వచ్చేలా ఎమ్మెల్యే ఏలూరి చొరవ చూపారన్నారు. అందులో భాగంగా రిటైర్డ్ ఇంజనీరింగ్ అధికారులతో ఎత్తిపోతల పథకాల పరిశీలనకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేసి వానియోగంలోకి తేనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కొమ్మాలపాటి సురేష్, గోనుగుంట్ల నాగేశ్వరరావు, పుల్లెల సుబ్బారావు, తోకల తిరుపతి స్వాములు, సుబ్బారావు, చిమల సత్యం, గడ్డె వీరాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

లారీ, ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడు మృతి

ఇంకొల్లు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా లారీ, ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి తీవ్రగాయాలతో మృతి చెందిన ఘటన పాతమద్రాసు రోడ్డులోని కొణికిపల్లె సమీపంలోని వీరయ్యవాగు వద్ద శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగులుప్పలపాడు మండలం అగ్రహారం గ్రామానికి చెందిన ఆసుతోటి నరసంహారావు (62) ఇంకొల్లు మండలంలోని నాగండ్ల గ్రామంలోని తన కూతురు దగ్గరకు వెళ్లి తిరిగి అగ్రహారం వెళుతుండగా వాగు సమీపంలో ఎదురెదురుగా మోపెడ్ లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో నరసింహారావు తలకు తీవ్రగాయాలు కాగా, 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందు తూ మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



పరీక్ష సామగ్రిని అందజేస్తున్న దాత కమలేశ్వరరావు

ఇంకొల్లు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగవరం కృష్ణయ్య ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు కరి కమలేశ్వరరావు పరీక్ష సామగ్రిని అందజేశారు. శనివారం ప్రతి విద్యార్థికి ప్యాడ్, పెన్ను, పెన్సిల్, ఎరైజర్‌ను అందజేసి సోమవారం నుంచి జరగనున్న పరీక్షలలో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని నార్నె సమత, ఉపాధ్యాయులు సుమలత, దుర్గ, విజయలక్ష్మి, రాధ, జానకి, జయశంకర్, రమ్య పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న రైల్వే ఎస్సై కొండయ్య

చీరాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : కదిలే రైళ్లల్లో ప్రయాణికులకు మత్తు పదార్థాలు ఇచ్చి విలువైన బంగారు, వెడి, నగదు అపహరించే ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలు రైల్వే పోలీసులకు పట్టుబడ్డారు. ఎస్సై కొండయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చత్తీస్‌గడ్ రాష్ట్రం రాయచూర్‌కు చెందిన కాజల్‌వర్మ, హర్యానాకు చెందిన విజయేందర్ కుమార్ వేర్వేరుగా రైళ్లల్లో చోరీలకు పాల్పడుతున్నారు. ఈక్రమంలో నమోదయిన కేసుల్లో జనవరిలో కాజల్ వర్మను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అనంతరం గాలింపు చర్యలు నిర్వహించి రెండు రోజుల కిందట హర్యానా మోచివాలి ప్రాంతంలో విజయేందర్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని శనివారం రిమాండ్ నిమిత్తం నెల్లూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈక్రమంలో ఉన్నతాధికారులు పోలీసులను అభినందించారు.

వ్యవసాయ మోటార్ల వద్ద విద్యుత్ తీగ చోరీ

పంగులూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమూరు గ్రామంలో అలవలపాడు వైపు వెళ్లే పంట పొలాలలో వ్యవసాయ విద్యుత్ పంప్ సెట్లకు అమర్చిన విద్యుత్ తీగ ఏడు చోట్ల గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని గ్రామ రైతు కుర్రా వెంకటేశ్వర్లు తెలిపారు. గడిచిన నాలుగు నెలలలో ఇది రెండవసారి అన్నారు. విద్యుత్ వైర్లు గతంలో చోరీ జరిగిన సమయంలో రూ.5వేలు వెచ్చించి తిరిగి అమర్చుకున్నామన్నారు. మొక్కజొన్న పాలు పోసుకునే దశలో ఉందని. విద్యుత్ తీగ చోరీతో తడులు పెట్టలేని పరిస్థితి నెలకుందని రైతు వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

బొబ్బేపల్లిలో వివాహిత ఆత్మహత్య

మార్టూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొబ్బేపల్లి గ్రామంలో షేక్ సబియా (28) అనే వివాహిత పుట్టింట్లో వంట గదిలో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. ఆమెకు భర్త సద్దాం హుస్సేన్, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం బొబ్బేపల్లి గ్రామానికి చెందిన సబియాకు పెద్ద దర్శి మండలం బొట్లపాలెం గ్రామానికి చెందిన సద్దాం హుస్సేన్‌తో 10 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వారికి ఇద్దరు ఆడ పిల్లలు. అయితే భర్తతో విభేదాలు కారణంగా ఏడాది నుంచి సబియా బొబ్బేపల్లి గ్రామంలో పిల్లలతో కలిసి పుట్టింట్లోనే ఉంటున్నారు.ఈ విషయమై తీవ్ర మానసిక వ్యధకు లోనైన సబియా ఆత్మహత్య చేసుకున్నారు. మృతురాలి తల్లి నూర్జహాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం ప్రభుత్వ ఆస్పత్రిలో శవ పంచనామా నిర్వహించి మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించారు. యద్దనపూడి ఎస్ఐ రత్నకుమారి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చెన్న కేశవస్వామి దేవస్థానంలో శాంతి హోమం చేస్తున్న భక్తులు

ఘనంగా చెన్నకేశవస్వామి వార్షికోత్సవం

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 15 (ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలం చింతపల్లిపాడు గ్రామంలో శనివారం శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో స్వామివారి అనంత వార్షికోత్సవం కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దేవస్థానం ఆవరణలో శాంతిహోమాన్ని నిర్వహించారు. దేవస్థానం అర్చకులు నారాయణ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత తోమాల మండల ఆరాధనలు మూ మూర్తి విశేష అర్చనలు చేశారు. అనంతరం భక్తులు స్వామి వారికి చేయించిన రజత కిరీటాలను మూలమూర్తులు ఉత్సవమూర్తులకు అలంకరించారు. తరువాత భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

మొక్కజొన్న పైరు పరిశీలన



మొక్కజొన్నను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

బల్లికురవ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మినేనివారి పాలెంలో బొబ్బాల వెంకట్రావు సాగు చేసిన మొక్క జొన్నను వ్యవసాయ పరిశోధన స్థానం లాం ఫాం శాస్త్రవేత్తల బృందం శనివారం పరిశీలించింది. రైతు వెంకట్రావు కర్నూల్ సీడ్స్ వారి టైసన్ రకం మొక్కజొన్న విత్తనాలను నాటగా 80 రోజులు దాటిన పైరు బాగా ఎదిగిన చిట్టి కండేలు పడడంతో దిగుబడి రాలేదని వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శాస్త్రవేత్తల బృందం పైరును పరిశీలించింది. కండె ఎందుకు పెరగలేదు, విత్తనాలలో ఏమైనా లోపాలు ఉన్నాయా అనేదానిని పరిశీలించారు. కొన్ని కండెలను శాంపిల్‌గా తీసుకువెళ్లారు. విత్తనాలలో లోపాలు ఉంటే వెంటనే ల్యాబ్ ద్వారా పరీక్షలు చేయిస్తామని రైతుకు న్యాయం చేస్తామని అధికారులు తెలిపారు. ఈ పరిశీలనలో శాస్త్రవేత్తలు డాక్టర్ సీవీ చంద్రమోహన్‌రెడ్డి, డాక్టర్ దయానాగ్రేస్, మార్టూరు వ్యవసాయ సహాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు, ఏవో కుమారి, రైతులు పాల్గొన్నారు.

పంగులూరు : బయటమంజులూరు గ్రామంలో సాగులో ఉన్న మొక్కజొన్న పైరును వ్యవసాయ శాస్త్రవేత్తలు శనివారం పరిశీలించారు. బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం గ్రామ రైతు కొమ్మాలపాటి ఆదిశేషయ్య బయటమంజులూరు గ్రామంలో పొలం కౌలుకు తీసుకుని ముప్పవరం బాలాజీ విత్తన విక్రయ కేంద్రంలో కర్నూల్ విత్తన కంపెనీ వారి టైసన్ రకం, లాటినం విత్తనాన్ని కొనుగోలు చేసి, మొక్కజొన్న సాగు చేపట్టారు. పైరు 76 రోజుల నుంచి 80 రోజుల దశకు చేరుకున్నప్పటికీ వెన్ను రాకపోవడంతో విత్తన లోపం ఉందని ఫిర్యాదు చేశారు. శాస్త్రవేత్తల బృందం లోపాన్ని గుర్తించేందుకు కొన్ని మొక్కలను వెంటతీసుకు వెళ్లారు.

రాజకీయ చరిత్రలో సీఎం చంద్రబాబు అరుదైన రికార్డు

ఎమ్మెల్యే ఏలూరి



సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే ఏలూరి (ఫైల్)

పర్చూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల ఆశీస్సులతో అరుదైన గౌరవం దక్కించుకున్నారని, ఆయన రాజకీయ ప్రయాణం అందరికీ ఆదర్శనీయని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. చంద్రబాబు సేవలను శనివారం ప్రకటనలో ఆయన కొనియాడారు. సీఎం చంద్రబాబు శాసన సభలో తొలి ప్రమాణ స్వీకారానికి నేటితో 47 ఏళ్లు పూర్తి చేసుకున్నారన్నారు. శాసన సభ్యునిగా 15 మార్చి 1978న మొదటి సారిగా ఎమ్మెల్యేగా చంద్రబాబు శాసన సభలో ప్రమాణ స్వీకారం చేశారన్నారు. ఎమ్మెల్యేగా 41ఏళ్లు, సీఎంగా 15ఏళ్లు పూర్తిచేసుకుని ఏపీ చరిత్రలో అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారని ఆయన కొనియాడారు. అభివృద్ధి సంక్షేమం, సామాజిక న్యాయం చేయడంలో బహుముఖ ప్రజ్ఞ చూపడం వల్లనే సుదీర్ఘకాలం చంద్రబాబును ప్రజలు ఆదరించారన్నారు.

సామాజిక న్యాయానికి మారుపేరు చంద్రన్న

మహిళా సాధికారత, విద్యా ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్, స్థానిక సంస్థల ఎన్నికల్లో 33శాతం రిజర్వేషన్‌ల కల్పనలో సీఎం చంద్రబాబు చేసిన కృషి ఎన్నటికీ మరువలేనిదన్నారు. డ్వాక్రా వ్యవస్థను దేశంలోనే మొదటి స్థానంలో నిలిపారని ఏలూరి అన్నారు. రాష్ట్రంలో నేడు రూ.60వేల కోట్ల బ్యాంకు రుణాలు తీసుకునే స్థాయికి డ్వాక్రా మహిళలు ఎదిగారని, ఇది చంద్రబాబు చేసిన కృషికి నిదర్శనమని కొనియాడారు.

ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు

ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా లక్షల మందికి వైదయం అందించి తనదైన రికార్డును సొంతం చేసుకున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నెలకొల్పాలి

ముమ్మరంగా స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర



వాడరేవు తీరంలో ప్లాస్టిక్ నియంత్రణపై ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

చీరాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గం పరిధిలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రాంతాల అధికారులు సిబ్బంది, ప్రజా ప్రతినిధులతో కలిసి అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అంతేకాకుండా ప్లాస్టిక్ నియంత్రణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. వాడరేవు సముద్రతీరంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈక్రమంలో ప్లాస్టిక్‌తో ప్రమాదాన్ని స్థానికులకు వివరించారు. అలాగే పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రామకృష్ణ, ఎపిఎం మధు తదితర సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

వేటపాలెంలో..

మండల పరిధిలో కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ పార్వతి ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా అధికారులు విద్యార్థులకు స్వచ్ఛ దివస్‌పై అవగాహన కల్పించారు. పర్యావరణంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేష్, సెక్రటరీ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే వ్యవసాయాధికారి కాశీవిశ్వనాథ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ రైతు బజార్, ఫిష్ మార్కెట్ ప్రాంతాల్లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. వస్త్ర సంచులను పంపిణీ చేశారు. పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేడుకలు జరిగాయి. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బల్లికురవ : పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు స్వచ్ఛ గ్రామాలుగా ఉండేలా ప్రజలు సహకరించాలని జడ్పీ డిప్యూటీ సీఈవో బాలమ్మ కోరారు. శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వైదనలో ప్రత్యేక పారిశుధ్య కార్యమాన్ని బాలమ్మ పరిశీలించారు. ఈసందర్భంగా పారిశుధ్య కార్మికులను సత్కరించారు.

మార్టూరు : ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నెలకొల్పాలంటూ శనివారం మండలంలోని కోలలపూడి గ్రామంలో గ్రామస్థులు సచివాలయ ఉద్యోగులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం ఉండాలంటూ ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ యం సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో వారు ఆటో స్టాండ్ వద్ద ప్రతిజ్ఞ చేశారు. మార్టూరు గ్రామ పంచాయతీలో ప్రత్యేకంగా శానిటేషన్ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు పర్యవేక్షణలో గ్రామంలో శానిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. యద్దనపూడి మండలంలో యద్దనపూడి ఎంపీడీవో లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో డీటీ మస్తానరావు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

అద్దంకిటౌన్ : గ్రామ పంచాయతీల పరిధిలో ప్లాస్టిక్ రహిత సమాజం కోసం, పరిశుభ్రతలో ప్రతి ఒ క్కరు భాగస్వాములు కావాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య అన్నారు. శనివారం మండలంలోని వెంపరాల గ్రామంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన గ్రామ సభలో ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో ప్లాస్టిక్ వాడకం నిషేధమన్నారు. మన ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకున్నట్లే మన ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తద్వారా సీజనల్‌గా వచ్చే వ్యాధులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో పీఆర్ అండ్ ఆర్‌డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు, ఏపీవో గాయత్రిదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎంపీడీవో సింగయ్య

'పది' పరీక్షకు సర్వం సిద్ధం

డిప్యూటీ ఈవో గంగాధర్

పర్చూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : పది పరీక్షకు సర్వం సిద్ధం చేసినట్లు డిప్యూటీ ఈవో గంగాధర్ అన్నారు. పది పరీక్షల నిర్వహణపై శనివారం వివరాలను వెల్లడించారు. చీరాల ఉపవిద్యాశాఖ పధిలో మొత్తం 9,813 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. 53 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగుకుండా కేంద్రాల్లో వసతులను కల్పించామన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని మంచినీటి సౌకర్యంతోపాటు, మెడికల్ సిబ్బందిని కూడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. డిప్యూటీ ఈవో గంగాధర్ తెలిపారు.

మార్టూరు : మండలంలో సోమవారం నుంచి 10వతరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మండలంలోని 957 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ పరీక్షల నిర్వహణ కోసం 55 మంది ఇన్విజిలేటర్లను యమించారు. దాదాపుగా ప్రతి పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు తాగునీరు, విద్యుత్ తదితర వసతులను ఏర్పాటుచేసినట్లు ఎంఈవో వస్రాం నాయక్ తెలిపారు. అదేవిధంగా పరీక్షా కేంద్రాలైన రాయల్ హైస్కూల్లో 172, శ్రీచైతన్య స్కూల్లో 162, ద్రోణాదుల జడ్పీ హైస్కూల్లో 169, మార్టూరు జడ్పీలో 180, వలపర్ల జడ్పీ హైస్కూల్లో 272 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. యద్దనపూడి మండలంలో రెండు పరీక్షా కేంద్రాలలో సోమవారం పరీక్షలు రాయనున్నారు. యద్దనపూడి జడ్పీ హైస్కూల్లో 127 మంది, పూనూరు జడ్పీ హైస్కూల్లో 149 మంది పరీక్షలకు హాజరుకానున్నారు.



నేడు శ్రీ పొట్టిశ్రీరాములు జయంతి

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి కలెక్టర్ ఆనంద్ పూలమాల వేసి నివాళులు అర్పిస్తారని తెలిపారు. 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని తెలిపారు. ఆయన త్యాగాలను వివరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది భారీగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.25 (ఆదివారం సాయంత్రం)
సహరి : 5.00 (సోమవారం ఉదయం)

రమణీయంగా రంగనాథుడి కల్యాణం



నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి కల్యాణం శనివారం రాత్రి వేడుకగా జరిగింది. ఇక్కడ జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగం గా జరిగిన స్వామివార్ల వివాహానికి భక్తుల తరలివచ్చారు. ఈ సందర్భంగా ఉత్సవర్లను విశేషంగా అలంకరించి ఎదురుకోలు ఉత్సవాన్ని అర్చక స్వాములు నిర్వహించారు. విశేష పుష్పాలతో ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై తాత్పర్య సహిత వ్యాఖ్యానంతో కల్యాణ ఘట్టాలను వివరిస్తూ అర్చకులు, వేద పండితులు నయనానంద కరంగా నిర్వహించారు. మాంగల్యధారణ, తలంబ్రాలు, బంతులాట, మాలా తోరణం తదితర ఘట్టాలను భక్తులు ఆసక్తిగా తిలకిస్తూ గోవిందనామాలు చేయడంతో ఆలయ పరిసరాలు మారుమోగిపోయాయి. ముందుగా తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున పట్టు వస్త్రాలు, తలంబ్రాలను అధికారులు రంగనాథ స్వామికి సమర్పించారు. అనంతరం స్వామివారు గజవాహనంపై విహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, అర్చకులు, ధర్మకర్తలు, ఉభయకర్తలు పాల్గొన్నారు.

● నేడు రథోత్సవం

ఉదివారం ఉదయం 9 గంటలకు రంగనాథుడి రథోత్సవం జరుగుతుందని ఈవో ఏవీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ మేరకు పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ కృష్ణకాంత్ పర్యవేక్షణలో నగర డీఎస్పీ సింధుప్రియ 350 మంది సిబ్బందితో బందోబస్తు విధుల్లో ఉంటారు.

కట్టుదిట్టంగా టెన్త్ పరీక్షలు

● సమగ్ర శిక్ష ఏఎస్‌పీడీ రవీంద్రనాథ్ రెడ్డి

నెల్లూరు (విద్య), మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పది పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అధికారులంతా సమన్వయంతో పని చేయాలని సమగ్రశిక్ష ఏఎస్‌పీడీ, జిల్లా పరిశీలకుడు రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. టెన్త్ పరీక్షల నిర్వహణపై శనివారం నగరంలోని దర్గామిట్ట పరీక్షల విభాగం కార్యాలయంలో విద్యాశాఖ అధికారులు, చీఫ్‌లతో ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 17 నుంచి 31వతేదీ వరకు జరిగే పది పరీక్షల విధులకు హాజరయ్యే సిబ్బంది వారికి అందజేసిన బుక్‌లెట్‌ను అనుసరించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ల అనుమతి లేదని, కేంద్రంలో సెల్‌ఫోన్ దొరికితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్స్‌తోపాటు కోఆర్డినేషన్ కమిటీ సభ్యులంతా సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. మునిసిపాలిటీ, మండల కేంద్రాల్లో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసి కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పోలీస్‌శాఖ ద్వారా పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు, 144 సెక్షన్ అమలు చేయాలని, స్థానికంగా ఉండే జెరాక్స్ కేంద్రాలను మూసివేయాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అంతరాయం లేని విద్యుత్ సరఫరా, మంచినీరు, వైద్య సదుపాయలను కల్పించాలని అన్నారు. ఆర్టీసీ బస్సులను విద్యార్థులను గంట ముందుగానే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకునేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ సమీక్షలో డీఈఓ డాక్టర్ ఆర్.బాలాజీరావు, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ అసదుల్లాఖాన్, డీసీఈబీ కార్యదర్శి రామ్ కుమార్, చీఫ్ సూపరింటెండెంట్లు, ఎంఈఓలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

ఫోజులిచ్చి.. పలాయనం!

మొక్కుబడిగా 'స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివాస్'
అక్కడక్కడా అధికారులు..
కానరాని ప్రజాప్రతినిధులు

ఆంధ్రజ్యోతి పరిశీలన



నెల్లూరులో జూట్ బ్యాగులు అందజేస్తున్న కలెక్టర్ ఆనంద్, పక్కన కమిషనర్ సూర్యతేజ తదితరులు

నెల్లూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): 'స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివాస్' రెండో విడత కార్యక్రమానికే జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు నీరసించిపోయినట్లు ఉన్నారు. సరిగ్గా నెల రోజుల క్రితం ఫిబ్రవరి 15వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాలోని కందుకూరు నుంచే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులను, అధికారులను, ప్రజలకు స్ఫూర్తి కలిగించారు. ప్రతినెల మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించాలని సీఎం పిలుపునిచ్చారు. అయితే, నెల్లూరు జిల్లాలో ఆ స్ఫూర్తి నెల రోజులకే ఆవిరైపోయింది. శనివారం జరిగిన స్వచ్ఛదివాస్ కార్యక్రమానికి చాలా మంది ప్రజాప్రతినిధులు ముహం చాటేశారు. జిల్లా స్థాయి అధికారులు అక్కడికక్కడ కనిపించినా, ఫొటోలకు ఫోజులిచ్చి చల్లగా జారుకున్నారు. మెజారిటీ ప్రాంతాల్లో స్థానిక నాయకులు, అధికారులు కార్యక్రమాన్ని మమ అనిపించారు. మొక్కుబడి ర్యాలీలతో సరిపెట్టుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించిన సందర్భంగా ఫిబ్రవరి 15వ తేదీ జిల్లావ్యాప్తంగా జరిగిన స్వచ్ఛదివాస్ కార్యక్రమాలకు శనివారం నాటి కార్యక్రమాలకు అసలు ఏమాత్రం పొంతన కనిపించకపోవడం విశేషం. తొలివిడత నాటి ఉత్సాహం అటు ప్రజాప్రతినిధుల్లోనూ, ఇటు అధికారుల్లోనూ కనిపించకపోవడం మరో విశేషం.

● నెల్లూరు నగరంలో జరిగిన 'స్వచ్ఛ దివాస్' కార్యక్రమంలో కలెక్టర్ ఓ.ఆనంద్, కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ పాల్గొన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించి, జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. కొన్ని పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈఓ విద్యారమ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జడ్పీ ప్రాంగణంలోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. నుడా కార్యాలయం, విద్యుత్ భవన్‌లో జరిగిన కార్యక్రమాల్లో ఆయా కార్యాలయాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● బుచ్చిరెడ్డిపాలెం రేబాలలో జడ్పీ విద్యారమ, కొడవలూరు మండలం రేగడిచిలక గ్రామంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. కోవూరు, విడవలూరు, ఇందుకూరుపేట మండలాల్లో స్థానిక మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

● కావలిలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది ట్రంక్ రోడ్డులో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ర్యాలీ నిర్వహించారు.



ఉదయగిరిలో ప్రతిజ్ఞ చేస్తూ..

● ఉద్దేశం ఇదీ..

పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాలు వెలువడ్డాయి. ప్రతి నెలా కొత్త అంశాన్ని ఎంచుకుంటారు. జనవరిలో ప్రారంభమైన ఈ స్వచ్ఛాంధ అప్పట్లో 'న్యూ ఇయర్-క్లీన్‌స్టార్' పేరుతో వీధులను, కార్యాలయాలను శుభ్రం చేయడం వంటివి చేపట్టారు. ఫిబ్రవరిలో 'సోర్స్-రిసోర్స్' పేరుతో నీటి వనరులను సద్వినియోగం చేసుకోనేలా కార్యక్రమం నిర్వహించారు. ఈ నెలలో 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణ' పేరుతో కార్యక్రమం చేపట్టారు. వీటితోపాటు పరిసరాలను కూడా శుభ్రం చేసుకోవాలి. ఇందులో విద్యార్థులు, ప్రజల నుంచి ఉన్నతాధికారుల వరకు పాల్గొనే ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కూడా భాగస్వామ్యం కావాలి.

● కందుకూరులలో టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.

● వింజమూరులో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ విద్యార్థులతో కలిసి స్వచ్ఛదివాస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ర్యాలీ నిర్వహించారు.

● ఆత్మకూరులో ఆర్డీవో పావని, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, కౌన్సిలర్లు, స్థానిక తెలుగుదేశం నాయకులతో కలిసి సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను నిషేధించాలంటూ ర్యాలీ నిర్వహించారు.



పరీక్షలు అయిపోయాయోచ్..!

● ఊపిరి పీల్చుకున్న ఇంటర్ విద్యార్థులు
● రోడ్లపై కాగితాలు విసిరేస్తూ కేరింతలు
● కిటకిటలాడిన బస్టాండ్, రైల్వేస్టేషన్లు

నెల్లూరు(విద్య), మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఏడాదంతా కష్టపడి అలసిపోయిన ఇంటర్ విద్యా ర్థులకు ఉపశమనం కలిగింది. 15 రోజులుగా జరుగుతున్న పరీక్షలు శనివారం పూర్తవడంతో విద్యార్థులు రోడ్లపై కేరింతలు కొడుతూ సందడి చేశారు. తమ స్నేహితులతో కలిసి చిందులు వేశారు. మరికొందరు ఐస్‌క్రీమ్ పార్లర్, సినిమా లకు వెళ్లారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులు తమకు కేటాయించిన బస్సుల్లో నుంచి కాగితాలు చింపి రోడ్డుపై విసిరేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. స్వ గ్రామాలకు బయలుదేరిన విద్యా ర్థులతో ఆర్టీసీ బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు కిటకిట లాడాయి. కొందరు తల్లిదండ్రులు తమ సొంత వాహనాల్లో కళాశాలల వద్దకు చేరు కోవడంతో ఆయా ప్రాంతాలు కోలాహలంగా మారా యి. పరీక్షలు ముగిసినా 14 కేంద్రాల్లో మాత్రం ఈ నెల 20వతేదీ వరకు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్ బ్రిడ్జి కోర్సు, మోడర్న్ లాంగ్వేజ్, జాగ్రఫీ పరీక్షలు జరుగు తాయని ఆర్‌ఐఓ ఎ.శ్రీనివాసులు తెలిపారు.

'ఉపాధి'లో అవకతవకలు : 14 మందిపై వేటు

సీతారామపురం : ఉపాధి హామీ పథ కంలో జరిగిన అవకతవకలకు సంబంధించి 14 మందిని సస్పెండ్ చేస్తున్నట్లు డ్వామా పీడీ గంగాభవనీ తెలిపారు. మండలంలో 2023-24లో జరిగిన రూ.8,35,69,875 పనుల వివరాలను సామాజిక తనిఖీ బృందం శనివారం ప్రజా వేదికలో చదివి వినిపించింది. 14 పంచాయతీల్లో జరి గిన పనుల్లో లోపాలపై ఉపాధి సిబ్బంది నుంచి రికవరీకి ఆదేశించారు. ఉపాధి పనుల కింద రూ.26,80,902, పంచాయతీ రాజ్ ద్వారా కింద 3,71,832 రికవరీకి ఆదేశించారు. ఒక్క బసి నేనిపల్లి పంచాయతీ నుంచే రూ.11,30,153 ఉంది. నిధుల దుర్వినియోగం ఆరోపణలపై ఏడుగురు ఎఫ్‌ఏలు, ముగ్గురు టీఏలు, ఇద్దరు సీవోలు, ఏపీవో, ఈసీ మొత్తం 14 మందిని సస్పెండ్ చేశారు.

ఎందుకంత నిర్లక్ష్యం?

● బిలకూట క్షేత్రంలో పరిణామాలపై భక్తుల ఆగ్రహం ● కొత్త రథం తయారీ నుంచే అపశ్రుతులే! ● దేవదాయ శాఖ తీరుపై విమర్శలు

నాలుగు యుగాల చరిత్ర.. కలియుగ దైవం శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి ప్రతిమను సాక్షాత్తు నారధ మహర్షి ప్రతిష్ఠించిన క్షేత్రంగా చెప్పుకునే కొండబిట్రగుంటలోని బిలకూట క్షేత్రంపై అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. వీరు తీసుకునే నిర్ణయాలు, పనితీరుతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. శుక్రవారం జరిగిన శ్రీవారి రథం కదలకపోవడమే నిదర్శనం.


బిట్రగుంట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : 2020, ఫిబ్రవరి 13వ తేదీన ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలకు ముందు రథం తగలబడింది. దేవదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని అప్పట్లో విమర్శలు జోరందుకున్నాయి. పవిత్రమైన, విలువైన స్వామివారి రథానికి భద్రత డొల్లతనం కూడా బయటపడింది. అప్పటి వైసీపీ ప్రభుత్వం నూతన రథం నమూనా ప్రకారం కాకుండా మరోలా తయారు చేశారు. అప్పటి ఈవో రాధాకృష్ణపైనా విమర్శలొచ్చాయి. 2022లో రూపుదిద్దుకున్న రథాన్ని చూసి మరో మతానికి చెంది నదిలా ఉందంటూ పలువురు మండి పడ్డారు. దీంతో ఆ రథానికి మార్పు, చేర్పులు చేసి 2023లో తయారు చేశారు. అప్పట్లో జరిగిన ఉత్సవాలలో రథోత్సవం నిర్వహించగా, కొండబిట్రగుంటలో రథం ఒరిగిపోయింది. ఇందుకు కారణం కూడా దేవదాయశాఖ అధికారుల తప్పిద మేనంటూ భక్తులు మండి పడ్డారు. 25 సంవత్సరాల అనుభవం ఉన్న రథానికి చొప్పలు వేసే వారికి కాకుండా లాభాపేక్షతో కొత్తవారికి ఇవ్వడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానిక పెద్దలు అంటున్నారు. 2024లో రథానికి మరమ్మతులు చేసి, ట్రయల్ రన్ నిర్వహించి, బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు.

● ఇప్పుడెందుకు నిర్లక్ష్యం

2023లో రథం ఒరిగి వాలిపోవడానికి కారణం రథానికి ముందు ఏర్పాటు చేసిన ఇనుప బద్దీ కారణమని నిపుణులు అంటున్నారు. కుదురుతో పాటు కదిలి పోయిన రథానికి మరమ్మతులు చేసి 2024లో రథం తిప్పడంపై అలనాటి వైసీపీ నేతలు, ఈవోల పెత్తనమే కారణమని స్థానికులు అంటున్నారు. ప్రస్తుతం ఏర్పడిన సాంకేతిక లోపం అప్పట్లోనే ఉందన్న విషయం ఆలయ అధికారులకు ముందుగానే తెలుసన్న విషయం నేటికీ చక్కర్లు కొడుతోంది. శుక్రవారం రథం ఆగిపోవ డంతో చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా మోతకావులతో ఉత్సవర్లను ఊరేగించారు.

ఈవో తీరుపై విమర్శలు

నాలుగేళ్లుగా ప్రసన్నుడి ఆలయ అభివృద్ధి పనుల విషయంలో ప్రజా ప్రతినిధులను ఈవో రాధాకృష్ణ పక్కదారి పట్టిస్తున్నాడనే విమర్శలు ఉన్నాయి. కోనేటి నిర్మాణం, తూర్పు రాజగోపురం నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయినా ఈవో పట్టించుకోలేదని భక్తులు ఆవేదన చెందుతున్నారు. కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి చొరవ తీసుకుని దాతలు మందలించడంతో రాజగోపుర పనులు కాస్త ముందుకు సాగాయని అంటున్నారు. ఇక కోనేరు నిర్మాణానికి దాతలు ఇచ్చిన విరాళాలపై లెక్కలకు పొంతన ఉండటం లేదు. పైగా పనులు అర్ధంతరంగా ఆగిపోవడంతో కోనేరు ప్రమాదకరంగా మారిందని భక్తులు వాపోతున్నారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రిగా ఉన్న జిల్లావాసి ఆనం రామనారాయణ రెడ్డి జిల్లా ప్రజా ప్రతి నిధులు పవిత్ర క్షేత్రమైన ప్రసన్నుడి ఆలయ అభివృద్ధికి చొరవ తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



సాంకేతిక లోపంతో ఆగిపోయిన ప్రసన్నుడి రథం

బలహీన వర్గాల పక్షపాతి టీడీపీ

● ఎమ్మెల్సీ బీద రవిచంద్ర
● నెల్లూరులో ఘన స్వాగతం.. పలువురి అభినందనలు


నెల్లూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : బలహీనవర్గాల పక్షపాతి తెలుగుదేశం పార్టీ అని, మూడు ఎమ్మెల్సీ స్థానాలనూ బీసీ, ఎస్సీలకు కేటాయించి మరోసారి దానిని రుజువు చేసుకుందని ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర పేర్కొన్నారు. ఎమ్మెల్సీగా రెండోసారి ఎన్నికై తొలిసారి నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయానికి విచ్చేసిన రవిచంద్రకు ఘన స్వాగతం లభించింది. జిల్లా వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి రవిచంద్రకు శుభాకాంక్షలు తెలిపారు. భారీ గజ మాలలతో సత్కరించారు. టీడీపీ కార్యా లయం ఎదుట బాణసంచా పేల్చి స్వీట్లు పంచి పెట్టారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసిన రవిచంద్ర, అనంతరం విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీలు అన్యాయానికి గురయ్యారని, 34 శాతం ఉన్న రిజర్వేషన్లను 24 శాతానికి కుదించిన ఘనుడు జగన్మోహన్‌రెడ్డి అని విమ ర్శించారు. గత ప్రభుత్వంలో సంక్షేమ కార్పొరేషన్లకు ఒక్క రూపాయి కేటాయించిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. ఫీజు రియంబర్సు మెంటు రద్దు చేసిన జగన్మోహన్‌రెడ్డి.. ఇప్పుడు యువత ఫీజుపోరు పేరుతో ఆందోళనలకు పిలుపునివ్వడం హాస్యాస్పదమన్నారు. ఘోర ఓటమి తర్వాత కూడా వైసీపీ నేతల బుద్ధి మారడం లేదని, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను హేళన చేస్తూ మాట్లాడుతున్నారన్నారు. 2019కు ముందు కుల, మత, ప్రాంతీయ వర్గాలుగా విడదీసి, ప్రజలను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన వైసీపీ, ఇప్పుడు మరోమారు అదే పంథాను అమలు చేయాలని ప్రయత్ని స్తోందని, ప్రజలంతా అప్రమత్తంగా వ్యవహ రించి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, తాళ్లపాక అనురాధ, ధర్మవరపు సుబ్బారావు, జెన్ని రమణయ్య, మామిడాల మధు, కొండూరు పాలిశెట్టి, కాకర్ల తిరుమలనాయుడు, పనబాక భూలక్ష్మి, అమ్రుల్లా, కువ్వారపు బాలాజీ, సాబీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపులో బీద రవిచంద్రను సత్కరిస్తున్న అభిమానులు, పక్కన టీడీపీ నేతలు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

ప్రసన్నుడికి పుష్పాభిషేకం

బిలకూట క్షేత్రంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామికి శనివారం రాత్రి పుష్ప యాగం వైభవంగా జరిగింది. శ్రీవారి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఉదయం అర్చకులు ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం కల్యాణ వేదికపై అలంకారప్రియుడు అయిన ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలతో అభిషేకించారు



పైసలిస్తేనే పదోన్నతి!?

● ఏఎన్‌ఎంల ఉద్యోగోన్నతిలో అక్రమాలు
● వైద్య ఆరోగ్య శాఖపై విమర్శల వెల్లువ
● ఫిర్యాదుల నేపథ్యంలో ఉన్నతాధికారుల దృష్టి
● 17న బహిరంగంగా ఏఎన్‌ఎంలకు కౌన్సెలింగ్
● అవసరమైతే పోలీసు బందోబస్తు : డీఎంహెచ్‌వో

నెల్లూరు (వైద్యం), మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖలో ఏఎన్‌ఎంల ఉద్యోగో న్నతిలో అక్రమాలు జరగాయంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు భారీగా ముడుపులు తీసుకుని, నిబంధనలు పాటించకుండా జాబితా సిద్ధం చేశారంటూ సాక్షాత్తు ఏఎన్‌ఎంలే విమర్శిస్తున్నారు. సచివాలయా ల్లో పని చేస్తున్న 830 మంది ఏఎన్‌ఎంలలో 289 మందికి ఉద్యోగోన్నతి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఇది అమల యితే గ్రేడ్-3 నుంచి గ్రేడ్-1 స్థాయికి ఉద్యోగులు చేరుకోవడంతోపాటు వేతనాలు కూడా అదనంగా రూ. 5 వేల నుంచి 7వేలకు పెరిగే అవకాశం ఉంది. ఈమేరకు గత ఏడాది నవంబరులోనే ప్రభుత్వం ప్రతిపాద నలు పంపగా, ప్రక్రియ ఆలస్యం కావడంతో ఫిబ్రవరికి పొడిగించింది. ఈ నెల 10వ తేదీన ఉద్యోగోన్నతుల ఫైనల్ జాబితా ఆన్‌లైన్‌లో పెట్టగా 13న కౌన్సెలింగ్ జర గాల్సి ఉంది. అయితే, ఈ వ్యవహారం వెనుక భారీ అవినీతి జరిగిందంటూ పలువురు ఏఎన్‌ఎంలు, ఉద్యోగ సంఘాల నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో 17వ తేదీన కౌన్సెలింగ్ జరుగుతున్నట్లు అధికారులు వెల్లడిం చారు. ఇది కూడా అందరికీ తెలిసేలా బహిరంగ కౌన్సెలింగ్ జరుపుతున్నట్లు వెల్లడించారు.

● నిబంధనలు ఇలా ఉన్నా..

అధికారులు తాజాగా తయారు చేసిన ఉద్యోగోన్నతుల రిజర్వేషన్‌లో నిబంధ నలు సక్రమంగా పాటించలేదని, భారీగా అక్రమాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 289 మంది ఏఎన్ ఎంల ఉద్యోగోన్నతిలో దివ్యాంగులకు రిజర్వేషన్ కోటాలో 4 శాతం అంటే 8 మందికి అవకాశం ఇవ్వాలి. అయితే ఇద్దరికే ఈ జాబితాలో చోటు కల్పించి మిగిలిన ఆరుగురికి మొండిచేయి చూపిం చినట్లు తెలుస్తోంది. అలాగే మెరిట్‌తోపాటు స్పౌజ్ కింద రిజర్వేషన్‌లు అమలు చేయాలి. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సి ఉంది. ఇవన్నీ పక్కన పెట్టి చేయి తడిపిన వారికే ప్రాధాన్యత ఇచ్చారని సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.




దివ్యాంగుల రిజర్వేషన్ అమలు కాలేదు



8 మంది దివ్యాంగులకు ఈ ఉద్యోగోన్నతులు కల్పించాలని స్పష్టమైన నిబంధనలు ఉన్నా వాటిని తుంగలో తొక్కి కేవలం ఇద్దరికే ఉద్యోగోన్నతులు కల్పిస్తున్నారు. సచివాలయంలో ఎందరో దివ్యాంగులు ఉన్నా వారిని కాదని అధికారులు జాబితా రూపొందించారు. దీనిపై నాకు న్యాయం చేయాలని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చీఫ్ సెక్రటరీ, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్, ఆర్డీ, డీఎంహెచ్‌వోకు లేఖలు రాశాను.

- ఎంబేటి కామేశ్వరి, బాలిరెడ్డిపాళెం, సచివాలయం ఏఎన్‌ఎం

సక్రమంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తాం



సచివాలయ ఏఎన్‌ఎంల ఉద్యోగోన్నతిపై ఆరోపణలు వస్తున్న మాట నిజమే. అయితే ఈ అక్రమాలను అరికట్టి బహిరంగంగా కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాము. ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసుల పర్యవేక్షణ కూడా ఉంటుంది. పూర్తిస్థాయిలో రిజర్వేషన్లు పాలించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా అభ్యంతరాలు చేస్తే వాటిని పరిగణలోకి తీసుకుంటాం.

- డాక్టర్ సుజాత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

న్యూస్ బాక్స్

నీటి సరఫరాకు పైపులైన్ల వాల్‌ఫిట్స్ నిర్మాణం



బీకే.నగర్ సీసీరోడ్డులో వాల్ ఫిట్స్ ఏర్పాటుకు చేపట్టిన నిర్మాణం

కావలి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి):అమృత్‌పథకం కింద పట్టణంలోని ప్రతిఇంటికీ తాగునీటిని అందించేందుకు అవసరమైన వాల్‌ఫిట్స్ నిర్మాణాలు చేపడుతు న్నారు. గతంలో కొన్ని ప్రాంతాల్లోని పైపులైన్లకు కనెక్షన్‌లు ఇవ్వకుండా ఎక్కడికక్కడ వదిలేశారు. అయితే ఈ పథకంలో భాగంగా ప్రతిఇంటికి కొళాయి కనెక్షన్ ఇవ్వాల్సి ఉన్నందున గతంలో అర్థాంతరంగా నిలిపివేసిన పైపులైన్ల నిర్మాణ పనులను ప్రస్తుతం చేపడుతున్నారు. ప్రతివీధికి అవసరమైన తాగునీరు అందించేందుకు వీలుగా ఈ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఆ నిర్మాణాలు పూర్తి చేసిన తర్వాత ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్లను ఇచ్చేందుకు మున్సిపల్ అధికారులు సిద్ధం అవుతున్నారు.

'చిలుమూరు'కు అవుట్ స్టాండింగ్ స్కాలర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఆచార్య చిలుమూరు శ్రీనివాసరావు

కావలి టౌన్, మార్చి15 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ కావలి పీజీ కళాశాల ఆచార్యుడు చిలుమూరు శ్రీనివాసరావుకు అవుట్ స్టాండింగ్ ఎడ్యుకేటర్ అండ్ స్కాలర్ అవార్డు లభించింది. తమిళనాడు రాష్ట్రం కొయంబత్తూరుకు చెందిన నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సంస్థ నిర్వహించిన గ్లోబల్ కంక్లేవ్ ఆన్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్‌పై జరిగిన జాతీయస్థాయి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అవార్డు అందుకున్నారు. శనివారం శ్రీనివాసరావును పీజీ కళాశాల వీఎస్ యూ అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

కాన్షీరాంకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న అభిమానులు

అల్లూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతిని పురస్కరించుకొని శనివారం స్థానిక పాతబస్టాండు కూడలిలో ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో గాలి వేణుగోపాల్, సతీష్, పప్పు సుధాకర్, హేమంత్ కుమార్, పాశం దయాకర్, పానేటి హేమంత్ పాల్గొన్నారు.

ఫోక్సో చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది కోటయ్య

కందుకూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వివేక డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఫోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీనియర్ న్యాయవాది కోటయ్య పాల్గొని మాట్లాడారు. 18ఏళ్లలోపు బాలికల రక్షణార్థం కఠినమైన నిబంధనలతో కూడిన ఫోక్సో చట్టం తీసుకవచ్చారని తెలిపారు. విద్యార్థులు చెడు ఆకర్షణలకు దూరంగా ఉంటూ చదువపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. అలాగే కందుకూరు బార్ అసోసియేషన్ సభ్యులు సంపత్, న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు మాట్లాడారు. విద్యార్థిదశలోనే చదువపై దృష్టి సారిస్తే మిగిలిన జీవితం సుఖంగా సాగుతుందన్నారు. కార్యక్రమంలో వివేకా డిగ్రీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

3నెలలకోసారి జరిగేది చర్చ మాత్రమే!

- పరిష్కారం కాని అపరిష్కృత మండల సమస్యలు
- అమలుకు నోచుకోని తీర్మానాలెన్నో..
- నేడు సాధారణ సర్వసభ్య సమావేశం



సమావేశంలో పాల్గొన్న అధికారులు (ఫైల్)

అల్లూరు, మార్చి 15 (ఆంధ్ర జ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం ప్రతి మూడు నెలలకోసారి మండలస్థాయిలో సాధారణ సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహిస్తారు. ఇందులో భాగంగా స్థానిక మండల పరిషత్ కా ర్యాలయ సమావేశ మందిరంలో మండలాధ్యక్షుడి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో మ ండల సమస్యలను సభ దృష్టికి తీసుకొస్తారు. తీవ్రతను బట్టి పరిష్కార మార్గాలు ఎంచుకోవాల్సి ఉండగా కేవలం చర్చలకే పరిమితం అవుతున్నారే తప్ప ఎలాంటి చర్యలకు నోచుకోవడం లేదు. ముఖ్యంగా పక్కాగృహాల విషయంపై దారుణమైన పరిస్థితులే ఉన్నాయి. గత ప్రభుత్వంలో నిర్మాణాలు చేపట్టిన గృహాల లబ్ధిదారులకు బిల్లులు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. చాలామంది ఈ సమస్యతో గృహాలను నిర్మించుకోలేక సగంలోనే నిలిపివేశారు. అంతేకాకుండా పట్టా మంజూరు చేసినట్టు ఆన్‌లైన్‌లో ఉన్నా వీరికి స్థలాలే ఇవ్వ లేదు. ఇలాంటి వారి సమస్యను పరిష్కరించలేకపోతున్నారు. పంచాయతీల్లో అస్తవ్యస్తంగా వీధిలైట్లు నిర్వహణ, సాగునీటి కాలువల మరమ్మతులు చేపట్టక రైతులు పంటల సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరపంచాయతీ పరిధిలో నిర్మించిన ఈ తాగునీటి పథకం పరిస్థితి దారుణా తిదారుణంగా ఉన్నది. అల్లూరుతో పాటు నాలు గు గ్రామాలకు తాగునీరు సరఫరా కావ డం లేదు. వేసవి కావడంతో ఈ సమస్య జఠిలంగా మారింది. జడ్పీ ప్రత్యేక నిధులతో మరమ్మత్తులు చేపట్టడం లేదు. ఈ అంశాలన్నీ మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో లేవనెత్తే అంశా లైనా ఇవి కేవలం చర్చలకే పరిమితం చేస్తు న్నారు. పాలకులు, అధికారులు సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతారా లేక కేవలం చర్చలకే పరిమితం చేస్తారా అని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ట్యాంకర్లు వద్ద ప్రజల తాగునీటి కష్టాలు (ఫైల్)

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంతో ప్రమాదం

- ఘనంగా స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్‌పై ర్యాలీలు
- పారిశుధ్య పనులు చేపట్టిన అధికారులు, సిబ్బంది



కావలిరూరల్: ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దారు శ్రావణ్‌కుమార్

కావలి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంతో పెను ప్రమాదం పొంచిఉందని మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్ కుమార్ తెలిపారు. స్వచ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కమిషనర్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది శనివారం పట్టణంలో ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ట్రంకు రోడ్డు మీదుగా గాంధీ బొమ్మసెంటర్, ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం బ్రిడ్జి సెంటర్‌లో మానవహారం నిర్వహించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తే పొంచి ఉన్న ప్రమాదాలను గురించి ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్వో ఫణికుమార్, డీఈ సాయి కుమార్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, సచివాలయ, మెప్మా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌రహిత వస్తువులు వాడండి

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): ఒకసారివాడి పడేసే ప్లాస్టిక్ కాకుండా పర్యావరణరహిత వస్తువులను వాడాలని స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుజాత సూచించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతినెలా మూడో శనివారం చేపట్టే ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో విద్యార్థులు, అధ్యాపకులు ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి చెత్త కుండీల్లో వేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ రహిత వస్తువులను వినియోగించాలని నినాదాలు చేశారు. కార్యక్ర మంలో రాజగోపాల్ బాబు, అకాడమిక్ కోఆర్డినేటర్ ఎన్.వి శ్రీహరి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కోటపాటి నరేష్‌రాజా, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో..

ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయం, ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు ప్రాంగణంలో సీడీపీవో అరుణ, సూపర్‌వైజర్లు పారిశుధ్య పనులు చేపట్టారు. అలాగే స్థానిక గ్రంథాలయంలో చెదలు పట్టిన పుస్తకాలు, ఆట స్థలంలోని మొక్కలు గ్రంథపాలకుడు కోటేశ్వరరావు తొలగించారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులు ప్రత్యేక కార్యక్రంగా చేపట్టి రోడ్లపైన చెత్త, మురుగును తొలగించి బ్లీచింగ్ చల్లారు.

పేపరు, నార సంచులను వాడుదాం

కలిగిరి, (ఆంధ్రజ్యోతి):ప్లాస్టిక్‌రహిత సమాజ నిర్మాణానికి ప్రజలంతా సహకరించాలని ఎంపీడీఓ ప్రత్యూష ప్రజలకు పిలునిచ్చారు. కలిగిరి పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ మాట్లాడారు. కూరగాయలు, పల సరుకుల దుకాణాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. పర్యావరణానికి హాని కలిగించని పేపరు, నార సంచులతో పాటు, రాగి వస్తువుల వాడకాన్ని ప్రోత్సాహకానికి చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి రవిచంద్ర, సర్పంచ్ రాగి దివ్య, యల్లకర సతీష్, పుల్లా వేమనారాయణ, పుల్లా రవి, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ఆముదాలదిన్నెలో స్వచ్ఛాంధ్ర

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ ఆముదాలదిన్నెలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో ప్లాస్టిక్‌ను నివారించి ప్లాస్టిక్‌రహిత గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. పాఠశాల పరిసరాలతో పాటు గ్రామంలోని రోడ్ల వెంట మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని సచివాలయ సిబ్బందికి, గ్రామస్తులకు వివరించారు. ప్రతిఒక్కరూ మరుగుదొడ్ల వినియోగించుకోవాలని బహిరంగ మల విసర్జన చేయరాదని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు.

బీరం గుంటలో..

● అల్లూరు (ఆంధ్రజ్యోతి): చెత్తనుండి సంపద తయారీ కేంద్రాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఎంపీడీఓ రజనీకాంత్ తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బీరం గుంటలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తడి, పొడి చెత్తను సేకరించి షెడ్డుకు తరలించి వర్మీకంపోస్టు ఎరువును తయారీపై నిర్లక్ష్యం వీడాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలంటే మన చుట్టుపక్కల ప్లాస్టిక్ ఉండకూడదన్నారు. కార్యక్రమంలో ఈవో పీఆర్డీ పెంచల వీరేంద్ర, డీటీ ప్రవీణ్‌కుమార్, వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీనివాసులు, కప్పిర విష్ణు, రఘు పాల్గొన్నారు.



కావలి: ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది



కందుకూరు: కళాశాల ప్రాంగణంలో చెత్త తొలగిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



కలిగిరి: నారసంచులను వాడాలని సూచిస్తున్న ఎంపీడీఓ ప్రత్యూష



ఉలవపాడు: పాల్గొన్న సీడీపీవో అరుణ

కంప్యూటర్ వితరణ



మైకు సెట్ అందచేస్తున్న బీజేపీ అధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున

కలిగిరి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలుతో పాటు నాణ్యమైన విద్యనందిస్తున్నట్లు పాఠశాల పూర్వవిద్యార్థి ఆవుల కృష్ణారెడ్డి తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం శనివారం పాఠశాలకు కంప్యూటర్‌ను వితరణగా అందజేశారు. హెచ్ఎం భీమేశ్వర మాట్లాడారు. అర్హత, అనుభవం కలిగిన ఉపాధ్యాయుల విద్యాబోధనతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉన్నతస్థానాల్లో నిలవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సుగుణమ్మ ఉన్నారు.

మైకుసెట్ వితరణ

కొండాపురం, (ఆంధ్రజ్యోతి):స్థానిక ఆదర్శ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు ప్రిన్సిపల్ షేక్ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో సరస్వతీ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున పాఠశాలకు మైకుసెట్ వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రిన్సిపల్ ఖాదర్ బాషా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, చల్లా చినమాలకొండయ్య, కర్రా బాస్కర్ పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ.8.4 లక్షలు

వలేటివారిపాలెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మాలకొండ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామికి శనివారం భక్తుల నుంచి రూ.8.4 లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.వి సాగర్‌బాబు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అష్టోత్తరం టిక్కెట్లతో పాటు వివిధ రూపాల్లో ఈ ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు తెలిపారు.

భిక్షాటన చేయించరాదు

వలేటివారిపాలెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పిల్లలను బడికి పంపించకుండా భిక్షాటన చేయించడం చట్టరీత్యా నేరం అని ఏఎస్ఐ బ్రహ్మయ్య తెలిపారు. శనివారం ఆయన మాలకొండలో పిల్లలతో భిక్షాటన చేయిస్తున్న తల్లిదండ్రులకు ఆయన అవగాహన కల్పించి మాట్లాడారు. పేదపిల్లలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు



మాలకొండలో అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ బ్రహ్మయ్య

'పది' పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

- పరీక్ష కేంద్రం 100 మీటర్ల పరిధి వరకు 144 సెక్షన్ అమలు

లింగసముద్రం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని లింగసముద్రం, పెద పవనిలోని జడ్పీ హైస్కూళ్లలోని పరీక్షా కేం ద్రాల్లో శనివారం విద్యార్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. లింగసముద్రం కేఆర్ జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో 216 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. వీరిలో స్థానిక హైస్కూల్‌లో 91మంది, తిమ్మారెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు 42మంది, స్థానిక కేజీబీవీ విద్యార్థినులు 38, మొగిలిచెర్లలోని హైస్కూల్ విద్యార్థులు 30మంది ఉన్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ మాధవరావు తెలిపారు. అలాగే డిపార్ట్‌మెంటల్ అధికారిగా ఎస్.సుబ్బరామయ్య, 15మంది ఇన్విజిలేటర్లను నియమించారని చెప్పారు. అదేవిధంగా పెదపవని భోరావు జడ్పీ హైస్కూల్‌లోని పరీక్షా కేంద్రంలో 175మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో స్థానిక హైస్కూల్ విద్యార్థులు75 మంది, స్థానిక డా.బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు 81 మంది, స్థానిక ప్రతిభ బాల విద్యాలయం విద్యార్థినులు 19 మంది పరీక్షలు రాస్తున్నట్టు చీఫ్ సూప రింటెండెంట్ కె.కమల్‌కుమార్ చెప్పారు. 13మంది ఇన్విజిలేటర్లు, డిపార్ట్‌మెంటల్ అధికారిగా ఎస్.సుబ్బరామయ్యను నియమించారన్నారు. విద్యార్థులకు అవసరమైన మంచినీరు, వైద్యం ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉంచామని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు చెప్పారు.

కామధేను కేంద్రం అభివృద్ధికి కృషి చేస్తా: ఎమ్మెల్యే కాకర్ల



కేంద్రంలోని పశువులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల తదితరులు

కొండాపురం, మార్చి15 (ఆంధ్రజ్యోతి): చింతలదీవి పశుసంవర్ధక క్షేత్రంలో ఏర్పాటు చేసిన జాతీయ కామధేను పునరుత్పత్తి కేంద్ర అభివృద్ధికి కృషి చేస్తానని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. శనివారం కేంద్రాన్ని ఆయన సందర్శించి పిండోత్పత్తి ల్యాబ్‌ను పరిశీలించి వైద్యాధికారులతో వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కామధేను కేంద్రాన్ని గత ఐదేళ్లలో పట్టించుకున్న నాధుడు లేడన్నారు. మేలిరకమైన జాతులతో రైతులకు మేలు జరుగుతుందని కేంద్రానికి వచ్చి వైద్యాధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. అసెంబ్లీలో ఈ విషయాన్ని రాష్ట్ర వ్యవసాయ మంత్రి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు, నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్ణయ్య, మండల మాజీ ఉపాధ్యక్షుడు చంద్రబాబునాయుడు, తెలుగు యువత అధ్యక్షుడు దాసరి అశోక్, టీడీపీ నాయకులు, అధికారులు పెద్దస్వామి, రామన్, దేవరాజు పాల్గొన్నారు.

ఇలా వస్తారు.. అలా వెళతారు!

- ఒంగోలు నుంచి విధులకు వస్తున్న ఎంపీడీవో
- రాకపోకలకే సరిపోతున్న సమయం
- పరిష్కారం కాని ప్రజా సమస్యలు
- అభివృద్ధిపై కొరవడిన పర్యవేక్షణ
- పట్టించుకోని ఉన్నతాధికారులు



మధ్యాహ్నం 12 గంటలకు కూడా ఖాళీగా ఉన్న ఎంపీడీఓ కుర్చీ

వలేటివారిపాలెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల ఎంపీడీఓ నరేంద్రదేవ్ సమయం రాకపోకలకే సరిపోతుంది. ఉదయం గం10.35లకు రావాల్సిన ఎంపీడీఓ మధ్యాహ్నం 12గంటలు అయినా కార్యాలయానికి రావడం లేదు.వివిధ పనులపై ఎంపీడీఓ కోసం వచ్చిన ప్రజలు ఎదురుచూసి ఎప్పటికీ రాకపోడంతో వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. ఈ సంఘటన ఈ శనివారం రోజు మాత్రమే కాదు. ఆయన బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఇదే తంతుగా జరుగుతుంది. ఉన్నతాధికారులు, పాలకులు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు ఎవరైనా ప్రజలు ఫోన్ చేస్తే నేను వచ్చేది ఇలాగే. నేను ఒంగోలు నుంచి రావాలి. నా భార్యను డ్యూటీకి తీసుకెళ్లి నేను డ్యూటీకి రావాలి. అందువలనే నాకు ఆలస్యం అవుతుందని సమాధానం ఇస్తున్నారు. ఈ విషయంపై తాను స్థానిక ఎమ్మెల్యేకు అనుమతి తీసుకున్నట్లు నిర్లక్ష్య సమాధానం చెబుతున్నారు.

● పర్యవేక్షణ చేయరు..

21 పంచాయతీల్లో రూ.3కోట్ల ఉపాధి నిధులతో 25సిమెంటు రోడ్ల పనులు జరుగుతున్నాయి. అలాగే రూ.7కోట్లతో రోళ్లపాడు, కొండసముద్రం, శింగమనేనిపల్లె, కళవళ్ల గ్రామాలకు అనుసంధానం చేసే తారురోడ్ల పనులు జరుగుతున్నాయి. అన్ని గ్రామాల్లో జోరుగా ఉపాధి పనులు జరుగుతున్నాయి. ఏ ఒక్క అభివృద్ధి పనులను ఆయన పరిశీలించిన పాపాన పోలేదు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు చేసిన సందర్భాలే లేవు. ప్రతి రోజూ మధ్యాహ్నం 12గంటలకు కార్యాలయానికి రావడం సాయంత్రం 4గంటలకే వెళ్లడం పరిపాటిగా మారింది. ఎంపీడీఓ సమయపాలన పాటించకపోతే ఆయన పరిధిలోని సిబ్బంది సమయపాలన ఎలా పాటిస్తారు. ఎంపీడీఓను ఆసరాగా చేసుకొని సచివాలయ ఉద్యోగులు కూడా సమయపాలన పాటించక పోవడంతో సకాలంలో ప్రజలకు సేవలు అందడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమయ పాలన పాటించి సకాలంలో ప్రజలకు సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పాత బిట్రగుంటలో గడ్డివామి దగ్ధం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

బిట్రగుంట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పాతబిట్రగుంట కర్తం క్రిష్ణ ప్రసాద్‌రెడ్డికి చెందిన 5ఎకరాల గడ్డివామి శనివారం దగ్ధమైంది. పొలంలో ఏర్పాటు చేసిన గడ్డివామికి గుర్తతెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు స్థానికుల విషయం తెలుసుకుని వెళ్లినట్లు చెప్పారు. ఈ విషయాన్ని జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసులురెడ్డికి సమాచారం ఇవ్వగా అతను కొండబిట్రగుంట వద్ద ఉన్న కావలి అగ్నిమాపక సిబ్బంది, నెల్లూరు సిబ్బందిని పంపినట్లు చెప్పారు. వీరు మంటలు పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారని తెలిపారు.

అంబేద్కర్ ఆలోచనతోనే సమ సమాజం

- రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర నాయకులు ఉజ్వల్

కావలి టౌన్, మార్చి15 (ఆంధ్రజ్యోతి) అంబేద్కర్ ఐడియాలజీతోనే సమసమాజ స్థాపన సాధ్యమని రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర నాయకులు వై.ఉజ్వల్ తెలిపారు. శనివారం స్థానిక వెంకగళరావు నగర్‌లోని రోటరీ క్లబ్ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఆత్మకూరు రామకోటయ్య ఆధ్వర్యంలో పార్టీ నియోజకవర్గ సమావేశం జరిగింది. ముందుగా ట్రంకు రోడ్డు బ్రిడ్జి కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి నాయకులతో కలిసి పూలమాలలు వేశారు. సమావేశంలో అంబేడ్కర్, కాన్షిరామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉజ్వల్, రామకోటయ్యలు మాట్లాడారు. దళిత బాంధవు డు కాన్షిరాం 91వ జయంతిని పురస్కరించుకుని మార్చి 15న భారత రాజ్యాధికార దినోత్సవంగా జరుపుకుందామన్నారు. కాన్షీరాం స్ఫూర్తి తో అంబేడ్కర్ ఐడియాలజీతో అందరూ ఏకమై ముందుకు కదలి రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియాను బలోపేతం చేసుకోవాలన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు ఆత్మకూరు రాములు, గోని సురేష్, నక్కా గిరి, కాకి మల్లికార్జున, నాగార్జున, జెడ్డా వెంకయ్య, ఎస్.మల్లి తదితరులు పాల్గొన్నారు.

నేడు కావలిలో ఉచిత కంటివైద్యశిబిరం

కావలి, మార్చి15 (ఆంధ్రజ్యోతి): మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రామ్మూర్తిపేటలోని సాయిబాబా మందిరంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్యసంఘం అధ్యక్ష, కార్యదర్శులు తటవర్తి రమేష్, కార్యదర్శి ఓరుగంటి రామక్రిష్ణలు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మోడరన్ ఐ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ నెల్లూరు వైద్య బృందం ప్రపంచ గ్లకోమా వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ భూ ఆక్రమణలపై చర్యలు

కొండాపురం, మార్చి15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూ ఆక్రమణలపై మండల రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. మర్రిగుంట పంచాయతీలోని ఆక్రమిత ప్రభుత్వ భూముల్లో శనివారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి వివిధ సర్వే నెంబర్లలోని 63.95 ఎకరాలు ఆక్రమించుకున్నారని చెప్పారు. దీనిపై సర్పంచ్ గోపి చేసిన పిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆ వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేశామన్నారు. సదరు భూముల్లోకి ఎవరూ రాకుండా చర్య తీసుకోవాలన్నారు.

గ్రేడింగ్‌పై అవగాహన



పొగాకు గ్రేడింగ్ విధానాన్ని పరిశీలిస్తున్న బోర్డు అధికారి లక్ష్మణరావు

కందుకూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గ్రేడింగ్ విధానంను బట్టి పొగాకు వేలం, అమ్మకాలు జరగుతాయని పొగాకు బోర్డు తేలిక నేలల ప్రాంతీయ అధికారి ఎం.లక్ష్మణరావు రైతులకు సూచించారు. శనివారం ఆయన కందుకూరు-1 వేలం కేంద్రంను సందర్శించి పొగాకు గ్రేడింగ్ విధానాన్ని పరిశీలించి మాట్లాడారు. లోగ్రేడ్, హీట్, సాఫ్ట్ డ్యామేజ్ ఉన్న పొగాకు బేళ్లను వేలం కేంద్రంకు తీసుకురావద్దని సూచించారు. అమ్మకాలు ప్రారంభదశలో ఉన్నందున నాణ్యమైన పొగాకు బేళ్లు మాత్రమే తీసుకురావాలన్నారు. రైతులకు తగిన గిట్టుబాటు ధర కల్పించేలా వేలంలో పాల్గొనాలని వ్యాపారవేత్తలతో మాట్లాడారు. వేలం ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని వేలం నిర్వాహణ అధికారి కిరణ్, సిబ్బంది సూచనలిచ్చారు.



రూ.3 వేలకే కంప్యూటర్!

● పదో తరగతి విద్యార్థి ఘనత

కంప్యూటర్ ప్రతి ఒక్కరికి అవసరమైన ఈ రోజు ల్లో దానిని అతి తక్కువ ధరకే అందించాలన్న సంకల్పంతో ఓ ఉన్నత శ్రేణి విద్యార్థి కేవలం రూ.3 వేలకే కొనుగోలు చేసేలా రూపొందిం చాడు. నెల్లూరురూరల్ మండలం కలివెల పాళెంకు చెందిన చెన్నారెడ్డి మను క్రాంత్‌రెడ్డి తనయుడు మహాన్‌రెడ్డి టెన్త్ చదువుతు న్నాడు. తనకున్న కంప్యూటర్ పరిజ్ఞానంతో హార్డువేరును తయారు చేసి ప్రోగ్రామింగ్, లెర్న్ తయారు చేసి దాని పనితీరును శనివారం కలివెలపాళెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వివరించాడు. ఇందులో యూట్యూబ్, కాల్‌క్యులేటర్ ఉంటాయని, టీవీ, మానిటర్‌కు ఇంటర్‌నెట్ ద్వారా కనెక్ట్ చేసుకోవచ్చని తెలిపారు. పేద కుటుంబాల విద్యార్థులకు ఈ కంప్యూటర్ రూ.3 వేలకే అందించడమే గాక కంప్యూటర్ జ్ఞానం పెరిగేందుకు దోహదపడుతుందని మహాన్‌రెడ్డి చెప్పుకొచ్చారు.

- నెల్లూరురూరల్, (ఆంధ్రజ్యోతి)

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలి

● జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు(విద్య), మార్చి 15(ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో శనివారం సాయంత్రం నిర్వహించిన స్వచ్ఛఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగిం చకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రభుత్వం దీనిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్లాస్టిక్‌ను అరికట్టేందుకు సమష్టిగా కృషి చేస్తే వాటివల్ల వచ్చే అనర్థాలను నివారించ వచ్చని తెలిపారు. అనంతరం పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ స్రవంతి, నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, అడిషనల్ కమిషనర్ నందన్, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎంఈవోలు తిరుపాలు, మురళీకృష్ణ, ఎస్‌వైకే అధికారి మహేంద్రరెడ్డి, డాక్టర్ ప్రసన్న, డాక్టర్ పూర్ణ, డాక్టర్ సాయిప్రియలు పాల్గొన్నారు.

● నెల్లూరు(జడ్పీ): జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పాల్గొన్నారు. అధికారు లతో కలిసి ప్రత్యేక ర్యాలీ నిర్వహిం చారు. అనంతరం కార్యాల యంలో ప్లాస్టిక్ కవర్లు, చెత్త, ఇతర వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో సీఈవో విద్యారమ, ఉద్యోగులు పెంచల య్య, కొండయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, మేయర్ స్రవంతి, పక్కన కమిషనర్ సూర్యతేజ

డీఆర్‌డీఏ, సీడాప్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

నెల్లూరు(హరనాథపురం), మార్చి 15(ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో గ్రామీణ నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తా మని డీఆర్ డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజ కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. టెలికాం, బ్రాడ్ బ్యాండ్ టెక్నీషియన్, కంప్యూ టరింగ్, పెరిఫరల్స్ తదితర కోర్సుల్లో శిక్షణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన 18 నుంచి 30 ఏళ్ల వయసు గల అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. ఉచిత వసతి, భోజన సదు పాయాలతో పాటు మూడు నుంచి ఐదు నెలల పాటు ఈ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ జారీ చేయడమే కాకుండా ఉపాధి కల్పిస్తామని పేర్కొ న్నారు. అర్హత కలిగిన వారు బయోడేటా, ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలతో నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జాబ్స్ కార్యాలయంలో సంప్రదించా లని పేర్కొన్నారు. వివరాలకు 0861 2321261, 94900 80861, 89851 20012ను సంప్రదించాలని తెలిపారు.

పకడ్బందీగా పదోతరగతి పరీక్షలు

● డీఈవో బాలాజీరావు

సంగం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 17 నుంచి ప్రారంభమయ్యే పదోతరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వ హించేందుకు ఏర్పాట్లు చేశా మని డీఈవో బాలాజీరావు పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల ఏర్పాట్లను పరిశీలిం చారు. పదవ తరగతి చదివే విద్యార్థులతో మాట్లాడారు. ఎటువంటి భయం లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు హాల్‌టికె ట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ జిల్లాలో 33,434 మంది విద్యా ర్థులు పదవ తరగతి పరీక్షలు రాస్తున్నారని, అందుకు 174 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశా మన్నారు. ప్రతి కేంద్రంలో ప్రతి విద్యార్థికి బల్లలు, తాగునీటి వసతి, వెలుతురు ఉండే విధంగా కోత లేకుండా విద్యుత్ సదుపాయం, పోలీస్ బందోబస్తుతో పాటు మెడికల్ సిబ్బంది ఏర్పాటుకు అన్ని శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలిచ్చారన్నారు. పరీక్షలకు ప్రతి కేంద్రంలో ఇన్విజిలేటర్లతోపాటు డిపార్ట్ మెంట్ ఆఫీసర్, చీఫ్‌లను నియమించామ న్నారు. అదేవిధంగా పర్యవేక్షణకు స్క్వాడ్స్ సిట్టింగ్ స్క్వాడ్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ నియ మించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డిప్యూటీ డీఈవో జానకీరామ్, మల్లయ్య, ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యార్థులకు హాల్ టికెట్‌లు పంపిణీ చేస్తున్న డీఈవో బాలాజీరావు

'సోమశిల'లో అక్రమవేట సాగిస్తే కఠిన చర్యలు

● మత్స్య శాఖ జేడీ నాగేశ్వరావు

అనంతసాగరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో అక్రమ చేపలవేట సాగిస్తే కఠిన చర్యలు తప్పవని మత్స్యశాఖ జేడీ నాగేశ్వరావు హెచ్చరించారు. డ్యాంలో నిషేధిత అలివి వలలతో కొందరు వేట సాగి స్తున్నట్లు ఇటీవల జాలర్లు చేసిన ఫిర్యాదు మేరకు ఆయన శనివారం తమ సిబ్బందితో కలిసి తెప్పల్లో జలాశయం ఎగువ ప్రాంతాలకు వెళ్లి చేపలవేటను తనిఖీ చేశారు. ఆయన రాకను తెలుసుకున్న అక్రమ వేటగాళ్లు పరా రైనట్లు సమాచారం. ఈమేరకు ఆయన అలి వివల వేటపై హెచ్చరికలు జారీ చేశారు. నిబం ధనలు ఉల్లఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.

సోమశిలలో 55.470 టీఎంసీల నీరు నిల్వ

సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 97.988 టీఎంసీలు కాగా శనివారం నాటికి 55.470 టీఎంసీలు నిల్వ ఉంది. డెల్టాకు 600, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



● ఎన్నో అవార్డులు సాధించిన మనోజ్ఞ
● 500లకు పైగా నృత్య ప్రదర్శనలు
● తాజాగా గిన్నిస్‌బుక్‌లోనూ స్థానం

నాట్యమయూరం!

చిన్నతనం నుంచే ఆమె భరతనాట్యంపై మక్కువ పెంచుకుంది. కుమార్తె ఆసక్తిని గమనించిన తల్లి దండ్రులు కూడా మంచి శిక్షణ ఇప్పిం చారు. ఇంకే ముంది.. కాళ్లకు గజ్జెలు కట్టి నాట్యం చేస్తే ప్రతి ఒక్కరూ చప్పట్లు కొట్టాల్సిందే. ఇప్పటివరకు 500లకుపైగా ప్రదర్శనలు ఇచ్చి ఎంతోమంది నుంచి అవార్డులు అందుకు న్నారు కారంపూడి మనోజ్ఞ. ఇటీవల ఆరుగంటల పాటు నిర్విరామంగా భరట న్యాటం చేసి గిన్నిస్ బుక్ లోనూ స్థానం సంపాదిం చుకుంది.

- నెల్లూరు (వెంకటేశ్వరపురం, ఆంధ్రజ్యోతి)

నెల్లూరులోని రంగనాయకుల పేటకు చెందిన కారంపూడి సురేష్, హేమలత కుమార్తె కారం పూడి మనోజ్ఞ చిన్నతనంలోనే నాట్యంపై ఆసక్తి పెంచుకుంది. దీనిని తల్లితండ్రులు నగరంలోని గురుకృప కళాక్షేత్రంలోని సురభి గాయత్రి వద్ద నాట్య శిక్షణను ఇప్పించారు. భార తీయ సంప్రదాయ నాట్యకళ అయిన భరత నాట్యంలో డిప్లొమా పూర్తి చేసిన మనోజ్ఞ కూచిపూడి, ఖతక్, మోహినీ నాట్యం, ఒడిస్సీ నాట్యంలోనూ ప్రావీణ్యత సంపాదిం చుకుంది. అంతేకాదు.. గానంలోనూ తన కంటూ మంచి గుర్తింపు తెచ్చుకొన్నది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ దేవాలయాల్లో ఇప్పటి వరకు దాదాపు 500 లకుపైగా నాట్య ప్రదర్శనలు ఇచ్చింది. ఎంతోమంది ప్రముఖుల నుంచి అవార్డులు, జ్ఞాపికలను అందుకున్నారు. హోమియోపతిలో వైద్యవిద్య అభ్యసిస్తున్న మనోజ్ఞ ఇప్పటివరకు ఇండియన్ రికార్డు, నాణ్యజరి, నాణ్యమయూరం అవార్డులతో పాటు ఆహా సూపర్‌స్టార్‌లో లిటిల్ విన్నర్‌గా నిలిచింది. ఇటీవల తమిళనాడులోని తిరు వన్నియూర్ జరిగిన త్యాగయ్య చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆరు గంటలపాటు ఆపకుం డా భరతనాణ్యం చేశారు. అలాగే నాట్యముద్రలు వాటి విశిష్టతల గురించి అడిగిన ప్రశ్నలకు మనోజ్ఞ సమాధానాలు ఇచ్చారు. ఆమె ప్రతిభను పరీక్షించిన నిర్వాహకులు గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు అందించారు. వైద్య విద్యను అభ్యసి స్తూనే మనోజ్ఞ ఇలా నాట్యకళలో అవార్డులను కైవసం చేసుకొంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.



గిన్నిస్‌బుక్ అవార్డు అందుకుంటున్న మనోజ్ఞ

పెంచులోరి నిత్యాన్నదానానికి రూ.1.5లక్షలు

రాపూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోన క్షేత్రంలో నిత్యన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన ఉప్పలపాటి నేహన్ని కుటుంబం రూ.1.5 లక్షల విరాళాన్ని ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డికి శనివారం అందచేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించి, వేదపండితులతో ఆశీర్వచనం చేయించారు. అదేవిధంగా వేసవి కాలం దృష్ట్యా భక్తుల కోసం ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్ల ఏర్పాటు చేయనున్నారు. పందిళ్ల ఏర్పాటుకు సంబంధించి తుమ్మల జనార్దన్ రెడ్డి టెండరు దక్కించుకున్నట్లు ఈవో తెలిపారు.

అమరావతిలో.. శ్రీవారి కల్యాణోత్సవం

రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.

-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



చంద్రబాబు దంపతులకు హారతి ఇస్తున్న వేద పండితుడు



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు







శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు




గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు



చంద్రబాబుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు



కల్యాణోత్సవంలో పాల్గొన్న వేమిరెడ్డి దంపతులు, మంత్రి నారాయణ



మంగళసూత్రాలు చూపుతున్న వేద పండితులు



కల్యాణం తిలకిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని, మంత్రి ఆనం, బీఆర్ నాయుడు



కల్యాణం తిలకిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రి నారాయణ



కల్యాణ్యాన్ని తిలకిస్తున్న పీఠాధిపతులు



వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు



కల్యాణ మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యేలు పుల్లారావు, ఆనందబాబు, రామాంజనేయులు తదితరులు